
ఛాంపియన్ శిశువు
మొదట పెట్టిన రెండు సంవత్సరాలలోనే, అమూల్‌స్ప్రే, మిగతా అన్ని బ్రాండ్‌లను అధిగమించి, శిశు ఆహారములలో అగ్రస్థానం సంపాదించింది. అది ప్రత్యేక పద్ధతిలో (స్ప్రే-డ్రైయింగ్), ప్రత్యేక ఫార్ములాతో, ప్రత్యేకమైన ఆహారంగా తయారుచేయబడింది. మీ ప్రత్యేక శిశువుకోసం, అమూల్‌స్ప్రే సులభంగా జీర్ణమై, సంపూర్ణ ఆహారం కలిగిస్తుంది. అవసరమైన విటమిన్లూ, ఖనిజ పదార్థాలూ గలది, మెదడు మరియు శరీరం పెరుగుదలకు కావలసిన ప్రొటీన్లు అధికంగా ఇస్తుంది.
అమూల్‌స్ప్రే
తల్లిపాలకు అదర్శవంతమైన ప్రత్యామ్నాయం
ఛాంపియన్ శిశు ఆహారం
Amulspray

ఉత్తరాలు

కోరిక

1—9—70 వ తేదీ ఆంధ్రపత్రికలో "వాణి" స్వీట్‌సిక్స్‌టీన్ కథలు బాగున్నాయి. 'ఆరాధన' 'ఆచరణలో అభ్యుదయం' సీరియల్స్ చాలా ఆసక్తిగా కొనసాగుచున్నది. ముఖ్యముగా యద్దనపూడి సులోచనారాణిగారి 'ఆరాధన' చదువుతున్నంతసేపు సినిమా చూస్తున్నట్లుగానే యుంటుంది. కొన్ని ఘట్టాలు చదువుతున్నప్పుడు నేత్రములు అశ్రుభరితాలవుతాయంటే నమ్మండి. ఆ కథలోని "అనూరాధ" పాత్రను గూర్చి చెప్పాలంటే మాటలు చాలవు. 'ఆరాధన' సీరియల్ పత్రికకే ఆయువు పట్టవంటిది. ఇలాంటి మంచి కథలను అందజేస్తున్నందులకు రచయిత్రికి, మా అభినందనలు తెలియజేయుటకై వ్రాయుచున్నాము. ఈ లెటర్ వ్రాయుచున్నాము.

యస్. స్వతంత్రరెడ్డి, ఎ. మల్లయ్య, యం. డి. హిసామొద్దీన్, టి.కిష్టయ్య. [బెల్లంపల్లి]

'ఎందరో మహానుభావులు..... శీర్షిక, లాభం లేదనుకుంటాను. వారందరు ప్రతివారునికి పరిచయమైన వ్యక్తులే. వీరికంటే.... గతించిన వారిని పరిచయం చేస్తే చాలా మంచిదని నా అభిప్రాయం. ఇక ముందైనా ఈ శీర్షికను నిలిపితే బావుంటుంది

—ఒకమహానుభావుడు [ఎస్. ఎన్. క.] [చిత్తూరు]

సీరియల్

ఉప్పల విజయలక్ష్మిగారి 'ఆచరణలో అభ్యుదయం' బాగా నడుస్తోంది. గాని 11—6—70 సంచికలో చాలా ఇంగ్లీషుమాటలు ఉన్నాయి. ఉ. సెక్సు, సెన్సేషన్ క్రియేట్, పర్సంటు, మొ. చాలామందికి ఆ మాటలు అర్థాలు తెలియవు. ఈ వారపత్రికలు చదివేవాళ్ళు చాలామంది సామాన్యమైన చదువుగలవారే! వారికేమి అర్థమవుతుంది? ఈ కథలోనేకాక అనేకచోట్ల ఇంగ్లీషు మాటలు వాడుతున్నారు. ఒకవేళ అలావాడినా బ్రాకెట్‌లో వాటి తెలుగు అర్థాలు వ్రాస్తే అందరికీ అర్థమవుతుంది. నా సూచనని సహృదయతతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను. —డా. ఎస్. కె. ఆర్., [ధన్‌బాద్

వ్యాసాలు

4—9—70 వారపత్రికలో శ్రీ వి. వి. ప్రభాకర్ జోషిగారు వ్రాసిన వృత్తాన్ని చదివాను. వారు చాలా పొరపాటు పడ్డారు. గుడిపెట్టిగారి మహాభద్ర రచనలోని అర్థాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయారు.

ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ చీలిపోయింది. అరాచకాలు, అల్లర్లు ఎక్కువయ్యాయి. ఈ అరాచకాలను చూసి భారత మాత విలపిస్తున్నదే కాని ఒక్క కాంగ్రెస్ చీలిపోవటం వల్ల కాదు.

వల్లభనేని కనకచంద్రయ్య [అంగలకుదురు]

*　*　*

ఈ వారం కార్టూనులు ఎక్కువగా ఉన్నప్పటికీ, 'వినాయక చవితి' సందర్భ కాబట్టి పాఠకులంతా మన్నించబడ్డారు.

'ఎందరో మహానుభావులు' శీర్షిక క్రింద రాజకీయ నాయకులను గూర్చి మీ సంపాదకుడు వ్రాసిన అభిప్రాయాలతో ఏకీభవించుచున్న పాఠకులలో నేను ఒకణ్ణి. కథలకే కాకుండా 'నాటకం'కు కూడా మా [మీ] పత్రికలో ప్రాముఖ్యం ఇస్తున్నందుకు నా కృతజ్ఞతలు. డి. జె. మిత్రో [బరంపురం]

ఒకవారం విపరీతం

ఒకవారం విపరీతం శీర్షికలో, [4—9—70 ఆంధ్రపత్రిక వారపత్రిక] సీతారాం — వార్తాస్త్రీలు హెడ్డింగ్ క్రింద వ్రాస్తూ... ఈ విషయం ఒరిస్సా ముఖ్యమంత్రి వెల్లడించారట అని వ్రాశారు. వెల్లడించింది డా. హరేకృష్ణ మెహతాబ్, మాజీ ఒరిస్సా ముఖ్యమంత్రి.

ఎ. విశ్వేశ్వర్‌రెడ్డి [హైదరాబాద్]

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 25-9-'70
శ్రీ సాధారణనామ సం॥ భాద్రపద బ॥ దశమి

సంపుటము: 64 సంచిక: 4

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
“ఇద్దరమ్మాయిలు”లో నాగేశ్వరరావు



ఏవిటో గోలల! వాటిలో దేనినీ నేను నమ్మను.
పాతకాంగ్రెస్
కేరళ కాంగ్రెస్
కొత్త కాంగ్రెస్
ముస్లిమ్ లీగ్
ఇండిపెండెంట్లు
ఎస్.ఎస్.పి
వేరు దారులు
ఇందిర ప్రభుత్వం నశించాలి
ఇందిర ప్రభుత్వాన్ని బలపరచండి.
డి.ఎం.కె.
ఉత్తర ప్రదేశ్ లో
నాదగర తురుఫు ముక్క ఉన్నదని గుర్తుంచుకో!
అస్థిపంజరానికి అలంకారం
ఇంకా అది అస్థిపంజరం లాగే ఉంది.

ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఏమిటి?

ప్రపంచంలో ప్రజాస్వామ్య సంస్థ అభివృద్ధికి సంబంధించిన ఘట్టం ఒకటి చూడగలిగాము. ఈ సందర్భంలో ప్రధానమంత్రి రాజ్యసభలో మాట్లాడుతూ—భారత ప్రజలుగాని, ప్రపంచ ప్రజలుగాని [పార్టీలో కొందరు వాదించినట్లు] ఇదంతా అధిక మాట తప్పటం అనే దృష్టితో చూడరని తాను అనుకుంటున్నట్లు చెప్పారు.

అంతకుముందు ప్రధానమంత్రి ఒక సవాల్ కూడా చేశారు: అంతఃకరణానికీ, స్వార్థానికీ ముడి పెట్టరాదనీ, ఓటింగు విషయంలో స్వతంత్రం ఉండటానికి వీలులేదనీ అన్నారు.

ఈ ఉద్బోధ చేసిన వ్యక్తి ఎవరు? శ్రీ సంజీవరెడ్డి ఎన్నిక సందర్భంలో అంతఃకరణం వాదాన్ని స్వార్థంకోసం వినియోగించి కాంగ్రెసు పార్టీని చీల్చిన వ్యక్తి.

దేనికి విరుద్ధం

ఆర్డరు జారీ చేసి భరణాలని రద్దు చెయ్యగలిగినప్పుడు పార్లమెంటులోకి బిల్లుని ఎందుకు తీసుకువచ్చారని ఎవరో అడగగా ప్రధానమంత్రి—పార్లమెంటులో ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్య పద్ధతి అనీ, ఆర్డరు జారీ చెయ్యటం దానికి విరుద్ధం అనీ చెప్పారు. రాజ్యసభలో వోడిపోగానే వారు ప్రజాస్వామ్య పద్ధతిని గాలికి వదిలివేశారు. ఆర్థికమంత్రి శ్రీ చవాన్ రాజ్యసభలో ఇలాగ అన్నారు—

'సంస్థానాధీశ్వరుల గుర్తింపుని రద్దుచేసే అధికారాన్ని రాజ్యాంగము రాష్ట్రపతికి ప్రసాదించింది. పార్లమెంటులో చర్చ జరిగినప్పుడే ఈ అధికారాన్ని వాడవలసినదనీ, రాజ్యాంగం సవరింపు బిల్లును తీసుకుని వచ్చి ఉండరాదనీ కొందరు అన్నారు.

'రాజ్యాంగం సవరణ బిల్లు ఆమోదించబడ్డ తర్వాత రాష్ట్రపతి ఆర్డరు జారీ చేసి ఉంటే బాగుండేదని ప్రభుత్వంవారి అభిప్రాయం. కాని బిల్లు ఒక వోటులో ఒక భాగంతో వోడిపోవటంచేత అది వీలుకాకపోవటం కేవలం దురదృష్టం.'

రెండుసార్లు వోటు

కథ ఇంతటితో ముగియదు. లోకసభలో ఒక కొత్త కాంగ్రెసు సభ్యుడు తన వోటుని రెండు పార్లు వేశాడు, మరొక సభ్యుడు ఊళ్లో కొన్ని రోజులుగా లేని వ్యక్తి తరపున వోటు వేశాడు.

శ్రీ మోహన్‌లాల్ గౌతమ్ పాత కాంగ్రెసు సహాయంతో రాజ్యసభకి ఎన్నిక అయ్యారు. వోటింగు జరిగేముందు ఆయన తన గొడుగుని మార్చి మేడమ్ గాంధిగారి పక్షం మారిపోయారు.

అంతఃకరణం మేలుకున్న మరొక పాత కాంగ్రెసు సభ్యుడు కూడా కొత్త కాంగ్రెసు వైపుకి మారిపోయాడు. వీరిద్దరూ పాత కాంగ్రెసుకి విశ్వాసంగా ఉండి ఉంటే రాజ్యసభలో బిల్లు మూడు వోట్లతో వోడిపోయి ఉండేది.



278 మంది మాజీ సంస్థానాధీశ్వరుల గుర్తింపు రద్దుచేస్తూ ఉత్తర్వుపై రాష్ట్రపతి సంతకం చేశారు. —([illegible])

ఆమోదించక మునుపే . . .

వెలువడిన వార్తల ప్రకారం, రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిగారు కేంద్ర మంత్రివర్గం ఆమోదించకముందే ఆర్డరుమీద సంతకం చేశారుట. ఇది సక్రమ పద్ధతి కాదని ఆర్డరుని రాజ్యసభలో నడుపుతున్నప్పుడు ఎవరో అనగా శ్రీ చవాన్ ఆ మాటని పట్టించుకోనేలేదు.

అసలు ఈ రాష్ట్రపతి ఆర్డరుకి సరయిన ఆధారం ఏమిటి? ప్రభుత్వపక్షంవారు ఉదహరించిన రాజ్యాంగ భాగమేనా? ప్రజా, దేశ శ్రేయస్సుకి విరుద్ధంగా ప్రవర్తించే సంస్థానాధీశ్వరులని గుర్తించకుండా చర్య తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది కాని ఇది ప్రత్యేకంగా ఒక్కొక్క వ్యక్తి విషయంలో అనుసరించవలసిన అధికారాన్ని మాత్రం ఇచ్చే హక్కు. ఈ హక్కు, ప్రభుత్వం ఇంతకి ముందు విచక్షణతో ఉపయోగించింది. అంతేకాక, తన చర్యని సుప్రీమ్ కోర్టుచేత ఆమోదించుకున్నది. ఇక్కడ, మూకుమ్మడిగా సంస్థానాధీశ్వరులని గుర్తించకుండా ఆర్డర్లని జారీ చెయ్యడం ఎక్కడ? ప్రభుత్వంవారు చేసిన పని అర్థరహితమయినదని కొందరు అనవచ్చు. అసలు సంస్థానాధీశ్వర వ్యవస్థనే ఈవిధంగా రద్దు చెయ్యవచ్చునా? లేదనే కొందరు అంటారు. కొన్ని [illegible] అధికారంలో ఉన్న సంస్థానాధీశ్వరులు వారి 'పదవు'ల్ని కోల్పోవచ్చుగాని సంస్థానాధీశ్వరుల వ్యవస్థ ఎలాగ రద్దు అవుతుంది? తమ 'సంస్థానాధీశ్వరత్వం' వదులుకున్న వారి వారసుల నియామకం జరగాలి! ఇది జరిగేదాకా సంస్థానాధీశ్వరుల పద్ధతి, వారి భరణాలు రద్దు కావు. ఒక వ్యక్తి భరణాలని ఆపివేసినంతమాత్రాన ఆ 'భరణాలని' రద్దు చేసినట్లు కాదుకదా! ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వపక్షంవారు గమనించినట్లు తోచదు. భాగం 366 (22) ప్రకారం నడవడి సరిగ్గా లేని వారిని తొలగించవచ్చుకాని అసలు తొలగించటానికి ఎవరూ లేకుండా చెయ్యటం కాదు.

నేటి పరిస్థితి

బిల్లు గనుక పార్లమెంటులో పాస్ అయిఉంటే సంస్థానాధీశ్వరులు నేడు ఉన్నంత మంచి పరిస్థితిలో ఉండేవారు కాదేమో. భాగం 366 [22] ప్రకార

పాలనత్వం పోవాలని తీర్పే హక్కు రాష్ట్రపతికి [బ్రిటిషు సింహాసనాన్ని అధిష్ఠించేవారికి ఉన్నట్లే] ఉంటుంది అయితే, ప్రభుత్వానికీ, సంస్థానాధీశ్వరుడికీ మధ్య ఉన్న ఒప్పందంలోని విషయాలన్నిటినీ పాటించే బాధ్యత రాష్ట్రపతికి ఉంటుంది

బరోడా మహారాజా విషయంలో ఆరోపణ— దుష్ప్రవర్తన 278 మంది సంస్థానాధీశ్వరుల విషయంలో చెల్లే ఆరోపణ ఏమయినా ఉందా, వారందరూ రాజకీయంగా ఇబ్బందులు అయి కూర్చున్నారనటం కన్నా! భాగం 366 [22] నిర్వచనానికి సంబంధించిన భాగము కాని రద్దు చెయ్యటానికి సంబంధించినది కాదు. ఇదంతా తెలుస్తూనే ఉంది. కాని, కొత్త కాంగ్రెస్‌వారి వారు మాత్రం తమ ఆవేశంలో దీనిని పట్టించుకునే పరిస్థితిలో లేరు పార్లమెంటరీ విధానం గౌరవ మర్యాదలకి భంగం తెచ్చే అడ్డదార్లని తొక్కుతున్నారు, అంతే. ప్రజా జీవితంలో కొన్ని నియమాలని పాటించవలసి ఉంటుంది నేటి నాయకత్వానికి ఇవి అనవసరం అనే భావం ఎందరికో కలుగుతున్నదంటే అతిశయోక్తి కాదు.

మిగతావి కూడా

ఇండియన్ సివిల్ సర్వీస్ వారి 'అధికారా' లని కూడా త్వరలోనే రద్దు చేస్తామని ప్రధానమంత్రి ఒక ప్రశ్నకి సమాధానం ఇస్తూ అన్నారు. నేడు ఇం. సి. స. వారి నౌకర అంటకంటేనారు ఎవరో కొలవన లేరు. ప్రధానమంత్రి కార్యదర్శి శ్రీ హక్సర్ ఇం. సి. స. కి చెందినవారు కాదు.

మూడు వంకాలు

సంస్థానాధీశ్వరులలోబాటు 'భూస్వామ్య' వ్యవస్థ పోతోంది, అంటారు ఇది నిజమే కావచ్చు కాని ఇతర 'స్వాముల' మాట ఏమిటి? నేడు దేశంలో మూడు పెద్ద వంశాలు పెరుగుతున్నాయి. ఒకటి నెహ్రూ వంశం, రెండవది వంశీవంశం, మూడవది లక్ష్మా వంశం.

ఇక రాష్ట్రపతి, గవర్నర్లు, మంత్రులు వీళ్ల మెంటు సభ్యులు — వీరి 'అధికారాల' మాటేమిటి?

నామకార్థానికి పోంగే ఏకీకర్తు దేశంలో రాష్ట్రపతికి 'ఎ. డి. సి ' ఎందుకు? రాష్ట్రపతి పరివారంలో కాని, పశ్చిమబెంగాలు గవర్నరు శ్రీ ధవాన్ పరివారంలో కాని తగ్గింపులు ఏమయినా జరుగుతున్నాయా? వారి కార్ల సంఖ్యలు తగ్గాయా? బ్రిటిషువారి కాలంలో ఒక్క ఆర్థిక మంత్రికి తప్ప తక్కిన వారందరికీ ఒక పర్సనల్ అసిస్టెంట్ మాత్రమే ఉండేవారు ఎవరు ఏమన్నా బ్రిటిషువారి 'ఎక్సిక్యూటివ్ కవున్సిల్' నేటి మంత్రివర్గం కన్నా తన బాధ్యతలని గుర్తించి నడుచుకునేది, ఇంత ఎంతో బాగా పరిపాలించేది.


అరాజకాలు

నేడు ఒక ఉద్యోగ్ర్లో కూడా అధికారం ఉండాలి. సాధారణ జీవితంలో కలుగ కారుకోవడం పెద్ద మనిషి మంత్రి అయితే ఇలా కొంత తగ్గాలి. మంత్రులు ఇప్పుడు పెద్ద దీక్షలు ఉండాలి, వారికి రక్షణ భుజకం వేరే ఉండాలి.

1947 నుంచి నేటిదాకా సుమారు రూ. 100 కోట్లు, రాజ్యాభరణాల కింద ఖర్చు అయ్యాయని, ఈ ధనం ప్రజలకోసం ఖర్చు అయి ఉండవలసిందని కొందరు అంటున్నారు.మరి ప్రభుత్వరంగంలో మంటలు కలుస్తున్న కోట్ల రూపాయల సంగతి ఏమిటి ? ఇంకా నిర్మాణం పూర్తి కాని బొకారో ఉక్కు మిల్లు, ఖర్చు విపరీతం సహాయంతో, నెలకి సుమారు కోటి రూపాయలు నష్టపోతోంది.

భేదోపాయాలు

భేదోపాయాన్ని ప్రభుత్వం ఎక్కువగా వాడుతుంటోంది జాతీయ ముసల్మానులు, జాతీయ సిక్కులు అనే తెగలని సృష్టించి ఆ మతాలవారిలో చీలికలు తీసుకు వచ్చింది కాంగ్రెసు ఇప్పుడు చిన్న సంస్థానాధీశ్వరులకీ, పెద్ద సంస్థానాధీశ్వరులకీ మధ్య చీలికలు తీసుకురావటానికి ప్రయత్నిస్తుంది ఈ లక్ష్యంలో చిన్న సంస్థానాధీశ్వరులకి ధన సహాయం చేస్తాను అని చెప్తోంది... ●



కన్యాకుమారిలోని వివేకానంద శిలాస్మారకం

క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు ___



శశాంకవతి పరిణయగాథ

అనువాదం: తిరుమల రామచంద్ర

మృగాంకదత్తుడు గుణనిధి మొదలయిన మిత్రులతోపాటు బయలుదేరినవాడు, వింధ్యాటవి గడిచి, వింధ్యపర్వతం దాటాడు. తర్వాత గంధవతీ నదిని దాటాడు. భూత బేతాళసంకులమయిన ఒక వీరక్షేత్రం చేరాడు. అక్కడ మహాకాలుని సేవించి రాత్రి ఉజ్జయిని ఎల్లలు చేరాడు.

పూర్ణచంద్రుడు పండువెన్నెల విరగగాస్తున్నాడు. ఆ వెన్నెల వెలుగులో ఉజ్జయినీ నగరం స్పష్టంగా కనిపించింది. అది దుర్గమంగా ఉంది. చుట్టూ గొప్పకోట్లు, ఇతరులు లోపల చొరరాకుండా యంత్రాలున్నాయి. వీరభటులు కావలి కాస్తున్నారు. సంకల్పాలతోను చొరరానివిధిగాను గాలులకు కూడా దాటి పోరానిదిగను కనిపించింది.

మృగాంకదత్తుడు శశాంకవతినేస్మరిస్తూ తన మిత్రులతో మంతనాలు జరిపాడు: 'ఈ ఉజ్జయినీపాలకుడు కందర్పసేనుడు గొప్ప ధనవంతుడు. మంత్రులు చాల అనురాగం గలవారు. ఈ పట్టణమే మోదుర్భేధ్యమయింది. ఏదీ ఉపాయం తోచడం లేదు. నేను ఇంతగాపడిన శ్రమంతా విఫలమయినట్లే కనిపిస్తుంది. మనం అధన్యులం. మనకు శశాంకవతి ఎలా కనిపిస్తుంది?'' అని అనుకున్నాడు, మృగాంకదత్తుడు. స్మరశోకం ఎక్కువయింది.

విక్రమకేసరికి ఒక్క ఉపాయం తోచింది. బేతాళుడు అతని చెప్పుచేతలలో ఉన్నాడు. అందువల్ల బేతాళుడిని స్మరించాడు. బేతాళుడు వెంటనే ప్రత్యక్షమయి, 'ఏమి చేయాలి?' అని ప్రశ్నించాడు,

'మిత్రమా 'ఖేచర, కందర్పసేనుని అంతఃపురంలో అతని తనయ శశాంకవతి ఎంతో రక్షణలో వుంది. ఆమెను నీవు నా మిత్రుడు మృగాంకదత్తుని కోసం తీసుకురా! త్వరగా తీసుకు రా!' అని విక్రమకేసరి బేతాళునికి ఆజ్ఞాపించాడు.

బేతాళుడు ఆ మాట విని, 'మహాకాలుని పాలనలో వున్న దేశంలో మా శక్తి పారదు. మహాకాలునివరంతో ఆ ప్రాంతం దుర్జయమయింది.' అన్నాడు. బేతాళుడు

ఇలా చెప్పగా, విక్రమకేసరి అతనిని వెళ్లి పొమ్మన్నాడు. బేతాళుడు తిరోహితుడయి పోయాడు.

మృగాంకదత్తుడు తన మంత్రులతో ఏమి చేయాలనేది ఆలోచించాడు. మహామాత్యుడు వింధ్యారణ్యంలోని మతంగాధిపతి దుర్గపిశాచుని పట్టణానికివెళ్లి మాయావటుని కలుసుకొని, బలాలు చేకూర్చుకొని, కిరాతాధిపతి శక్తిరక్షితుని పిలిపించి ఉజ్జయినిపై దండెత్తటం సముంజసం—అని మంతనాలలో నిర్ణయమయింది. ఈ నిర్ణయం మేరకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. సేనల స్కంధావారం దశయోజన విస్తారమయింది.

మృగాంకదత్తుడు దండయాత్రకు ముందు ఒక దూతను పంపి, శశాంకవతిని తనకు ఇచ్చి వివాహం చేయవలసిందిగా ఉజ్జయినీపతిని కోరాడు. కాని, ఉజ్జయినీపతి పొగరుపోతు. సామవిముఖుడై మృగాంకదత్తుని సూచనను నిరాకరించాడు. ఇక మృగాంకదత్తుడు గత్యంతరంలేక సముద్రసదృశమయిన సైన్యంతో దండయాత్రకు బయలుదేరాడు.

సైన్యాలు అవంతి విషయం చేరాయి; ఉజ్జయినిని చుట్టుముట్టాయి. అప్పుడు మృగాంకదత్తుడు లంకను ముట్టడించిన రాఘవునిలాగ కనిపించాడు. కందర్పసేనుడుకూడా కోపంతో యుద్ధదుర్మదంతో కోటనుంచి పోరాటానికి బయలుదేరాడు. ఇరువురు భూమిపాలుర సమరారంభ దుందుభులు మ్రోగాయి.

కత్తులనే తరగలతో భయంకరమయిన ఆ రణసాగరంలో సేనలనే నదులలోకి శూరులనే మకరాలు పరస్పరం వేగంతో ఒకదాన్ని ఒక్కటి ఢీకొన్నాయి. వసుంధర వీరుల తలలనే పద్మాలతో నిండిపోయింది దానిని చూడగా, ఏనుగులు దిగి పాడుచేసి, అల్లకల్లోలమయిన సరోవరం అనిపించింది. ఇలా యుద్ధం మృత్యువుకు అవిచ్ఛిన్నమయిన లీలా మహోత్సవంలాగ ఐదు దినాలపాటు తుములంగా జరిగింది

యుద్ధం ఇలా జరుగుతూండగా నయోపాయ విచక్షణుడయిన శ్రుతధి రహస్యంగా పట్టణంలో ప్రవేశించి రహస్య ద్వారాల మార్గాలు తెలుసుకొని వచ్చాడు. మృగాంకదత్తునితో ఇలా అన్నాడు:

'వీరులు మరణిస్తున్న ఈ యుద్ధంలో జయం సంశయాస్పదం. అందువల్ల యుక్తితో సిద్ధికి యత్నం వెదుకుదాము. నేను మారువేషంతో శత్రువు నగరం గాలించాను. ప్రమదావనంలో శశాంకవతిని చూచాను. ఆమెను అపహరించి వడిగా పరుగెత్తే గుర్రాలమీద దాటించి వేద్దాం.'

మృగాంకదత్తుడు ఈ సూచనను మెచ్చుకున్నాడు. అలాగేనని అన్నాడు. 'పలువురి అభ్యుదయ లక్ష్మికి ఒక్క బుద్ధిమంతుని సహాయం ఉంది' అన్నాడు.

ఇది ఇలా వుండగా శశాంకవతి నెచ్చెలులు ఆమెకు మృగాంకదత్తుడు స్మరరూపుడని వర్ణించి చెప్పారు. అతని సౌందర్య సంపద విని రాజకుమారి మదన వ్యాధితో కుమిలిపోయింది. భరించలేక గౌర్యాలయంవున్న తన ఉద్యానవనానికి రాత్రి చంద్రోదయం తర్వాత వెళ్లింది. తన ప్రియుణ్ణి స్మరిస్తూ, ఆ వెన్నెలలో విహరించింది.

మృగాంకదత్తుడు తన మంత్రులతోపాటు ఆ వుద్యానవనానికి నెమ్మదిగా వచ్చి, రహస్యంగా పొంచివుండి, ఆ లేడికన్నులదానిని ఉత్కంఠతో చూడ సాగినాడు. ఆ రాజకన్య తన ముఖసామ్యంతో చంద్రునికి, సౌందర్యంతో మన్మధునికి, కాంతితో పురసౌధ లక్ష్మికి నూతనజీవితం సృష్టిస్తున్నట్టు, లేశమాత్రపు కడగంటి చూపులు పడవేయించి, జగత్రయాన్ని జయించిన మన్మథ భామిని రతి సాధించిన ఎదుటనిలిచిన విజయలక్ష్మి అన్నట్టు, ప్రవాల లావణ్య సోదరాలయిన అధరకాంతులతో దిక్కులకు అనవరతం రాగదీక్షను ఇస్తున్నట్టు ఉంది. పూగుత్తులవంటి పాలిండ్లు, లేత ఎరుపురంగు చిగురుటాకులవంటి చేతులు, యౌవనంతో నవనవలాడే మేనుదీగ—వసంతుడే వచ్చి అలంకరించాడా అన్నట్టు వుంది. కన్నులేమో కృష్ణసారాలు; తుమ్మెదవాలిన గేదగి రేకులు; అందువల్ల ఆమె ఎటు చూస్తే ఆ దిక్కు రత్నహారాలు వేసినట్టు కనిపించేది. పొట్టమీది ముచ్చటయిన మూడు మడతలమీద నల్లని నూగారు చూడగా, ఆమె ముఖచంద్రునిలోని కళంకరేఖ జారి నాభీకూపం ఒడ్డుమీద పడినట్లు అనిపించింది. పయోధరాలు [illegible] స్మర సింహాసనంలాగ, మదమనే పర్వతం చరిలాగను ఉన్నాయి.

రాజకుమారి మదనతాపం సహించలేక ఉరిపోసుకోడానికి సిద్ధమయింది. అప్పుడు పార్వతీదేవి అదృశ్యంగా ఉంటూ ఇలా అన్నది: 'పుత్రీ ఇలాటి సాహసం చేయవద్దు. నీ భర్త ధన్యుడు, సమీపంలోనే వున్నాడు. అతడు ఈ జన్మప్రియుడు మాత్రమేకాదు. పూర్వజన్మ వల్లభుడు.'

గౌరీదేవి ఇలా అదృశ్య అయి ఊరడించిన మీదట, మృగాంక దత్తుడు ఇదే ఉచిత సమయమని, రాజపుత్రితో ఇలా అన్నాడు:—'ఓ బాలా, కురంగాక్షి, మదనోద్యాన చంద్రికా, నీ చూపులతో అమృతం వెదజల్లు. చంద్రుడు సిగ్గుపడి పోని!'

ఈ మాటలకు తన్వంగి అయిన రాజకుమారి సిగ్గుపడిపోయి, రాజకుమారుణ్ణి కడగంటి చూపులతో చూస్తూ కాలివ్రేలితో నేలగీకుతూ నిలబడింది.

నా ప్రాణాలు నీ అధీనంలోనే వున్నా యని చూపులలోనే చెబుతున్నట్లున్న సుందరిని రాజకుమారుడు వెంటనే గుర్రం మీద ఎక్కించాడు. సంకల్పాలలాగ వడిగ పరుగెత్తే ఆ గుర్రాలు వారిని మాయావటు పట్టణం చేర్చాయి. రాజకుమారుని మిత్రులు వెంటవెళ్లారు. పట్టణంలో వారు వస్తుండగా, పుళింద సుందరుల తండోప తండాలువచ్చి సంతోషంతో చూడసాగినారు.

తన కుమార్తెను మృగాంక దత్తుడు అపహరించుకొని వెళ్లాడని కందర్ప సేనునికి తెలిసింది. నిష్కారణంగా ఇక యుద్ధం ఎందుకని యుద్ధం మానుకున్నాడు. మందబుద్ధి! ఈ పరిజ్ఞానం మొదట్లోనే వుండవలసింది. యుద్ధం ఆగిపోవడంవల్ల కిరాతరాజు మొదలయిన వారు మాయావటువు పట్టణానికి తిరిగి వచ్చారు, మృగాంకదత్తుని కలుసుకొని సంతోషించారు.

తర్వాత మృగాంకదత్తుడు తన వృత్తాంతం తెలుపడానికి తండ్రి, అయోధ్యాధిపతి అయిన అమరదత్తుని వద్దకు తన మిత్రుడు భీమ పరాక్రముణ్ణి పంపాడు. అమరదత్తుడు మహామాత్యుని మాట విని తన కుమారుణ్ణి

'నగరంనుంచి వెళ్ళగొట్టిన' తర్వాత మహామాత్యుని మాటలు పట్టి మిథ్య అని, రాజకుమారునిపై నింద కేవలం నీలాపనింద అని తెలుసుకొన్నాడు. వెంటనే మహామాత్యుణ్ని పట్టి కారాగారంలో పడవేసి, రాజ్యాన్ని, సుఖాన్ని వదలి, పుత్రసందర్శనాశతో వంది గ్రామంలో నివాసం ఏర్పరచుకొన్నాడు.

చాల కాలానికి కుమారుని మిత్రుడు కనిపించడం వల్ల మహా సంతోషంతో అమరదత్తుడు తన కుమారుని వృత్తాంతం సమస్తమూ అడిగాడు. భీమపరాక్రముడు ప్రపంచంలో విపులాద్భుతమయిన మృగాంకదత్తుని చరిత్రను విన్నవించాడు. అది విని అమరదత్తునికి మళ్ళీ ప్రాణాలు వచ్చినట్టయింది.

అమరదత్తుడు గజవాజి రథయుత

...బృహత్కథామంజరి

సైన్యం వెంట రాగా, విజయం పొందిన కుమారుణ్ని చూడడానికి మాయావటు పట్టణానికి బయలుదేరాడు. మాయావటు పట్టణం చేరినమీదట శశాంకవతీ సహితుడయిన తన కుమారుని చూచి ఆశ్చర్యపడ్డాడు. మృగాంకదత్తుడు తన మిత్రులతోపాటు తనతండ్రికి నమస్కరించాడు.

మృగాంకదత్తుడు తన ప్రియురాలితోపాటు కొంతకాలం ఉత్సవాలతో అక్కడ గడిపి పూర్వం సీతతోపాటు కపీంద్రులతోపాటు వచ్చిన రాఘవునివలె తన మిత్ర మంత్రి సహితుడై అయోధ్య చేరాడు. అయోధ్య చేరిన తర్వాత పెద్దలయిన రాజన్యులకూ, మాన్య అగు విద్వాంసులకూ నమస్కరించాడు. చాలాకాలంవరకు ఉత్సవాలు వేడుకలు జరిగాయి. మృగాంకదత్తుడు శ్రుతధి మొదలయిన పదకొండు మంది మంత్రులతోపాటు ద్వాదశాత్మక అయిన దివాకరునిలాగ విరాజిల్లెను.

కందర్పసేనుడు తన కుమార్తెయిన సుషేణుడనే వానిని తన కుమార్తెను మృగాంకదత్తునికిచ్చి వివాహమహోత్సవం జరుపడానికి అయోధ్యకు పంపాడు. అతడు తనవెంట అపార సువర్ణరత్న శకటాలను, గజ రథాశ్వాలను తెచ్చాడు. అయోధ్యలో ఉత్సవాలు ఎడతెగకుండా జరిగాయి. దేశ దేశాలనుంచి రాజులు చూడవచ్చారు.


గౌరీదేవికి శశిశేఖరుడు వివాహమంగళం జరిపినట్లు మృగాంకదత్తుడు శశాంకవతికి జరిపించాడు. దానితో అతడు పూర్ణమంగళుడయ్యాడు. అప్పుడు అతడు వల్లభానవ సమాగమంతో మన్మథుణ్ని గౌరవించినవాడై మహోత్సవోత్సాహ సుందరమయిన అపూర్వస్థితి పొందాడు.

వివాహానికి వచ్చిన రాజులు సముచిత గౌరవ మర్యాదలు పొంది అమరదత్తుని సెలవుపొంది వెళ్ళిపోయారు. అమరదత్తుడు మృగాంకదత్తునికి రాజ్యలక్ష్మిని అప్పగించి, రాణితోపాటు శంభువుకు ఇష్టమయిన వారాణసీ పట్టణానికి వెళ్ళాడు. అవసానకాలంలో వైరాగ్యలక్ష్మి గొప్పవారికే లభిస్తుంది.

మృగాంక దత్తుడు కాలక్రమాన ఈ వసుంధరనంతా జయించి సార్వభౌముడై ప్రియావిలాస రసికుడై కాలం గడిపాడు. నవయౌవనవతి, మెరిసే తారకలతో కంటిపాపలతో మరీ సుందరిగా కనిపించేది అయిన శశాంకవతి ఆ రాజచక్రోరునికి ఆనంద సంధాయిని అయింది.

'ఇలా మృగాంకదత్తుడు త్రైలోక్య సుందరిని పొందాడు. నీవుకూడ త్వరలో రమణీయ అయిన మదన మంచుకను పొందుతావు' అని పిశంగజటుడు నరవాహనదత్తుని ఊరడించాడు. పిశంగజటుడు చెప్పిన విపులకౌతుక హర్షమయమయిన మృగాంకదత్తుని కథను నరవాహనదత్తుడు విని, ప్రియతమా పరిరంభం కోరుతున్న హృదయంలో ధైర్యం నింపుకున్నాడు.

(ఇంకా ఉంది)



ఇండియాలో తయారుచేసిన అపోలో-10 లూనార్ మాడ్యూల్ నమూనాలని విదేశాలకి ఎగుమతి చేస్తున్నారు.

ఒక వారం విపరీతం


ఫాలాక్షుడు

బలవంత నియంత్రణ

కాన్పు కోసం బెంగుళూరు వాణీ విలాస్ ఆసుపత్రిలో ఒకామె జూలై 27 న చేరితే, ఆమెకది అయిదో కాన్పని తెలుసుకున్న డాక్టరు, ఆమె— ఆమె భర్త వద్దంటున్నా వినకుండా ఆమెకు కుటుంబ నియంత్రణ ఆపరేషను చేసేసిందట. తత్ఫలితంగా మొన్న ఆగస్టు 4 తేదీన ఆమె చనిపోయిందట. ఆమె భర్త కాఫీబోర్డు వుద్యోగిట.

ఆకాశవాణి మంత్రోపదేశం

మలేషియా ప్రాంతంలో వో పూళో మహాని అజా హనాఫియా అనే అమ్మాయి రెండు చేతులూ జోడించి కొరియా భాషలో ఏదో ప్రార్థన



చేసేసరికి దోసెడు డబ్బులు చేతుల్లో పుడుతున్నాయట. ఈ ఆశ్చర్యం ఎలా సంభవమని ఆమెనే అడిగితే ఎలా వస్తుంది డబ్బు అని నన్నడక్కండి. ఆ మంత్రం స్మరిస్తే దోసెడునిండా డబ్బు వస్తుంది. ఎటొచ్చీ ఆసమయంలో చేతులు కొంచెం కొరుక్కుతాయి అంతే అందటామె. మూడేళ్ళ క్రితం ఆకాశవాణి [ఆలిండియా రేడియో కాదు] తనకీ కొరియా మంత్రం వుపదేశించిందని, తన తల్లిదండ్రుల దరిద్ర బాధ కూడా తీరిపోయిందని అన్నదట— ఆ దేశం వెంటనే ఆమెనే ఆర్థిక శాఖా మంత్రిణిగా తీసుకుంటే పోలా—వై నాట్!

దొంగను మేసిన కంచె

ఊరిలో వో ఆసామి తన తోట చుట్టూ వున్న ఇనప తీగెకు కరెంటు తగిలించాడట. ఆరాత్రి వచ్చిన ముగ్గురు దొంగల్లో 35 ఏళ్ళ బాలన్, తీగలు పుచ్చుకుని, కెవ్వున కేకవేసి పడి పోయేసరికి మిగతా యిద్దరూ పారిపోయారట. తెల్లారుతుండగా వచ్చి చూస్తే బాలన్‌గాని, అతని శవంగానీ లేకపోడం వల్ల అనుమానించి వీరు పోలీసులకు తెలియజేశారట. వారొచ్చి ఆ తోటలో తోట ఆసామీ గొయ్యి తీసి పాతేసిన బాలన్ శవాన్ని బయటికి ఎక్కలాగారుట. బాలన్‌కు ఇద్దరో భార్యలు, వో కూతురూ వున్నారట.

వూపిరితిత్తుల్లో పెన్నుకాప్

1964 లో మాస్కోలో గోషెలనే వో విద్యార్థి పెన్ను నోట్లో పెట్టుకు వేళాకోళం ఆడబోయేసరికి ఆ పెన్ను మూతలో కొంతభాగం పుటుక్కున తని నోట్లోకి జారపడిపోయిందట. అవక ఎక్సరేలు, వైరెలా తీసినా ఏవీ తేలనందువల్ల సైన్సు పూరుకుందట. ఆ కుర్రాడు మాత్రం ఏదో వో అనారోగ్యంతో బాధ పడుతుండడం వల్ల మొన్న డాక్టర్లు ఆపరేషను చేసేసరికి అతని వూపిరితిత్తిలో ఆ ప్లాస్టిక్ మూత దొరికిందట. దాన్ని తీసి, చికిత్స పూర్తి చేశాక అబ్బాయి ఆరోగ్యంగా వున్నాడట.

బంగారమా-ఇత్తడా?

సిలోన్ నుంచి భారతదేశం ప్రయాణమవుతున్న ఆడవారు వజ్రవైడూర్యాలతో పోయులేనన్ని బంగారు నగలు తీసుకెళుతున్నారనీ, మళ్ళీ తిరిగి సిలోను వెళ్ళేటపుడు యిత్తడి నగలతో వెళుతున్నారని, అయితే వారు హిందూదేశం నుంచి ఖరీదైన చీరలు తీసుకుపోతున్నారనీ కనిపెట్టిన సిలోను ప్రభుత్వం యీ పద్ధతి అరికట్టాలని నిశ్చయించుకుందట.

ప్రేమకు పరిహారం


తను ప్రేమించిన గవురమ్మ తనేగాక మరో వ్యక్తిని కూడా ప్రేమించి, అతనితో ప్రేమ వ్యాపారం సాగిస్తోందని తెలుసుకున్న పెరుమాళ్ అనే అతను పట్టపగలు నడిరోడ్డుమీద వ్రేడుంగి వులితో ఆమెను 18 సార్లు కుళ్ళ పొడిచి చంపేశాడట. ఇది కృష్ణగిరిలో జరిగింది.

* * *

దండు కానూర్ అనే ఊళ్లో 45 ఏళ్ళ లక్ష్మణన్‌కూ ఆతని భార్య గోవిందమ్మకూ తగూ వచ్చిందట. ఆ తగువు కారణాన్ని గోవిందమ్మ ఆరాత్రి తన భర్త 'కోర్కె' నిరాకరించేసరికి ఆవేశంలో లక్ష్మణన్ చేతికందిన చిన్నకత్తితో ఆమెను 19 సార్లు పొడిచి చంపేశాడట.

పొడవు తగ్గించడానికి ఆపరేషన్

6.1 అడుగుల పొడవున్న పద్నాలుగేళ్ళ, శిసెల్ స్పార్క్ అనే ఆమె స్కూల్లో మిగతా పిల్లలతో పిల్లగా మెలగడానికి ముఖం చెల్లక రోజూ ఘోరుగా ఏడ్చేదట. ఆమె ఏడుపు విన్న డాక్టర్లు ఆపరేషను చేసి, తొడ ఎముకల్లో 1.5 అంగుళాలు, పిక్క ఎముకల్లో 2.5 అంగుళాలూ, వెరసి నాలుగు అంగుళాల ఎముకల్ని కత్తిరించి, అతికేసారట. ఇప్పుడామె ఆనందంగా వుందట. ఇది జోహాన్స్‌బర్గ్‌లో జరిగింది. హేట్సాఫ్ టు సైన్స్!



గర్భస్రావం చెడుకాదు

ప్రపంచ మెడికల్ ఎసోసియేషన్ మహాసభలలో 6? దేశాలకు చెందిన 600 మంది డాక్టర్లు చేసిన తీర్మానాలలో గర్భస్రావం ఏమాత్రం తప్పు లేదన్నారట.

టీ తాగడంలో రికార్డు

పంజాబ్‌కు చెందిన రూపార్ అనే ఊళ్లో ప్రీతమ్ సింగ్ 5 గంటలో 80 కప్పుల టీ తాగి ప్రపంచ

మనకేదో లెక్కా హెహె!!



రికార్డును బద్దలు కొట్టేశాడట. మేడమ్ మార్టిన్ అనే ఆవిడ లండన్‌లో ఆరు గంటల్లో 78 కప్పుల టీ మాత్రమే తాగిందట.

అల్సేషియన్ ఆహారం

ఐండి ఉయ్యాలలో నిద్రపోతున్న 27 రోజుల పసికందును ఆ ఇంటి అల్సేషియను కుక్క పీక్కు తినేసిందట. ఇది లండన్‌లో జరిగింది.

* * *

మద్రాసులో రెండేళ్ళు వయసున్న పందికి ఏనుగు ఆకారంలో నో పిల్ల పుట్టిందట. ఈ పిల్ల పందికి తొండం, పెద్ద చెవులూ, కోరపళ్ళు అన్నీ వున్నాయట.

"నేను ఎంతకాలం వుండదల్చుకున్నానో అంతకాలం 'నెంబరు వన్ హీరో'గానే వుంటాను"

—హీరో నాగేశ్వరరావు



హీరో అక్కినేని

ఆంధ్రుల అభిమాన హీరోగా గత 26 సంవత్సరాలుగా విరాజిల్లుతున్న శ్రీ అక్కినేనికి సెప్టెంబరు 20 నాటికి 46 యేండ్లు పూర్తయినాయి ఆయన 47 వ జన్మదిన సందర్భంగా 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' పాఠకులకోసం హీరోతో నేను జరిపిన యింటర్వ్యూ యిది.

ప్రశ్న: హలో, నాగేశ్వరరావుగారూ. మీరు యింకా ఎంతకాలం 'నెంబరు వన్ హీరో'గా వుండదల్చుకున్నారు — కొత్త వాళ్లను మీరు యెందుకు పరిచయం చెయ్యకూడదు ?

జవాబు : మీరు అంటున్నారు గాబట్టి ఒప్పుకుంటున్నా, అదే నిజమయితే నెంబరు వన్ హీరోగా నేను ఎంతకాలం వుండదల్చుకున్నానో, అంతకాలం 'నెంబరు వన్'గనే వుంటాను



అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణ నాగేశ్వరరావు

కొత్తవాళ్లను పరిచయం చెయ్యడమంటే నాకూ చాలా ఆనందమే. కానీ సరయిన వాళ్లు, నాలుగు కాలాలపాటు పనికి వచ్చే వాళ్లు దొరకాలిగా నేను నిర్మాతగా తీస్తున్న చిత్రాల్లో పరిచయం చేస్తున్న విషయం మీకు తెలియనిదా.

నేను : మీరు నటునిగా ప్రజా హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని యేర్పరచుకున్నారు మీరు యింకా డైరెక్షన్ను చేపట్టలేదేం ?

అక్కినేని : ఎందుకో, డైరెక్షన్ నన్ను యింకా చేపట్టలేదు !

ప్రశ్న : మీ చిరంజీవినికూడా సినిమా రంగంలోకి ప్రవేశ పెడుతున్నారే — మరి అతని విద్యాభ్యాసానికి అంతరాయం కల్గదా ?

జ : విద్యాభ్యాసానికి అంతరాయం కలిగేపక్షంలో నేనెందుకు ప్రవేశ పెడ్తానండీ ? !

ప్ర : మీరు మద్రాసులో మకాం పెడితే చాలామంది నిర్మాతలకు ఉపయోగకారిగా వుండగలరు మీకు అలాంటి వుద్దేశ్యం వుందా ?

జ: నేను హైదరాబాదులో వున్నా మద్రాసులో వున్నా అంతమంది నిర్మాతలకు నేను వుపయోగకారిగా ఎలా వుండగలను చెప్పండి! అయినా నేను వుద్దేశ్యాలను

త్వరగా మార్చుకోలేను...

ప్ర: హైదరాబాదులోవున్న ఒక్క స్టుడియోలో ఎన్ని చిత్రాలకని కాల్ షీట్లు యివ్వగలరు?

జ: నేను నటించే చిత్రాలకేగాక, బయటి చిత్రాలకుకూడా కాల్‌షీట్సును సర్దగల స్థితిలోనేవుంది సారథిస్టుడియో.

ప్ర: మీరు స్టుడియో నిర్మిస్తారని విన్నాను. నిజమేనా?

జ: ప్రస్తుతానికి లేదు. ఇకముందు సంగతి యిప్పుడే ఎలా చెప్పగలను చెప్పండి.

ప్ర: 'సంపిణీ సంస్థ'ను స్థాపించే అయిడియా ఎప్పుడు కలిగింది? మీకంపెనీ ఎప్పటినుంచి ఫంక్షన్ అవుతుంది?

జ: అయిడియా అయితే వచ్చింది గానీ యెప్పుడొచ్చిందో గుర్తు లేదు. 1971 నుండి ఫంక్షన్ అవుతుంది.

ప్ర: మీకు నచ్చిన హాలివుడ్ నటుడెవరు? ఆ నటుడి నటనలోని ప్రత్యేకత ఏమిటి?

జ: గ్రెగరీ పెక్. ఆయన నటించనట్లు నటించడమే ప్రత్యేకత.

ప్ర: ఒక చిత్రవిజయానికి ఛాయాగ్రహణం ఎంతవరకు వుపయోగపడుతుంది?

జ: చిత్రవిజయానికి వుపయోగపడక పోయినా, దెబ్బతినే చిత్రానికయినా అందమిస్తుంది.

ప్ర: మీరు ముమ్ముందు ఒప్పుకునే చిత్రాలన్నీ కలర్‌లో నిర్మింపబడుతాయని తెలిసింది బ్లాక్‌అండ్ వైట్‌కి కలర్‌కి గల తేడాను వివరించగలరా?

జ. మీకు తెలిసిన వార్త శుద్ధ అబద్ధం: 'రంగులో' తియ్యడమనేది ఆయా నిర్మాతలకు సంబంధించిన విషయం. బ్లాక్‌అండ్ వైట్‌కి, కలర్‌కిగల తేడా అంటారా—నాకు తెలిసింది మాత్రం చెప్పాలంటే మీపేజీలు చాలవు.

ప్ర. మీకు విగ్రహారాధనమీద నమ్మకముందా? మీ యింట్లో ఏడుకొండలస్వామి పటం వుందా? కర్పూర హారతులు, ధూపదీప నైవేద్యం లాంటివి మీ యింట్లో చేస్తారా?

జ: లేదు. లేదు చెయ్యను.

ప్ర: మీరు రష్యా వెళుతున్నారట. ఎప్పుడు వెళ్తారు అక్కడ ఏమిచూస్తారు?

జ: అవును బహుశా సెప్టెంబరులో. ప్రజాజీవితాన్ని, సినిమా జీవితాన్ని చూస్తాను?

ప్ర: మీకు కర్మసిద్ధాంతంపై నమ్మకముందా?

జ: ఆదేం కర్మ బాబు — నాకు ఆ సిద్ధాంతమేమిటో తెలియదు.

ప్ర: మీకు ఆసనాలు వెయ్యడం, వ్యాయామం చెయ్యడం అలవాటుందా?

జ: లేదని మాత్రం చెప్పలేను.

ప్ర: ఎప్పుడూ షూటింగు కార్యక్రమాల్లో సతమతమవుతున్న మీకు గ్రంధాలను చదివే తీరిక, కవిత్వం వ్రాసే వోపిక ఎక్కడ్నుంచి వచ్చింది?

జ: అదేం లేదే. నా అనుభవాలను 'అక్షరా'లుగా వల్లెవేసుకుంటూ, వ్రాస్తుంటాను. అంతే.

ప్ర: మీకు పౌరాణిక చిత్రాలపై మోజులేదా? శ్రీకృష్ణ పాత్రపై మీ అభిప్రాయం?

జ: పౌరాణిక పాత్రలంటే నాకు చాలా యిష్టం. శ్రీకృష్ణుడు రాజకీయాల్లో ప్రధానమంత్రి లాంటి వాడు.

ప్ర: మీ బాల్యమిత్రు డెవరయినా దుర్భర దారిద్ర్యంలోవుంటూ, మిమ్మల్ని ధనసహాయం అడిగితే మీరేంచేస్తారు?

జ: ఏదో చేస్తాను. కానీ ఏంచేస్తానో చెప్పను! పర్సనల్ విషయాలను చెప్పే అలవాటు లేదు.

ప్ర: మీకు వచ్చే వుత్తరాలకు మీరే సమాధానం యిస్తారా? లేక మీ సెక్రటరీ బట్వాడాలు చేస్తారా?

జ: సెక్రటరీ బట్వాడాలుచేసే అలవాటు మా యింట్లో లేదు. బట్వాడాలు చేసే సెక్రటరీలను నేను పెట్టుకోను. నా సలహానుసారం ప్రత్యుత్తరాల నివ్వడమే సెక్రటరీల వుద్యోగం.


ప్ర: ప్రజలమధ్యన జొరబడి, జోలె పట్టి, డబ్బు ప్రోగుచేసి, బాధిత ప్రజలకు యిచ్చే అలవాటు లేదా? మీ రింతవరకు ఎంతడబ్బు దానధర్మాలకు వినియోగించారు?

జ: జోలెపట్టి డబ్బు ప్రోగుచేసి బాధిత ప్రజలకు యిచ్చే అలవాటు 'తప్పు' గాదు. కానీ, నేను సంపాదించి మిగుల్చుకున్న దానిలో కొంత యివ్వడమే 'ఒప్పు' అనేదే నా భావం. ఇక నేను చేసిన దానధర్మాలంటారా! అమ్మో! నేను చెప్పను. మీరు పబ్లిసిటీ యిస్తారు.

ప్ర: మీ 47వ జన్మదిన శుభ సందర్భాన మీ అభిమానులకు మీరిచ్చే 'స్వీట్ న్యూస్' ఏమిటి?

జ: ఇంతవరకు నన్ను అభిమానిస్తున్నందుకు అభినందనలు చెపుతూ, వారికి తోడుగావుండి యింకా కొంతమంది అభిమానులను కూడా సంపాయించుకోవడానికి ప్రయత్నించగలనే 'స్వీట్ వర్డ్' యిస్తున్నాను.

—ఇంటర్వ్యూ: శ్రీనివాస్.



శ్రీ సారథి స్టుడియోస్ అధ్వర్యంలో చిత్రపరిశ్రమలోని ప్రముఖులు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారి 61వ జన్మదినోత్సవ సందర్భంగా ఆయనని అభినందించడానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఖండూభాయిదేశాయి అధ్యక్షతన సమావేశం అయినారు. స్వాగతోపన్యాసం యిస్తున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ కె. శ్రీనివాసరావు, శ్రీమతి రాఘవమ్మా బ్రహ్మానందరెడ్డిగార్లను కూడా చిత్రంలో చూడవచ్చు.



చిక్కుపడిన చెమ్మదనం

రంధాం మనోహరన్

ఆఫీసునుంచి అలసిపోయి వచ్చిన కరుణాకరం బల్లమీది ఉత్తరం తీసి చదువుకున్నాడు. పడక్కుర్చీలో దిగులుగా కూర్చున్న అతని మొహంలో రంగునీడలు కమ్ముకున్నాయి.

శ్రీ వారికి :

శ్రీవాణి నమస్కరించి వ్రాయునది. నేను బాబు కులాసాగా ఉన్నాము. మీరు వ్రాసిన ఉత్తరంతోపాటు పంపిన అప్లికేషన్ ఫారమ్ అందింది. అమ్మకి నాన్నగారికి ఈ పరిస్థితుల్లో నేను చదవటం ఇష్టంలేదు. వెల తిరగని బాలింత రాలివి కాలేజీకి ఎల్లా వెళతావు అని అడుగుతున్నారు. నాక్కూడా నిజమే అనిపిస్తోంది. అందుకని ఆ ఫారం పూర్తిచేసి పంపటం లేదు. మీరు అన్యథా భావించరని తలుస్తాను. బాబుని చూడటానికి మీరు వెంటనే రండి. ఆఫీసరు శలవు ఇవ్వలేదని సాకు చెప్పరని తలుస్తాను. పూజ్యులైన అత్తయ్యకి మామయ్యగార్కి నమస్కారములు.

ఇట్లు మీ సేవలో ఆనందం
అనుభవించే
మీ శ్రీవాణి.

కరుణాకరం శ్రీవాణిని పెళ్లి చేసుకోటం బంధువర్గంలో ఎవ్వరికీ ఇష్టం లేదు. వెంకట్రామయ్యగారూ సుందరమ్మగారూ అబ్బాయిష్టం అని విమ్మకి నీరెత్తినట్లు ఊరుకున్నారు. ఎన్ని సంబంధాలు చూసినా వచ్చని కరుణాకరం విసుగెత్తి అసలు ఆ ప్రసక్తి మానుకున్నాడు. అదిగో సరిగ్గా అటువంటి సమయం కరుణాకరం ఏదో ఆఫీసు పనిమీద రాజమండ్రి వెళ్లటం తటస్థించింది.

దరిమిలాను సుందరమ్మగారి పిన త్తమ్ముడు రామచంద్రంగారు కరుణాకరంకి చాలా యాదృచ్ఛికంగా వరదరావు హోటల్ దగ్గర కనబడటం, ఎంతో ఆప్యాయతతో పలకరించటం, ఆయన కనబర్చిన అవ్యాజ ప్రేమానురాగాలకి కరుణాకరం గుమ్మైపోవటం, పిలిచిందే తడవుగా వారింటి కితడు భోజనాని కెళ్లటం, అక్కడ వారి పెద్దమ్మాయి బంతిపువ్వులాంటి శ్రీవాణిని చూడటం వెంటనే ప్రేమించటం నిముషాలమీద జరిగిపోయాయి. రాజమండ్రీలో ఏ్ తమాషా ఉంది. అక్కడే తాడేపల్లి లెక్కున్న రేనా వీరికలో చాలామంది అత్తవారివూరు అదేను.

ఖంగారుగా భోజనం చేస్తూ శ్రీవాణిని నఖశిఖ పర్యంతం తీక్షణమైన ఎక్స్ రే కళ్లతో చూసాడు కరుణాకరం. నిజం చెప్పాలంటే అతని ప్రాణానికి ఈ రకం పెళ్లిచూపులు ఎంతో హాయిగా ఉన్నాయి. రాజ్యలక్ష్మమ్మగారు ఏం వడ్డిస్తున్నారో కూడా అతను పెద్దగా పట్టించుకోలేదు. చేతులు కడుక్కున్న తరువాత 'అమ్మలూ అబ్బాయికి వక్కపొడియ్యమ్మా' అన్న రామచంద్రంగారి గావు కేకతో కరుణాకరం శ్రీవాణి ఈ లోకంలోకి వచ్చారు. 'ఇదిగో వక్కపొడి. తీసుకోండి. నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు.' ఇలా పొడి ముక్కల్తో ముక్తసరిగా తేల్చేస్తున్న శ్రీవాణితో చనువుగా ఎల్లా మాట్లాడాలో అతనికి ఏ్ పట్టాన అంతు పట్టలేదు. కాసేపటికి పరిస్థితిలో కొంత మార్పు కనబడింది. వైద్యుడూ పాలే చెప్పాడు. రోగీ పాలే కోరాడు. అన్నట్లయింది. 'తమ్ముడూ. ఇతను నీకు బావ అవుతాడు. ఏదో మన కుటుంబాలమధ్య మనస్పర్థలొచ్చి రాకపోకలు లేక చుట్టరికాలు మర్చిపోయాము గానీ లేకపోతే ఎంతో కావల్సిన వాళ్లం' అన్నారు రామచంద్రంగారు.

అయస్కాంతం ఇనపముక్కని ఆకర్షిస్తోంది. ఇన్ స్పెక్షన్ తాలూకు పని ముగించుకొని కరుణాకరం సాయంత్రం లాడ్జి కెళ్లకుండా తిన్నగా ఆఫీసునుంచీ రామచంద్రం గారింటి కెళ్లాడు. సినిమాకి బయలుదేరుతున్న హడావుడిలో ఉన్నారు ఆడపిల్లలిద్దరూను. రామచంద్రంలాంటి బీద బడిపంతులికి జీతం రాకపోయినా ఆయన వృత్తిమీద చదువుల తల్లిమీద ఆయనకు అపారమైన గౌరవం ఉండటంవల్ల కాబోలు పెద్దదాని పేరు శ్రీవాణి, రెండోపిల్ల శారద.

'మీరుకూడా సినిమాకి రాకూడదూ' చాలా తమాషాగా అడిగింది శ్రీవాణి. అందులో మీరు రాందే మేం సినిమాకు వెళ్లం అన్న అర్థం కొట్టొచ్చినట్లు స్ఫురించింది కరుణాకరానికి. శ్రీవాణి కొంచెం చలాకీగా ఉన్నట్లు కనబడినా నిజానికి ఉత్త అమాయకురాలు. అలా అని తెల్లనివన్నీ పాలూ నల్లనివన్నీ నీళ్లు అనుకునేటంత అమాయకురాలు మాత్రం కాదు. శారద సుభావంగా మాట్లాడినా చాలా గడుసరి. మానసిక రీతుల్లో ఇంత వైవిధ్యం ఉన్నట్లే ముఖ కవళికల్లో కూడా ఇద్దరికి పోలికే లేదు. శ్రీవాణిది అచ్చం తండ్రిపోలిక. శారద రాజ్యలక్ష్మమ్మగారి ముక్కులోనుంచి ఊడిపడ్డట్టు వుంటుంది. 'ఆలోచించుకునే చెప్పండి తొందరేం లేదు' అంది శారద. దూరంనుంచీ సంభాషణ వింటున్న రాజ్యలక్ష్మమ్మగారు 'పోనీ వెళ్లండి నాయినా సరదాగా, వచ్చేటప్పుడు తోడుగా కూడా ఉంటావు' అని వంటింటి వేపు వెళ్లిపోయింది చాలా డ్రమెటిక్‌గా.

ఆట సరిగ్గా ఒన్‌కార్డ్‌షోలో వున్నప్పుడు సరిగ్గా మిడిల్‌కార్డ్, జోకర్ వస్తే రమ్మీ ఆటగాడికి ఎంత సంతోషంగా ఉంటుందో అంతకి రెట్టింపు ఉత్సాహం కరుణాకరం కళ్లల్లో ఒక్కసారి మెరిసింది. ఆడపిల్లలతో సినిమాకెళ్లటం కతను సరదా పడతాడని కాదు. కానీ అదొక గమ్మత్తైన అనుభవం. ఇందులో ఒక వుపయోగం కూడా లేకపోలేదు. సినిమా బాగుండక పోయినా మనకేం ఫరవాలేదు. కరుణాకరానికి ఎంతో భారం తగ్గినట్లయింది. ఈ సమస్య ఇంత తొందరగా పరిష్కారం అవుతుందని అతను వూహించలేదు. సినిమాకి వెళుతున్నప్పుడూ వస్తున్నప్పుడూ — ఇంటర్వెల్‌లోనూ కరుణాకరం చాలా విషయాలు తెలుసుకొన్నాడు. శ్రీవాణి బి.యస్సీ ఫైనలియర్ చదువుతోందిట. అక్క చదువుకోసం తన చదువు ప్రస్తుతానికి వాయిదా వేసింది శారద. వీళ్ల చదువులకి రామచంద్రంగారు నానా కష్టాలు పడ్డమాట వాస్తవమే కానీ ఆ సంగతి ఈ ఆడపిల్లలు బయిటికనలేను. తరవాత ఏం చేసాడు? కరుణాకరం తేలిపోయాడు. 'ఉద్యోగం చేస్తాను. మా నాన్నగారిని అమ్మని కన్నాన్ని సుఖపెట్టాలి బాబూ' అనేసింది చటుక్కున శ్రీవాణి. 'ఏం పెళ్లి చేసుకోవద్దా?' 'అల్లా అయితే వాళ్లు సంతోషిస్తారుగా' అన్నాడు పెద్ద అదేదో చాలా తీవ్రమైన ప్రత్యామ్నాయ ఉపాయం ... బాబ్బా

ప్రీడం ' ఉండదండి. చదువుకోటానికి వీలుండదు. చదువున్నా ఉద్యోగాలు చెయ్యటానికి చాలామంది భర్తలు ఒప్పుకోరు. మనం అలాంటి వాళ్ళని ఎంత మందిని చూడటంలేదూ. కదే శారదా' శారదకూడా అవునన్నట్టు తలకాయూపింది. తరవాత సంభాషణ ఎలా పెంచాలో బోధ పడలేదు కరుణాకరానికి.

ఏవో పిచ్చాపాటీ కబుర్లు మాట్లాడుతుంటే వాళ్ళు బుద్ధదేవుడిలా వింటూ కూర్చున్నాడు. ఒకవిధమైన ఆకర్షణ శ్రీ వాణిలో కనిపించింది కరుణాకరానికి. అంతే అప్పుడే శ్రీ వాణిని పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. మర్నాడు గోదావరి గట్టుకి షికారుకెళ్ళి నప్పుడు ఆముక్క కాస్తా శ్రీ వాణికి చెప్పేశాడు కరుణాకరం ఉండబట్టలేక. దూరంగా ఉన్న పడవలకేసి, ఆకుపచ్చటి కొబ్బరి చెట్ల గుంపులోకి తదేకంగా చూస్తున్న శ్రీ వాణి వులిక్కిపడింది. 'మేం బీద వాళ్ళం...మాతో మీకు కుదరదు. మా నాన్న కట్నాలివ్వలేకేకదా మాకు ఇంతకాలం పెళ్ళిళ్ళు చెయ్యకుండా కూర్చోబెట్టుకుంది. పెళ్ళి చేసుకొని మా నాన్ని మేం పోతే వీళ్ళగతేమిటి. అందుకని నేను ఇప్పుడప్పుడే ఆ విషయం ఆలోచించదల్చుకోలేదు. ట్రైనింగయికొన్నాళ్ళు ఏదేనా ఉద్యోగంచేసి నాన్నకి కొంచం బర్డెన్ తగ్గించాలనుంది. చిన్నాళ్ళనుంచో

చిక్కుపడిన...

భారంగా దాచుకున్న మాటల్ని చివరకో ఆత్మీయులకు చెప్పుకున్నట్లు చెప్పింది శ్రీ వాణి. కళ్ళంబట నీళ్ళు తిరిగాయి. ముక్కుకొస ఎర్రబడింది. 'పెళ్ళి చేసుకున్నా చదువుకోవచ్చు. ఉద్యోగం చెయ్యచ్చు అంటే.' సూటిగా కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించాడు కరుణాకరం.

'ఎవరంటారండీ మీ పిచ్చి గానీ. అందులోనూ ఈ రోజుల్లో అబ్బాయిలా' చాలా హేళనగా మాట్లాడి నవ్వుతున్న శ్రీ వాణి ఆగిపోయింది. 'నేనంటాను. ఇంకోమాట. నాకు కట్నంకూడా అక్కరలేదు. నాకు నచ్చిన భార్య కావాలి. ఆమె రూపవతి కానక్కరలేదు. విద్యావతి, గుణవతి అయితే చాలు. నాక్కావల్సింది నా మనస్సులో మమతగా, నాలో కలిసిపోయి, నన్నర్థం చేసుకొని అత్తమామల్ని స్వంత తల్లిదండ్రులుగా చూసుకొనే స్త్రీ. మిగతా విషయాలు అంత ముఖ్యమైనవి కావు.' 'మీరెక్కువ ఆశ పడుతున్నారేమో అనిపిస్తోంది. అలాంటి వాళ్ళు దొరకటం జరగని పనికాదు కానీ కష్టం అనుకుంటాను' అతని మాటలకి అడ్డు వచ్చి చెప్పింది శ్రీవాణి. 'ఎందుకు దొరకరు. నువ్వున్నావుగా. నాకిష్టమయి, మీవాళ్ళ కభ్యంతరం లేకపోతే నేను ఈ క్షణం సిద్ధంగా ఉన్నాను' ఆవేశంతో అనేశాడు కరుణాకరం.


'నాన్నగార్ని అడగండి. అవి నేను నిశ్చయించుకునే సంగతులు కావనుకుంటాను. కానీ ఒక్క షరతుంది. నేను పెళ్ళయినాకూడా చదువుకుంటాను. బీ. యీడీ గానీ, ఎం. ఎస్సీ గానీ చెయ్యాలనుంది. నేను చదువుకోటానికి ఉద్యోగం చెయ్యటానికి మీకేం అభ్యంతరం ఉండకూడదు.'

మధ్యతరగతి వ్యక్తిగా వెనుక ఏమీ ఆస్తీ పాస్తీ లేని సాధారణ మానవుడిగా భార్య చదివి ఉద్యోగంచేసినా ఏమీ అభ్యంతరం లేని ఆధునిక భావాలుకల యువకుడిగా కరుణాకరం వెంటనే సరే అన్నాడు.

దరిమిలా కరుణాకరం చాలా అవస్థపడ్డాడు. తనపెళ్ళి తను కుదుర్చుకోటానికి. తల్లినీ తండ్రినీ ఒప్పించటం కొంచెం కష్టమయింది. 'కట్నం రావటల్లేదని' సుందరమ్మగారు గొణిగితే 'కట్నంతెచ్చిన కోడలు కొమ్మెక్కి కూచుంటే ఏం చేస్తావ్' అన్నాడు. 'నెయ్యానికీ, వియ్యానికీ సమఉజ్జీ ఉండాలంటే' వెంకట్రామయ్యగార్ని ఆర్గ్యుమెంటులో పెట్టి వోడించాడు. 'తాహతు అనేది మనం ఎలా కొలుస్తాం. అది రెలెటివ్. మనకంటే ఒక మెట్టు కింది వాళ్ళని చేసుకోటమే మంచిది. అణిగి మణిగి వుంటారు' అనే పెద్ద ఆశని భూతద్దంలోంచి చూపించాడు. 'పైగా పిల్ల బాగానే ఉంటుంది. చదువుకుంది. బుద్ధిమంతురాలు.' అని ఇద్దర్నీ మురిపించాడు.

'నేను ఈ పిల్లనే చేసుకుంటాను. లేకపోతే అసలు పెళ్ళే చేసుకోను' అనే మాట కరుణాకరం నోటిగుండా రాకుండా పరిస్థితి చెయ్యిదాటి పోకుండా పాపం ఆ ముసలాళ్ళిద్దరూ పెళ్ళికి ఒప్పుకున్నారు. అక్కడ పరిస్థితి ఇంకో తరహాగా ఉంది. రామచంద్రంగారూ, రాజ్యలక్ష్మమ్మగారూ అయాచితంగా పెళ్ళికొడుకు అందునా రత్నంలాంటి కుర్రాడు దొరికినందుకు తమ హృదయాలలోతుల్లో ఎంతో సంతోషించినా ఆ ఆనందం బయటికి కనబరిస్తే అవతల వాళ్ళకి లోకువై పోతామని కాబోలు లేనిపోని భేషజం కావాలని ప్రదర్శించారు.

వురేయ్! నాకు ఈదడం వచ్చేసింది రోయ్!!




మెత్తని మృదువైన లేప్రాయపు
ముఖవర్చస్సును ఇస్తుంది
పాండ్స్ వానిషింగ్ క్రీమ్
ఆశ్చర్యమా ? పాండ్స్ వానిషింగ్ క్రీమ్‌లో వుండే ప్రత్యేక హ్యూమెక్టెంట్ వల్ల మీ చర్మానికి సహజంగా వుండే తేమను వుంచడమేగాక దుమ్ము వాతావరణము నుండికూడ రక్షిస్తుంది. సమంగా మ్యాట్ ఫినిష్‌ను పాండ్స్ వానిషింగ్ క్రీమ్ ఒకటే ప్రత్యేకంగా వాడవచ్చు లేక గంటలకొద్దీ మీ సింగారం చెక్కు చెదరకుండా పునాది పౌడర్‌గా కూడా వుపయోగించవచ్చు.
4 సైజులలో లభ్యమయ్యే వానిషింగ్ క్రీమ్ ఇదొక్కటే— ఎకానమీ—లార్జి—మీడియమ్—స్మాల్
POND'S
VANISHING CREAM
V
పాండ్స్ వానిషింగ్ క్రీమ్ – విశిష్టమైన పౌడర్ పునాది

'వెంటనే ఏర్పాట్లు చేయించండి' అని వెంకట్రామయ్యగారు వ్రాసిన ఉత్తరానికి 'అంత తొందర్లో మేం చెయ్యలేం' పైగా పిల్లకి పరీక్షలొస్తున్నాయి. కాస్త వెనకా ముందు డబ్బు దస్కం చూసుకోకుండా తొందరపెడితే ఎలా' అంటూ తిరుగు టపాలో జాబురాశారు రామచంద్రంగారు.

కరుణాకరం ఏమైనా అనుకుంటాడని వెంకట్రామయ్యగారూ భార్యా గొంతుదాకా వచ్చిన కోపాన్ని గొంతులోనే కుక్కుకుని, కక్కలేక మింగలేక అన్నిటికీ ఒప్పుకున్నారు. తీరా పెళ్లిలో మగపెళ్లివారి కివ్వవలసిన గౌరవం కొంచెంకూడా ఇవ్వలేదనే మనస్తాపం వారి తడిబారిన కళ్లల్లో స్పష్టంగా కనబడింది.

తాము అడిగి వస్తే వచ్చేలే కాదు లోకువ. యువకుల విషయం అంతేనని రుజువైంది. ఇంకా కొంతలో కొంత నయం. పెళ్లికొడుకు ఇంత ఇదిగా తొందరపడుతున్నాడు అసలు ఇతని కేదైనా లోపం ఉందేమో అనే అనుమానం రామచంద్రం దంపతులకు రాలేదు.

శ్రీవాణి పరీక్షలయ్యాయి. పెళ్లి అయిందనిపించారు. ఎంత రసాభాసు జరగాలో అంతా జరిగింది. సునాయాసంగా మరిచి భాన్ను కొట్టేశారు రామచంద్రం అనే కుళ్లుకొద్దీ ఆయనవైపు వాళ్లెవరూ రాలేదు. మంచిమంచి సంబంధాలు చెపితే పెడచెవినిబెట్టి కుర్రకుంక

చిక్కుపడిన ...

చెప్పినట్లల్లా ఆడాడు అని ఇటు వెంకట్రామయ్యగారి వేపువాళ్లు పూర్తిగా బాయికాట్ చేశారు.

వేసవికాలంలో ఆకస్మికంగా వచ్చిన గాలివాన కూడా కరుణాకరాన్ని పూర్తిగా నిరుత్సాహపరచింది. స్నేహితులు ఎవరూ కూడా కన్నెత్తి చూడలేదు. ఇంత ఎడారిలోనూ ఒకే ఒక ఒయాసిస్సు శారద. మామయ్యగారూ, అత్తయ్యగారూ అంటూ నోటిక్కట్టుకు తిరిగింది పిల్లని. పెళ్లిపందిరిలో శారద లేకపోతే కాఫీ గ్లాసు కూడా గాడిపొయ్యి దగ్గర్నుంచి పెళ్లికొడుకే తెచ్చుకోవాల్సి వచ్చేది.


రామచంద్రం దంపతులు పిల్ల వెళ్లిపోతుంటే ఏడ్చిన ఏడుపు కల్ల బొల్లి ఏడుపని పైకి తెలిసిపోయింది. 'ఎంత సర్కారెక్స్‌ప్రెస్ ఎక్కితే నాలుగ్గంటల్లో గుంటూరు' అని పైకే అనేసింది రాజ్యలక్ష్మమ్మగారు పక్కనున్న అమ్మలక్కలతో. ఏ మాట కామాటే చెప్పుకోవాలి. నిజంగా బాధపడింది శారద ఒక్కత్తేను. ముప్పాతికవంతు ఏం మాట్లాడలేక పోయింది. మాట్లాడినప్పుడల్లా దుఃఖం పెల్లుబికి వచ్చింది ఆ పిల్లకి.

రిక్షా ఎక్కుతుంటే 'బావా. చెమ్కీదండలు మర్చిపోయారు. చిక్కుపడిపోయాయి. హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టేసుకోండి. పెళ్లిలో మార్చుకునే చెమ్కీదండలు ఒకరి మనస్సు ఒకరం అర్థం చేసుకోటానికి ప్రతీకలు. చిక్కుపడితే తీసుకునే బాధ్యత మీదే. ఇంకోళ్లు తియ్యటం బాగుండదు' అంది శారద. వోణీ అంచుతో కళ్లు వత్తుకుంటున్న శారదలో పెద్ద పెద్ద తత్వవేత్తలు దర్శనమిచ్చారు కరుణాకరానికి. సావగా శారద అన్న ఈ మాటలో ఎన్నో క్రొత్త విషయాలు అర్థం అయ్యాయి అతనికి. సమాధానం ఏం చెప్పాలో తోచక నవ్వి ఊరుకున్నాడు.

వర్షం కురిసి వెలిసినట్లయింది. గుంటూరు వచ్చాక అందరూ ప్రశాంతిగా ఊపిరి పీల్చుకున్నారు. పరిస్థితి సుందరమ్మగారు అనుకున్నంత నిరాశాపూరితంగా లేకపోవటం ఒక సుగుణం. శ్రీవాణి అందరితోనూ కలిసిపోయింది. అన్ని పనులూ చక చకా చేసుకుపోతూంది. ముసలాళ్లిద్దరికీ కోపం తగ్గిపోయి అమ్మాయి బంగారు తల్లిరా అన్నారు.

సాయంత్రం పేపరు తీసుకొని హడావిడిగా వచ్చిన కరుణాకరం, 'నెంబరెంత' అని అడిగాడు. తీరిగ్గా రేడియో వింటూ, కథల పుస్తకం చదువుతున్న శ్రీవాణి ఉలిక్కిపడింది. పేపరు చేతిలోంచి లాక్కుని చూసింది. కెమిస్ట్రీలో తప్పింది. 'పేపరు కష్టంగా ఉందండీ. మా క్లాసులో చాలామంది తప్పారు' అంది చాలా కాజువల్‌గా. కరుణాకరం మాత్రం ఏమంటాడు. అతని ప్లాన్స్ అన్నీ అప్‌సెట్ అయ్యాయి. బీఈడీలో చేర్పిద్దాం అనుకున్నవాడు సెప్టెంబరు పరీక్షకి డబ్బు కట్టి వచ్చాడు.

పరీక్షలు! శ్రీవాణి కాలేజీలో చేరితే ఎల్లా ఉండేదో! ఖాళీగా ఇంట్లో వుండటం వల్ల పరిస్థితి ఇంకో దారి పట్టింది. కెమిస్ట్రీ థీరీ పేపరు కెళ్లబోతూ 'వికారంగా వుంది. కళ్లు తిరుగుతున్నాయి' అని భళ్లున డోక్కుంది శ్రీవాణి. నిజం చెప్పొద్దూ కరుణాకరానికి చిర్రెత్తుకొచ్చింది. 'పోన్లేరా మాయదారి పరీక్ష ఈ ఏడు కాకపోతే మళ్లా నాటికవుతుంది. ఎందుకు దాన్ని ఇబ్బంది పెడతావు. కోడలుపిల్ల ఇప్పుడు వట్టి మనిషి కూడా కాదు' అంది నవ్వుతూ సుందరమ్మగారు. పడక్కుర్చీలో పేపరులో తల




దూర్చిన వెంకట్రామయ్యగారు గర్వంగా నవ్వుకొని వేడిమీసాలు దువ్వుకున్నారు తాతయ్య నవ్వుతున్నానన్న సంతోషంలో. తను చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్న శ్రీవాణి పరీక్షసంగతి అందరూ ఇంత తేలిగ్గా తీసుకుంటున్నారేమో అనే సమస్య కరుణాకరం మనస్సుని ఆవరించేసింది.

అసలు విషయం తెలిసాక కరుణాకరం లోపల సంతోషించినా పయికి బింకంగానే ఉన్నాడు. ఎల్లాగో ధైర్యం చెప్పి పరీక్షకి పంపించాడు. పరీక్ష పాసయినా ఈ పురుడు అడ్డంరావటం తోనూ, తరవాత వచ్చి బాలింతరాలని అన్ని అవాంతరాలూ కాలేజీలో జేరటానికడ్డు వచ్చాయి. పై పెచ్చు పురిటికెళ్ళిన శ్రీవాణికి ప్రక్కనున్న ఆశమ్మా బూశమ్మా పిరికిమందు పోసేసారు 'బాలింతరాలికి నీరసంగా నంటుంది నడుము కట్టుకుండాలి మూణ్ణెల్లదాకా. కాళ్ళకి తడి, నెత్తికి ఎండా, చెవులకి గాలి తగలకూడదు. ముసల్దానిలా మఫ్లరు కట్టుకొని చెవుల్లో దూది పెట్టుకోవాలి. ఇవన్నీ ఇలా ఉండగా ఎం ఏలు బియ్యేడీలు ఎల్లా చదువుతావ్ తనుదుసమ్మా అని నెలల గుడ్డుని ఇంట్లో వదిలేసి' అని దబాయించేడి గారు. అదీ కారణం కరుణాకరానికిష్టం డొచ్చిన ఉత్తరానికి. ఇంతకొండ ఉంది ఈ వుత్తరం వెనకాల.

రైల్లో కూర్చున్న కరుణాకరం ప్రక్కనెళ్ళిపోతున్న ప్రకృతి దృశ్యాలు చూడటం లేదు. సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ అతను ఆలోచిస్తున్నదల్లా వాళ్ళని ఎల్లా సమాధాన పరిచి శ్రీవాణిని, పిల్లవాడినీ తీసుకురావాలా అని. కాలేజీలో చేర్పించాలని కారణం చెపితే తనింక అక్కడ వుండలేడు. కలకత్తా కాళికలా మీదపడి పోతుంది రాజ్యలక్ష్మమ్మగారు. ధైర్యంగా ఎదిరించి సాధించే ధైర్యం అతనికి లేదు. అందునా ఆవిడతోనా.

శ్రీవాణి స్ట్రాటజీ ఏమిటో బ్రహ్మకి కూడా అంతుపట్టదు. తల్లి అల్లుడి మీద అంత అరుస్తున్నా ఏం మాట్లాడదు. ఒంటరిగా వున్నప్పుడు 'మీరేం అనుకోకండి. ఆవిడ పాతకాలం మనిషి. వాళ్ళందరి బదులూ నేను క్షమార్పణలు కోరుతాను' అంటుంది కరుణాకరం ఎండలో పెట్టిన ఐస్‌ఫ్రూట్‌లా కరిగి

రంగులరాట్నం



పారమీసియం

జిమ్మకోనేటిరావు

చెరువులోని నీళ్ళు కొన్ని తీసికొని గాజు పాత్రలో పొయ్యండి. కొద్దిగా ఎండు గడ్డితో వేరే నీళ్ళు మరిగించి, చల్లారాక ఆ సారాన్ని చెరువు నీళ్ళ పాత్రలో వేయండి. కొద్దిరోజుల్లో ఆ నీటిలోని జీవులు బాగా వృద్ధి పొందుతాయి. అయితే అవన్నీ మసిమసిగా కనబడవు. సూక్ష్మదర్శిని క్రింద చూస్తే కనబడే జీవుల నిర్మాణం, కంటికి మామూలుగా కనబడే జీవుల నిర్మాణానికి వివిధంగానూ తెలిసేవు.

పారమీసియం ఇలాటి జీవుల్లో చాలా ప్రసిద్ధి చెందింది. పాదరక్ష ఆకారాన్ని పోలి ఉంటుందని పాదరక్షాకార జీవి అంటారు కాని ప్రక్కనుంచి చూస్తే అలా కనబడ్డా నిజానికి గుండ్రంగా చుట్టలాగా ఉంటుంది. ముందు మొండిగా వెనక కూసుగా ఉంటుంది. సూక్ష్మదర్శిని లేకుండా సూక్ష్మ దృష్టితో చూస్తే చిన్న తెల్లచుక్కలాగా కనబడుతుంది. 0.3 మి.మీ. పరిమాణం దీని పొడవు. సూక్ష్మదర్శిని క్రింద కనబడే దీని నిర్మాణం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

దాని శరీరం మీద చిన్న చిన్న కేశాల్లాంటి సీలియములుంటాయి. ఇవి ఏటవాలు వరుసల్లో ఉంటాయి. వాటి కదలిక వల్లనే పారమీసియం చాల త్వరగా బాణంలాగా ముందుకు దూసుకొని పోతుంది అది కూడా చిత్రంగా తనలో తాను తిరుగుతూ, పిన్ల వలయం ఆకారంలో చుట్టుకొంటూ పోతుంది.

పారమీసియం మొత్తం శరీరం [ఏకకణజీవి] మన శరీరంలోని ఒక్క కణంతో 'సమానం' అంటారు. జీవ పదార్థంలో రెండు కేంద్రకాలు ఉంటాయి. దాని శరీరం క్రింద భాగాన ఒక గొయ్యిలాగా ఉంటుంది. దాని లోపలికి, సీలియములతో ఏర్పడిన ఒక నిర్మాణం సహాయంతో ఆహారాన్ని లోపలికి లాక్కొంటుంది. శరీరం లోపల ఆహారం ఉండలుగా ఏర్పడుతుంది. ఇలాటి ఉండలు ఒక్కొక్కటి జీవ పదార్థంలోనే ఒక క్రమ మార్గంలో చుట్టబడతాయి. ఆ సమయంలోనే జీర్ణం వగయిరా పూర్తి అయి పిప్పి బయటికి పోతుంది.

ముందు ఒకటి, వెనక ఒకటి, శరీరం లోపల రెండు సంకోచ కావకాశాలుంటాయి. ఇవి దానిశరీరంలోనికి ప్రవేశించిన నీటిని, చుట్టూ ఉన్న కొన్ని వేరె పలాల ద్వారా సేకరించి బయటకు పంపివేస్తాయి. ఈ రెండు సంకోచ కావకాశాలు, చుట్టూ ఉన్న సహాయకావకాశాలు చాలా అందంగా ఉంటాయి

పారమీసియం పోట్లాటకు కూడా సిద్ధంగా ఉంటుంది. దాని శరీరం అంచు మొత్తం చుట్టూ కొన్ని చిన్న చిన్న గుళికల్లాగా కణావయువ విశేషాలున్నాయి. ఇవి చిన్న జీవుల మీద విషప్రయోగం చేసి చంపుతాయి.

ఇక పారమీసియం ప్రత్యుత్పత్తి ద్విధా విచ్ఛిత్తి ద్వారా జరుగుతుంది. అంటే రెండుగా —అడ్డంగా చీలిపోతుంది. ఆవిధంగా దీని సంతానం విపరీతంగా వృద్ధి పొందుతుంది. కాని ఇలా జరుగుతూ పోతే కొంత కాలానికి అలా ఉత్పత్తి అయినవన్నిటిని నిస్సత్తువ ఆవరిస్తుందనో ఏమో, రెండు పారమీసియములు కలుసుకొని వాటి కేంద్రక పదార్థాల్ని మార్పిడి చేసుకొంటాయి. ఆ తరవాత విడిపోయి తిరిగి అడ్డంగా చీలికలవుతాయి. దీనివల్ల జాతి పునరుజ్జీవం పొందుతుంది.

పరిణామంలో, లైంగిక ప్రత్యుత్పత్తికి పారమీసియంలో ఇలా జరగడం మొదటి మెట్టు అని అంటారు శాస్త్రజ్ఞులు.


చిక్కుపడిన ...

పోతాడు. మామగార్కి సాయిలా పాయిలాగా చెప్పి ఒప్పించేటప్పటికి కతని తల ప్రాణం తోకకొచ్చింది. 'పచ్చి బాలింతరాలని తీసుకు పోతున్నారు జాగ్రత్త. తరువాత మీయిష్టం' సణుగుతూ సాగనంపింది రాజ్యలక్ష్మమ్మగారు. అక్కడి కావిడ కొక్కత్తికే పిల్లక్షేమం పట్టినట్లూ మిగతా వాళ్ళంతా చచ్చునాబమ్మలయినట్లూను.


చంటివాడిని చూసి మురిసిపోయింది సుందరమ్మగారు. 'పసివాడి సంగతి నేను చూసుకుంటాను. నువ్వు అబ్బాయి చెప్పినట్లు వినమ్మా' అంది మెత్తగా. నైనైన వచ్చిన వత్తిడి వల్ల నైతేనేం కరుణాకరం కంఠ శోషవల్ల నైతేనేం పోస్టు గ్రాడ్యుయేటు సెంటరులో చేరింది శ్రీవాణి.

ప్రొద్దున్న తొమ్మిదింటికివెళ్ళి సాయంత్రం ఆరింటికి రావటం, బస్సుకోసం పడిగాపులుపడి నుంచోటం, వాళ్ళు చెప్పేది తనకి పసేమిరా వంటబట్టక పోవటం, ఏమిటో అర్థం కాలేదు శ్రీవాణికి. ఎందుకు తను చదువుతున్నట్లు. ఒక్క విషయం నిశ్చయంగా కనబడుతోంది. తను అటు చంటి పిల్లాడి పోషణ చెయ్యలేక పోతూంది. భర్త విషయం అసలు పట్టించుకోటం లేదు. మనస్సు ఇక్కడుండగా చదువుమీద ఏకాగ్రత కుదరటం లేదు.

'వేణ్ణీళ్ళు తోడాను. రండి. స్నానం చేద్దురుగాని. ఆఫీసుకి టయిమవుతున్నట్లుంది' అంది శ్రీవాణి గడ్డం చేసుకుంటున్న కరుణాకరంతో. 'వాణీ! ఇవ్వాళ కాలేజీ లేదా?' సబ్బు నురగలో అతని మొహం చూస్తే నవ్వొచ్చింది శ్రీవాణికి. సమాధానం చెప్పకుండా ఉయ్యాల దగ్గర కెళ్ళి చంటివాడికి పౌడరు రాస్తున్న శ్రీవాణిలో క్రొత్త ఉత్సాహం కనబడింది. బాత్ రూం పొగతో. నిండిపోయింది. నీళ్ళ కాగు కింద దేదీప్యమానంగా మండిపోతున్న కాలేజీ పుస్తకాలు వెక్కిరిస్తున్నట్లు కరుణాకరం వేపు చూసాయి. 'భలేవాళ్ళు ఈ ఆడవాళ్ళు, చెప్పే దొకటి. చేసే దొకటి' ఆలోచిస్తూ సల సలా కాగుతున్న నీళ్ళు దిమ్మరించుకున్న కరుణాకరం వళ్ళు మ్రుముండి. ●



తెలుగు సాహిత్యపు విలువల్ని మరింత ఎక్కువ చేసిన కొన్ని ప్రకటనా రాజములని మా చిత్రకారుడు పంపగా ఇక్కడ ప్రచురిస్తున్నాము. —సం॥



యలమంచిలి ఝాన్సీలక్ష్మి

జరిగిన కథ

అనూరాధ తల్లి అన్నపూర్ణమ్మ. తమ్ముడు రాజా అన్నపూర్ణమ్మ కన్నబిడ్డల చదువుకోసం ఎంతో కష్టపడుతూవుంటుంది. ఒకనాడు అనూరాధ డాన్సు చూచి బహుమతినీయడానికి ఆగంతుకుడుగా వచ్చి డా. హరికృష్ణ పరిచయమవుతాడు. హరికృష్ణ ఆమెని ఆకర్షించాడు. హరికృష్ణకి తెలియకుండా వచ్చి పరిచర్యలు చేస్తున్న అనూరాధపై అయినవాళ్ళు నిందలు వేస్తారు. ఆస్తికోసం హరికృష్ణకి సిచ్చేక్కిందనే వార్తనికూడా పృష్టిస్తారు బంధువులు. అనురాగమయి అనూరాధ అన్నీ సహిస్తూ వూరుకున్నది హరికృష్ణ తెలివిమయం చూసి అనూరాధను ఇంట్లోంచి వెళ్ళగొట్టాలనే ప్రయత్నం కూడా జరిగింది. మేకవన్నె పులి చంద్రం ఆ యింట్లో జేరి వయవంచన చేయాలని చూస్తుంటాడు.

11

హరికృష్ణ జాడే తెలియక పోవడంతో అనూరాధ హృదయాన మనో వ్యథ మహావృక్షంలా పెరిగి వూడలు వేయ సాగింది. ఏ మూలనుంచీ అతనిగురించి ఒక్క అక్షరం కూడా దొరికి-రాకుండా పోయింది.

అనూరాధ - అన్నపూర్ణ - నృత్య ప్రదర్శన లివ్వడం మానేడం మూలాన కూడ బెట్టిన డబ్బు ఖర్చయి పోయింది. మరో మార్గం కన్పించలేదు - అన్నపూర్ణమ్మ గారికి. అనూరాధను మళ్ళీ ప్రదర్శన లిమ్మని అడగలేక బాధపడుతోందామె లోలోన.

ఆ రాత్రి జయదేవుని అష్టపదుల్ని మననం చేసుకుంటూ, హాభినయం పట్టి చూసుకుంటోంది అనూరాధ. ఏదో 'ప్రోగ్రాము', వచ్చినపుడే ఆమె అలా చేస్తుంది. తమ అవసరాన్ని గుర్తించి ఏ ఆహ్వానానికి అంగీకరించిందో, అనుకున్నదా మాతృమూర్తి.

మునుపటిలా ఆనందంతో ప్రతుళ్ళి పడడం లేదామె. గంభీరత అనుక్షణం ఆ అనురాగమయి వదనాన నీలి నీడల్ని పరుస్తూనే వుంది. అభినయం పరికాచుకుంటూనే మధ్యలో తటాలున ఆగిపోతుంది. ఏదో భావం నిలువెల్లా జరజరా పాకి అలజడి కలిగించినట్లు వూగిపోతుందా క్షణంలో.

అతడు బహూకరించిన కృష్ణవిగ్రహం ఎపుడూ ఆమె కనులముందరే వెదులుతున్నట్లు, అపురూపంగా ఎంచుకుంటుంది.

'కృష్ణా! మీ మనస్సు హోమధురమైన మహాకావ్యం! ఆ కావ్యాన ఈ అనూరాధని నాయికగా మలచుకున్న అనురాగ మూర్తులు మీరు. కానీ... భగవాన్! మీ కల చెదిరిపోయింది. మన జీవితాల విందుగా విరాళవేమో!' అని నిట్టూర్పులు విడుస్తోందామె అంతరంగం అప్పుడప్పుడు.

ఆ మరునాడే నాట్య ప్రదర్శనకు అంగీకరించిందామె. చంద్రం అదంతా తన ప్రోత్సాహమేనని మిత్ర బృందానికి చాటించాడు.

ప్రదర్శన జరుగుతున్నంతసేపూ అవసరం లేకున్నా అటూ యిటూ హడావిడిగా తిరుగుతూనే వున్నాడతడు. కానీ అనూరాధ అతనివైపు కన్నెత్తి చూడకపోయినా ఆమె తనతో మాట్లాడినట్లు, నవ్వినట్లు హావభావాల్ని వివిధ భంగిమలతో ప్రదర్శించుతున్నాడు.

నృత్యం ముగిసింది. ప్రేక్షకులందరూ లేచి వెళ్ళిపోయేముందు 'మైక్' ముందు నిలబడి 'మహాశయులారా! కళాభిమానులారా! ఒక్క మనవి! అనూరాధగారి నృత్యానికి నా మనస్సు ఎంతగానో మురిసి మైమరచిపోయింది. అందుకే దరిద్రుడికో మాటుపోగు అన్నట్లు, నా తరపున వో అయిదువందలు మాత్రం కానుకగా యిస్తున్నాను.' అంటూ అనూరాధకు 'చెక్' అందించాడు.

అందుకున్న వెంటనే అన్నదామె మృదుమధుర స్వరంతో—

'చంద్రంగారి కళాభిమానానికి ఎంతో

కృతజ్ఞత తెలుపుకుంటున్నాను. కళను గుర్తించి సహృదయతతో, కానుకలిచ్చి సత్కరించగలవారిలో విర్మలత వుంటుందని విశ్వసించుతున్నాను. వారికి నా అభివందనాలు. ఈ చెక్కు మన నగరంలోవి 'అనాధ బాలికలకు' అందజేయమని చంద్రంగారిని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.'

చంద్రం ముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్క లేకుండా పారిపోయింది. 'కానుకను స్వీకరించినట్లే స్వీకరించి, ఆ క్షణంలోనే తిరస్కరించింది మృదువుగా. ఎంత నాటకం?! 'ధర్మమూర్తి మెత్తని పులి అన్నట్లు, అనూరాధ మెత్తని కత్తి' ఆ యువకుడు అవమానంతో వుడికిపోయాడు.

మర్యాదకోసం ముఖాన నవ్వు పులుముకుని అందుకు అనూరాధ నెంతగానో అభినందించుతున్నానని తెలిపి వేదికపైనుంచి నిష్క్రమించాడు.

శారద తనివిదీరా నవ్వుకుంది అతని చేష్టలకి.

'అయ్యో! పాపం! అతడు చాణుక్యుణ్ణే అయిపోయాననుకున్నాడు. కానీ అంతా తల్లకిందులైంది!' అన్నది నవ్వుతూ.

'పదిమందిలో నాకెంతో ఆత్మీయుణ్ణని పంచుకోవాలని అతని తహ తహ! అంతే! కళకు నిర్వచనమే తెలియదు పాపం!' జాలి దలిచింది అనూరాధ.

ఆ రాత్రి యింటికి రాగానే అతడెప్పటిలా అనూరాధకు 'గుడ్‌నైట్' అని చెప్పలేదు. ఉదయాన కూడా అనూరాధ అన్న మనిషిని తానంతకుముందు చూడనట్లే ప్రవర్తించాడు.

చీకట్లు అలముకుంటూండగా మరో యిద్దరితో తన గదిలో అడుగుపెట్టాడు. గది తలుపుల్ని భడాలున మూశాడు. కావాలనే అలా గొడవ చేస్తున్నాడని గ్రహించిందామె.

లోపలినుంచి, సీసాలు ఖాళీ చేస్తున్న చప్పుడు, గ్లాసులు బల్లమీద వుంచిన శబ్దాలు విన్పించుతున్నాయి. మధ్య మధ్య చిన్నగా కూనిరాగం గాలిలో తేలివస్తోంది.

నో గంటవరకూ అదే సందడితో ఆ గదంతా మార్మోగి పోయింది. ఆ తరువాత నాటకం 'రిహార్సలు' వేస్తున్నట్లు సంభాషణ ఆరంభమైంది:

'పిచ్చివారి కిచ్చట చికిత్స చేయబడును!' అని చంద్రంగొంతు.

'అనురాగం అన్న ముసుగు వేయబడును!' వరుసగా అందుకుంటున్నారు.

'జేబులోని డబ్బంతా దొంగిలించబడను!'

'అందంగా నీతులెన్నో చెప్పబడును!'

'ఆచరణ అన్నచోట సున్నా వ్రాయబడును!'

'నిషాలో మనస్సున దాగినవన్నీ విప్పబడును!'

పాటలా దొర్లిపోతోంది సంభాషణ. అనూరాధ విన్పించుకోనట్లే వుండిపోయింది. అందుకే మళ్లీ మొదలైంది బుర్రకథ. ఒక్కొక రే అందుకుంటున్నారు —

'నాట్యమయూరీ! నో వయారీ!'

'రాగమయీ! నో త్యాగమయీ! రాగమయీ! ఈ! ఈ!' అంటూ రాగం మొదలైంది. అనూరాధ లేచి చిన్నగా తలుపుతట్టింది.



అంతే! అంతా నిశ్శబ్దమయం అయిపోయింది క్షణంలోనే —

తలుపులు తెరిచి సినీమాలో హీరోలా నిలబడ్డాడు చంద్రం నవ్వుముఖంతో —

'ఇది పానశాలగాదు !'

'మరి ఏశాలో!?'

'చెప్పమంటారా ?'

'తప్పకుండా !'

'గాడిదశాల'

'ఆ ! ఏమిటీ ! !'

'ఏమీలేదు చంద్రం గారూ ! ఈ యింట్లో వొగది 'గార్ధభాలకి' కేటాయించ బడిందని విచారించుతున్నాను.'

'అనూరాధగారూ ! మీరే మంటున్నారో తెలుసా ?'

'ఏం భయపెడు తున్నారా ?'

'ఎవరి నంటున్నారో తెలిస్తే అంటున్నారా ? అతను కలెక్టరుగారి అబ్బాయి. వాడు మంత్రిగారి అల్లుడు...నేను...'

'నిషాకి తమ్ముడివి !' పూర్తి సిందామె.

'ఏమన్నారు ?'

ఆరాధన

'పదవి వున్నచోటే డబ్బు వుంటుంది. కానీ మంచీ, మర్యాదా, శీలం, సిగ్గూ మేలుకొని వుండడంమాత్రం మహాకష్టం అంటున్నాను.'


'బావుంది ! ఉపన్యాసం ! చప్పట్లు కొట్టండోయ్ ! చూస్తారేమిటిరా ? వాజమ్మల్లా !' వెకిలిగా నవ్వాడతడు చప్పట్లు కొడుతూ.

'ఇదిగో ! చంద్రంగారూ ! మనిషిగా ప్రవర్తించినంత వరకే సహనం క్షమించుతుంది. ఆ తరువాత ఘోరపరాభవం తప్ప ఎదురయ్యే దేమీలేదని తెలుసుకోవడం మంచిది.'

'వ్రాసుకోండోయ్ ! దద్దమ్మల్లారా!'

'పోలీసుల్ని ఆహ్వానించ మంటారా ? మర్యాదగా సంకెళ్ళతో మరో శాలకి తరలించుతారు మహారాజుల్ని !' అన్నదామె.

ఆ మాటతో అతని పైత్యం కాస్తా దిగిపోయింది పూర్తిగా. గదిలో కూర్చున్న ఆ యిరువురూ ఫరిక్కిపడ్డారు.



'మళ్లీ గానకచేరి ఆరంభం చేయాలనుకుంటే నా అడ్డేమీ లేదు. నిరభ్యంతరంగా కానివ్వండి. బహుమతులు మాత్రం రేపు కలెక్టరుగారే అందించుతారు స్వయంగా.' వెంటనే వెళ్లిపోయిం దామె.

మళ్లీ చిన్న శబ్దంకూడా వెలువడలేదా గదిలోనుంచి. అనూరాధ మనస్సున చంద్రంపట్ల ఎంతో అసహ్యత పేరుకుపోయింది. దీనికంతటికీ కారణం రామనాథంగారేనని గ్రహించింది.

ఉదయాన లేవగానే చంద్రం చేతులు నలుపుకుంటూ వచ్చి అనూరాధ ముందు నిలబడ్డాడు.

'క్షమించాలి! రాత్రి కొంచెం ఎక్కువ తాగాం! నిషాలో మిమ్మల్నేమన్నా అవమానించి నట్లయితే దయచేసి అపార్థం జేసికోవద్దని కోరుతున్నాను.' అన్నాడు వినయంగా తలవంచుకుని బుద్ధిమంతుడిలా.

కాఫీ వడపోస్తున్న ఆమె తలఎత్తి చూసిం దతని వైపు.

'తప్పుచేసి క్షమాపణకోసం పరుగులెత్తడం అలవాటు చేసుకున్న మనుషుల్ని ఎవ్వరూ నమ్మరు. తప్పు ఎవరు చేసినా తప్పే అవుతుంది గాని ఒప్పు అవదు. పశ్చాత్తాపం మనస్సులో వుండాలి. నాలుక మీద గాదు.'

సౌమ్యస్వరంతో అన్నదామె.

తాను చేసిన రభస కెంతో సిగ్గుపడి పోతున్న వాడిలా తల దించుకునే వుండిపోయాడు చాలా సేపటివరకు. అయిదారు నిమిషాలు గడిచిన తరువాత పశ్చాత్తాప స్వరంతో అన్నాడు —

'మా ఫ్రెండ్స్ బలవంతం చేయటం మూలాన రాత్రి తాగవలసి వచ్చిందండీ! మీ రానాడు అన్నప్పటినుంచీ మానివేశానసలు—'

అది పచ్చి అబద్ధం అని ఆమెకు తెలుసు. అతడు ప్రతిరోజూ భోజనంతరువాత సీసాలోనుంచి బ్రాందీ వంపుకుంటూన్న ధ్వని ఆమె చెవులబడుతూనే వుంది. కానీ అతడాసంగతి ఆమె కంటబడలేదన్న వూహతో అందంగా అబద్ధాన్ని అతికించా ననుకుని మురిసిపోతున్నాడు లోలోన.

అనూరాధ కాతనివైపు చూస్తేనే మహా



" చదువులోనూ ఆటలోనూ
ఆమె నేర్పు గలది! "
కాని, కొన్నాళ్లకు ముందు ఆమెకు ఎంతో నీరసంగా వుండేది. నేను ఆమెను డాక్టరికి చూపించాను.
డాక్టరు ఇలా అన్నారు: "అదనపు శక్తి కోసం మీ అమ్మాయికి రోజూ హార్లిక్స్ ఇవ్వండి."
హార్లిక్స్ త్రాగటంవల్ల ఇప్పుడు ఆమె ఉత్సాహంతో ఉబ్బి పోతున్నది!
హార్లిక్స్ ఆమెకు శక్తి ఉత్సాహములను యిచ్చింది!
పెరిగే పిల్లలకు చురుకుగా వుండుటకు కావలసిన అదనపు శక్తిని యిచ్చుటలో హార్లిక్స్ సహాయపడుతుంది. డాక్టర్లు పిల్లలకు హార్లిక్స్‌ను సిఫార్సు చేస్తారు. ఎందుకంటే అది వారికి దృఢత్వాన్నీ బలాన్నీ యిస్తుంది. మీ అమ్మాయికి కూడ హార్లిక్స్ అవసరము!
పూర్తి మీగడ గల పాలతో గోధుమ పిండి మరియు మాల్టెడ్ బార్లీల పోషకవంతమైన సారములు చేర్చి తయారు చేయబడినది
Horlicks
హార్లిక్స్ అదనపు శక్తిని కలిగించును!

పాపాలు చుట్టుకుంటాయేమో నన్నంత భయం కలిగింది. అతని ప్రవర్తనకామెకే సిగ్గనిపించింది. మనుషుల్లో అంత అసత్యవాదుల్ని ఆమె ఏనాడూ చూడలేదనుకుంది.

'మీకో సామెత గుర్తుచేస్తే బాగుంటుంది! 'పిల్లి పాలుతాగుతూ — నన్నెవరూ చూడటం లేదులే—' అనుకుంటుందట! పాపం! నలుగురూ చూస్తూండగానే'

అతనిముఖం బొగ్గులా నల్లగా మాడిపోయింది. ఆ వ్యంగ్యోక్తి ఎంత మృదువుగా వుందో అంత వాడిగా గుచ్చుకుంది అతనికి.

'నేనంటే మీకెందుకో కోపం? ఎప్పుడూ తీయగా తిడుతూనేవుంటారు!' అవమానాన్నికూడా తీయగా వుందని వర్ణించాడతను వెర్రిగా.

'మీ వ్యాపారం గొప్పదే! కానీ దానికి కొంచెం 'ఆత్మగౌరవం, నీతి, నిజాయితీలతో' రంగులు వేయండి. అప్పుడది నిజంగా తీయగానే వుంటుంది.' మృదుమధురంగా ధ్వనించిందామె స్వరం.

ఆరాధన

ఆ తరువాత ఆమె అతని సమాధానం వినకుండానే తన గదిలోకి వెళ్ళిపోయింది. చంద్రం దెబ్బతిన్న పులిలా హుంకరించాడు లోలోన. పైకిమాత్రం నవ్వు ముఖంతో విలాసంగా సిగరెట్ పీల్చుతూ బయటికి వెళ్ళిపోయాడు.

'అబ్బాయిగారి పప్పులుడకడం లేదు. అనూరాధమ్మగారిముందు!' అంటూ నవ్వుకున్నాడు జోగులు అతను పలాయనం చిత్తగించడం చూసి.

ఆ వుదయాన వెళ్ళినవాడు రాత్రికి కూడా తిరిగిరాలేదు. అనూరాధ, అతని కోసం ఎవర్నీ నిరీక్షించవద్దని చెప్పింది.

గేటుమూసి తాళం వేయించింది. అన్నపూర్ణమ్మగారుకూడా అలాగే అన్నది—

'మరీ హద్దుమీరి పోతోందమ్మా వాడి ప్రవర్తన!'

'నిజమే అక్కా! రాత్రి ఆ నాగుల మూలాన నా చదువు పాడైపోయింది' అన్నాడు రాజా.

'అమ్మా! బుద్ధిలేనివాళ్ళని భయపెట్టి లొంగదీయలేం! అలా అయితే మరింత గొడవ చేస్తారు. మర్యాదగానే మృదువుగానే సత్కరించి పంపించి వేద్దాం!' అన్నది అనూరాధ.

'ఏమిటో! తల్లి! పాపం! ఆ డాక్టరేమో అలా అయిపోయె! అతనికోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తున్నారు శారదా, నువ్వూ! ఎలా జరుగుతుందో? ఏమిటో? ఈ ఎముకలగూడు చిన్నబిడ్డ మనసారా నవ్వడం చూస్తుందో లేదో!' ఆ మాతృహృదయాన వ్యధ అశ్రువులై పరుగులు పెట్టసాగింది.

అనూరాధ మౌనం వహించింది.

* * *

చంద్రంలో వ్యాపారవేత్త వున్నాడని గ్రహించింది అనూరాధ. మనుషుల్లో ఇంత మార్పులుంటాయని ఆమె ఏనాడూ వూహించనేలేదు.

ఆ రోజున చంద్రం, సుమారు ఇరవై సంవత్సరాలున్న ఓ యువతిని వెంటబెట్టుకు వచ్చాడు. అనూరాధ చూసీ చూడనట్లు మౌనం వహించింది. అతడు చాల గర్వంగా నవ్వాడు అనూరాధ వంక చూసి వెంటనున్న యువతికి కనుసైగ జేసి.


'నమస్కారం అనూరాధాదేవీ! ఒక్క క్షణం మాకోసం మీ అమూల్యమైన సమయాన్నుంచి కేటాయించమని కోరుకుంటున్నాం!' అతి వినయంగా అర్థించాడు. ఆ కంఠాన దాగిన వెటకారం ఆమెకు స్పష్టంగా వినిపించనే వుంది.

వెంటనున్న యువతి 'లిప్‌స్టిక్' అద్దుకున్న పెదవుల్ని అప్పుడప్పుడు తడుపుకుంటోంది. నాలుకతో ఎర్రదనం కోసం. దిద్దుకున్న కనుబొమల్ని అతి విలాసంగా కదిలించుకుంటూ ఒయారాలొలికించుతోంది.

'నా క్లాస్‌మేట్! శ్రీలత! మిమ్మల్ని చూడాలని వచ్చింది!' అంటూ పరిచయం చేశాడు. ఆమె నమస్కరించబోతుంటే ఆ పని తనకు తెలియనట్టు కరచాలనం కోసం చేయి జాచింది.

అనూరాధ నమస్కరించి అన్నది మృదు స్వరంతో—

మన ఆచారంలో మంచి వున్నా ఆచరించడానికి వెనుదీయడం మన ఆత్మగౌరవానికే అప్రతిష్ఠ! శ్రీలతగారూ!



మనది భారతదేశం! ఇంగ్లండు గాదు. అని ముఖ్యంగా ముందు మన స్త్రీలు గుర్తించినపుడే యీ వెర్రి వ్యామోహం తగ్గిపోతుంది.'

తెలుగే అర్థం కానట్లు చూసిందా యువతి. చంద్రం వంక చూసింది 'వాట్' అంటూ.

'వీళ్ల కుటుంబం అంతా అమెరికాలోనే వున్నారండీ! ఈ సంవత్సరమే వచ్చారు! అందుకే తెలుగు అంతగా తెలియదు!' అన్నాడు చంద్రం.

'కూర్చోమ్మా! శ్రీలతా! చంద్రం గారు చెప్పింది విన్నాను. కానీ అది నిజమనిపించడం లేదెందుకనో, నీకు తెలుగు వచ్చు! కానీ మాట్లాడ గూడదని అనుకున్నావు! అమెరికా గాదు, హాలెండు వెళ్లి హాలెండులో వుండు. మాతృభాషని మరిచిపోవడం మనల్ని మనం అవమాన పరుచుకున్నట్లే!'

శ్రీలత ముఖం తెల్లగా పాలిపోయింది. చంద్రం ఆమె ఏం మాట్లాడుతున్నదీ విననట్లు ప్రక్కనేవున్న 'మేగజైన్'లోని బొమ్మల్ని చూస్తూండిపోయాడు. కాని అతడు విన్నాడని గ్రహించింది అనూరాధ.

శ్రీలత 'ఆధునిక నాగరికత' అన్న ముసుగులో మోసగింపబడుతోందని తెలుసుకుంది.

చంద్రం ఎప్పటికో లేతెత్తాడు. అనూరాధా, శ్రీలతలు దేన్నిగురించో చర్చించుకుంటున్నారు.

శ్రీలత సంభాషణలో 'చంద్రం' తనను పెళ్ళాడబోతున్నట్లు చెప్పింది. ఆ మాట వినగానే అనూరాధ సూటిగా చూసిందామె కనులలోకి...

'పై వేషం చూసి మోసపోతున్నావనుకుంటానే! మనస్సు నిర్మలంగా వుంటే మీ నిర్ణయం మంచిదే! కాని...' అర్థోక్తిలో ఆగిపోయింది.

శ్రీలత కామె వుద్దేశ్యం పూర్తిగా బోధపడలేదు. అందుకే ఏమిటి మీరంటున్నదని తిరిగి ప్రశ్నించింది.

'అబద్ధాలతోనే జీవించేవాళ్లు కొందరుంటారు లతా! వాళ్లను నమ్మి మనసున మల్లెలు పరచుకో గూడదు.'

శ్రీలత చంద్రం వైపు చూసింది. అతను బుద్ధిమంతుడిలా పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. శ్రీలత తండ్రి పెద్ద ఆస్తి పరుడవ్వడమే, చంద్రం ఆమెను వివాహమాడడానికి మూలకారణం అని గ్రహించింది అనూరాధ.

ఆ తరువాత చంద్రం 'మీ నాన్న గారు ఫోనుచేసారు పద! ఆలస్యమైంది!' అంటూ శ్రీలతను తొందరజేసి తీసికొని

ఆరాధన

వెళ్ళిపోయాడు. అతని అసలు రంగు బయటపడుతుందని ఆ విధంగా పలాయనం చిత్తగించాడని అర్థమయ్యిందామెకు.

మరో పదిరోజుల వరకు ఏ విశేషమూ జరగలేదు. చంద్రం రాత్రుళ్ళు కాడా ఒక్కొక్కనాడు యింటికి రావడంలేదు. శ్రీలత అప్పుడప్పుడు 'ఫోను' చేసి అతని గురించి కనుక్కుంటూ వుండేది.

ఆ సాయంత్రం, వరండాలో నిల్చుని వుంది అనూరాధ.

శ్రీలత నుదుట స్వేద బిందువులు మెరుస్తూండగా వచ్చింది.

'అక్కా! చంద్రం వున్నారా ?' అన్నది.

అతడు నాలుగురోజుల నుంచి యింటి పట్టునే వుండడం లేదని చెప్పిందామె. ఆమె ముఖాన విచారం, నీలినీడల్ని పరచింది. ఏదో జరగరానిది జరిగిందని గ్రహించింది అనూరాధ. కూర్చోమని చెప్పింది.

'చంద్రంతో ఏం పని యిప్పుడు?' అన్నది.

'అయిదారు రోజుల క్రితం నాన్న గారితో చెప్పారు ఆయన రేపూ వివాహం చేసికుంటానని. అంగీకరించారు నాన్నగారు. 'చెక్' మారలేదని చెప్పి నాన్నగారి దగ్గర పదివేలు పట్టుకుని వెళ్ళారు. ఇంతవరకూ కంటికే కన్పించ లేదు. 'చెక్' చెల్లదని తెలిసింది బాంక్‌కి తీసికెళ్ళి చూపించితే.'

కానీ జరిగింది అదే గాదని యింకా జటిలమైన సమస్య ఏదో వున్నదని తోస్తోంది అనూరాధకు.

అంతలో నౌకరు వో శుభలేఖ తెచ్చి అనూరాధ కందించి వెళ్ళిపోయాడు. ఏమిటిదా అని విప్పిందామె. వధూవరుల పేరు చూడగానే ఆశ్చర్యపోయిం దెంతగానో —

'శ్రీలతా! ఇదేమిటి ?! మరి! చిరంజీవి చంద్రానికి, చి. సౌ. వాణి బాలను' అని వ్రాశారు. నువ్వేమో అతడు నిన్నే పెళ్ళాడ బోతున్నాడని చెప్పావు' అన్నది ఆశ్చర్యంనుండి తేరుకుని.

'అక్కా! ఏం చెప్పమంటావు ?!' అనూరాధ ఒడిలో వాలిపోయిందామె. పెద్దగా రోదించసాగింది. ఆ మూర్ఖుడు లభం శుభం తెలియని ఆ అమాయకు రాలిని మోసం చేశాడని తెలుసుకుంది. ఆ దుఃఖావేశంనుంచి తేరుకున్న తర్వాత అడిగింది —

'పువ్వులాంటి నీ జీవితాన్ని నాశనం చేయలేదుగదా! అతనికి డబ్బుతప్ప మరో దాని విలువ తెలియదు లతా!' అను మానించిందామె.

'లేదక్కా! అంత చనువు యిస్తేగా యింకా నే నతనికి! నువ్వొకాడు అతడిని గురించి 'మేకవన్నె పులి', అని చెప్పి నప్పటినుంచి మెలకువగానే వుండాలని నిశ్చ యించుకున్నాను. కాని...మనస్సును దానా మమతల్ని వో మూర్ఖుడికి, అనర్హుడికి అర్పించినందు కెంతో బాధగా వుంది.'

శ్రీలత కన్నులలో గిర్రున నీరు తిరిగింది.

ఆమె మోసగించ బడిందని తెలుసు కున్న అనూరాధ వ్యధకు అంతులేకుండా పోయింది.

'చూడమ్మా! లతా! పడవ మునిగకముందే మేల్కొన్నందుకు నా కెంతో ఆనందంగా వుంది. అతడు మానవత్వాన్నీ మమకారాన్నీ మరిచిపోయిన మహా మూర్ఖుడు. అందుకే యింత నిర్దాక్షిణ్యంగా నీ మనస్సును ముక్కలు ముక్కలుగా తుండించి మరీ పరిత్యజించి వెళ్ళి పోయాడు. మరి యిపుడు ఏం చేద్దామని నీ వుద్దేశ్యం ?'

'ఏం చేయగలనక్కా. ఇంకా ఆ నరకం లోకి తొంగిచూడనా! ఊహూ! నా తరం గాదిక. ఎంతమందినిలా మోసగించి ఎంతడబ్బు సంపాదించాడో ?' వాపోయిందా శ్రీలత.

ఆ తరువాత కొంతసేపటికామె సెలవు దీసికొని వెళ్ళిపోయింది భారమైన మనస్సుతో.

(ఇంకా వుంది)

కూరల గుణాలు:

పుచ్చకాయ

దీని కూర చలవ చేస్తుంది. మూర్ఛను, పైత్యాన్ని అణచును. నేత్ర రోగులకు, పైత్య రోగులకు మేలుచేస్తుంది.

వాతం చేస్తుంది. శుక్లాన్ని హరిస్తుంది. కఫాన్ని పెంపొందిస్తుంది. అగ్ని మాంద్యం చేస్తుంది.

పుచ్చాకుకూర చేదుగా వుంటుంది. రక్తస్రావాన్ని అణచుటకు తోడ్పడుతుంది. చలవ చేస్తుంది.

దీనికి విరుగుళ్ళు: — 1. తేనె 2. శాకవస్తువులు.

బుడమకాయ

దీనికూర పైత్యం, వాతం, మూలవ్యాధి, శూల, ఉదావర్తము, మూత్రకృచ్ఛము, గుల్మం, మేహం, మలబద్ధం గలవారికి మేలుచేస్తుంది.

లేతకాయ పైత్యాన్ని హరిస్తుంది. ముదరకాయ పైత్యం చేస్తుంది. పండు మేహశాంతి చేస్తుంది.

ఎండిన బుడమకాయ వరుగును నేతిలో వేయించి తింటే జఠరదీప్తి నిస్తుంది. తేలిగ్గా జీర్ణమవుతుంది. నూనెలో వేయించి తింటే అధిక జల పాన దోషాన్ని హరిస్తుంది.

పుచ్చకాయలను ముక్కలుగా కోసి అముదంలోవేసి ఉడికించి, ఆ అముదాన్ని రెండు మూడు తులాల ఎత్తు సూర్యోదయం కారపూర్వం (తెల్లవారు ఝామున) లోపలకిచ్చిన నులి పురుగులు మొదలగు క్రిములు విరేచనము ద్వారా వెడలగొట్టబడతాయి.

సేకరణ:— అత్తుండి నారాయణమూర్తి

ధర్మపథం

గజేంద్ర మోక్షతత్త్వం



బులుసు వేంకటరమణయ్య

గజేంద్రమోక్ష కథ భాగవతంలోని కథలలో ప్రసిద్ధమయినది. శాపవశాత్తూ గజేంద్రుడైన ఇంద్రద్యుమ్న మహారాజు వనవిహారం చేస్తూ దప్పి తీర్చుకోవడానికి ఒక సరస్సులో దిగగా, ఒక మొసలి పట్టుకున్నదనీ. గజరాజు ఎంతో కాలం దానితో హోరాహోరిగా పోరినా ప్రయోజనం లేకపోయినదనీ. సత్వహీనుడైపోయిన అతడు మొసలినుండి తప్పించుకోలేక 'నీవే తప్ప నితఃపరంబెరుగ మన్నింపందగుం దీనునిన్, రావే ఈశ్వర కావవే వరద' అని భగవంతునికి మొర పెట్టుకోగా, వైకుంఠంలో ఉన్న ఆ విష్ణువు హుటాహుటిని వచ్చి మొసలినుండి గజేంద్రుని విడిపించి, మోక్షాన్ని అనుగ్రహించాడనీ – ఈ కథ ప్రసిద్ధంగా ఉన్నది.

ముఖ్యంగా వేదాంతాన్ని తెలియజేసే భాగవతంలో – దీన్ని బట్టి ఆ తత్త్వాన్ని తెలుసుకోడానికి ఎంతో అవకాశం ఉన్నది.


గజేంద్రుడు జీవాత్మ. సారం లేని సంసారమే ఒక సరస్సు. దేహసంబంధమైన సుఖదుఃఖాలు తనవిగానే భావించిన జీవాత్మ భోగానుభవం కోసం భోగదాహాన్ని తీర్చుకోడం కోసం సంసార సరస్సులో దిగబడింది. ఇంద్రియచాంచల్యం అనే మొసలి దానిని పట్టుకొన్నది. ఆ చాంచల్యానికి లొంగిపోవలసి వచ్చింది. సంసారంలో దిగాక ఇంద్రియ సుఖాలకు లోబడకుండా ఉండడం సాధ్యం కానేకాదు. జీవాత్మ ఇంద్రియ చాంచల్యంనుండి తప్పించుకోడానికి ఎంతో కాలం, ఎన్నో విధాల ప్రయత్నం చేసింది. ఇంద్రియాలను ఇంద్రియార్థాల నుంచి మళ్లించడానికి ఎంతో పోరాడినది కాని. అన్నీ దానికి వ్యతిరేకించాయి. అవివేకంతో ఉండడంవల్ల – వాటిని జయించగల శక్తి దానికి నశించినది.


ఎంతో కాలం ఇలా జరిగిపోయింది. గజేంద్రుడికి 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' అనే బుద్ధితోచి పరాత్పరుణ్ణి అతడు శరణు చొచ్చినట్లు – జీవాత్మకు – అప్పటికి వివేకం కలిగింది. ఈ జంబాలం నుంచి బయటపడడానికి ఆత్మజ్ఞానమే మార్గమని తోచింది. సంసారపైని వైముఖ్యం ఏర్పడింది. దానివల్ల సంసార బంధంనుంచి విముక్తి లభించింది.

ఇంద్రియ చాంచల్యానికి మొసలితో పోలిక ఎందుకు చెప్పబడిందంటే – మొసలిపట్టు చాలా గట్టిపట్టు ఆ పట్టును విడిపించుకొనుట అసాధ్యం. ఆ పట్టు వివేకం మూలంగా విడిపోవడం వల్లనే జీవాత్మకు బంధ విముక్తి — స్వేచ్ఛ లభించింది. అది పరమాత్మతో ఐక్యం పొందింది.

వివేకమూ, వైరాగ్యమూ ఉంటే చాలు. వాటివల్ల ఇంద్రియాల పట్లు వాటంతటవే విడిపోతాయి.

ఆ వివేకం లేకపోతే ఇంద్రియ విజయం దుర్లభం! ముక్తి అంతకంటెనూ దుర్లభం!





మగువ మనసు

బి.టి. పద్మినీదేవి

'అమ్మా! నాకా పెన్సిలు కావాలి... ఊ...' పెద్దగా రాగాలు తీస్తున్నాడు రవి వాడి ఏడుపుకు పెంకులెగిరిపోయేలా ఉన్నాయ్.

'ఏమిటిరా' అంటూ గదిలోకి వచ్చింది భార్గవి.

రవి ఏడుస్తూనే చందు చేతిలో పెన్సిల్ లాగటానికి ప్రయత్నం చేస్తున్నాడు. చందు మాట పైకి రాలేదు కాని అన్నకా పెన్సిలు ఇవ్వటానికి ఏ మాత్రం వాడు సుముఖంగా లేదు.

'ఇద్దరికీ చెరో పెన్సిలు ఉన్నాయి కాద్రటా' అంది భార్గవి.

'అన్నయ్య బళ్ళో పారేసుకొన్నాడు' అన్నాడు చందు.

'నీది పారేసుకుని వాణ్ణి ఇమ్మంటా వేంరా వెధవా! ముయ్యి నోరు' ఒక్క గుదుము గుదిమి రెక్క పుచ్చుకొని రవిని ఇవతలకి లాగిందామె. దాంతో రవి ఏడుపు తారాపథానికి అంటింది. నేలమీద వెల్లకిలా పడుక్కుని కాళ్ళూ చేతులూ నేలకేసి బాదుతూ నానా హంగామా చేసేస్తున్నాడు వాడు

అనుకున్నది అయితేనే కాని వాడు పట్టు వదలడు. భార్గవికేం తోచలేదు. మెరిసిపోయే రెండు పెన్సిళ్ళు, రెండో చివరి చిన్ని బొమ్మలున్నవి తండ్రి. తెచ్చాడు బొంబాయినించి. అందులో తనది పారేసి తమ్ముడి పెన్సిలుకోసం పేచీ పెడుతున్నాడు పెద్దవాడు. అలాంటివి దొరకడంలేదిక్కడ కొందామంటే. చందూ పెన్సిలు రవి కిప్పించటం ఏం న్యాయం గనక.

'ఫో వెధవా! ఏడు.' చిరాగ్గా హాల్లో కొచ్చి కూచుంది భార్గవి. చందూ మెల్లగా తల్లి దగ్గిరకొచ్చాడు. 'అమ్మా' అంటూ.

'పోనీ అన్నయ్య కిచ్చెయ్' పెన్సిలు తల్లి వళ్ళో పెట్టాడు. భార్గవి మనసు అదోలా అయిపోయింది

సాధారణంగా పెద్ద పిల్లలకన్న చిన్న వాళ్ళే పెంకిగా ఉంటారు. తమ్ముని పట్టుదలకి అన్న తలఒగ్గటం ఉంటుంది కాని ఇలాగుండదు.

రవి అంటే ఒళ్ళు మండింది భార్గవికి. 'ఏమక్కర్లేదు. నీ పెన్సిలు నీ దగ్గరే ఉంచు. వాడి సంగతి నేను తేలుస్తాను' అనేసింది.

తల్లికంత కోపం ఎందుకొచ్చిందో ఆరేళ్ళ ఆ పసివాడికి అర్థంగాలేదు. పెన్సిలు తీసుకొని దూరంగా వెళ్ళిపోయాడు.

రవి ఇంకా పెద్దగా ఏడుస్తూనే ఉన్నాడు. భార్గవి మనస్సు అల్లకల్లోలం అయిపోయింది. మొండితనంతో ఏదైనా సాధించవచ్చు. మెత్తగా ఉండేవాళ్ళు ఎక్కడైనా ఎదురు దెబ్బలు తింటూనే ఉంటారు రవి, చంద్ర పెద్ద వాళ్ళవుతూన్న కొద్దీ భార్గవికి తన జీవితం గుర్తుకు వస్తోంది. అందుకు కారణం — మాధవి భార్గవి అక్కచెల్లెళ్ళు — రవి చంద్ర స్వభావాలు ఆ అక్కచెల్లెళ్ళకు ప్రతిబింబాలు.

సోఫాలో చేరబడిపోయింది భార్గవి తల నొక్కుకుంటూ.

మాధవికి మూర్తికీ ఆరునెల్లు తేడా. అందుకే భార్గవికి మేనరికం ఖాయమన్నారు చిన్నతనంలోనే. మాధవి తర్వాత ఏడేళ్ళకు పుట్టింది భార్గవి.

ఊహ తెలిసినప్పటినుంచి భార్గవి మూర్తిబావ ఎదట పడటానికే సిగ్గుపడిపోయేది. అక్క మూర్తితో కలిసి ఆడుతూంటే కిటికీలోంచి చూసేది. అలా భార్గవి తన ఊహలతోబాటు పెరిగి పదహారేళ్ళ పడుచైంది.

ఒకరోజు — ఆ రోజు మూర్తి ఊరు నించి వచ్చాడు. చదువై ఉద్యోగంలో చేరటానికి వెడుతున్నాడు.

మాధవికి సంబంధాలు చూస్తూ ఉన్నారు. ఎన్ని సంబంధాలు వచ్చినా ఏదో ఒక వంకపెట్టి తిరగ్గొడుతూనే ఉంది మాధవి.

'పెద్దదానికి కుదిరితే, ఇద్దరికీ ఒకే సారి ముడిపెట్టవచ్చు. త్వరగా ఏదో ఒకటి కుదర్చండి.' అని మూర్తి తల్లి చెప్పి వెళ్ళిందికూడా.

భార్గవి లెవెన్త్‌క్లాస్ చదువుతోంది. స్కూలునించి ఇంటికివచ్చి పుస్తకాలు గదిలో పడేసింది.

'ఏదేమిటే, నీకేమైనా మతిపోయిందా! వాడికి నీకు ఆరునెల్లేకదా తేడా! మొన్న చూసి వెళ్ళిన కుర్రాడు వీడికేం తీసిపోయాడూ నిక్షేపంలా ఉంటేనూ' తల్లిమాటలు వింటూ కదలకుండా అక్కడే నిలబడిపోయింది భార్గవి.

'అంత నిక్షేపంలా ఉన్న సంబంధం నీ చిన్నకూతురికే చెయ్యొచ్చుగా. నాకు నిక్షేపాలేమీ అక్కర్లేదు, అడిగింది అవునంటే చాలు.'

'అవ్వ ఏం మాటలే ఇవి ఇన్నాళ్ళనించి అనుకున్న దేమిటి ఇప్పుడు నువ్వనే దేమిటి? చిన్నప్పటినించి మూర్తికి దానికీ అనుకున్నాం గదా! ఇప్పుడెలాగ' అంది తల్లి.

దాంతో మాధవి గొంతు హెచ్చిపోయింది. 'అంత అనుకుంటే ఇక నా అభిప్రాయం అడగటం ఎందుకూ? ఒక బండ నా మెడక్కట్టి నూతులో దింపెయ్ పీడా వదిలిపోతుంది!'

'వింటున్నారటండీ! మీ ముద్దుల కూతురి మాటలు! లేకలేక పుట్టిందంటూ బాగా నెత్తి కెక్కించుకున్నారు. ఇప్పుడది పట్టిన కుందేటికి మూడే కాళ్ళు! ఎవరైనా వింటే నవ్విపోతారు. అయినా వాడుమాత్రం ఒప్పుకోవద్దూ. చిన్నప్పట్నించి భార్గవిని ఇద్దామనుకుంటిమి.' తల్లికి మాధవి మాటలు ససేమిరా నచ్చలేదు.

భార్గవి మనస్సు ఎక్కడ బాధ పడుతుందో అని ఆమె తల్లడిల్లి పోతూనే ఉంది. మాధవి పెంకితనం ఆమెకు తెలియంది కాదు.

మూర్తిని చేసుకుంటానని మాధవి పట్టుబడుతూ ఉంది. దీన్లో ఒక్కబాధ కాదు ఆరునెల్లచిన్నే అయిన మాధవిని కోడలు చేసుకోటానికి మేనత్త అంగీకరించాలి. ఎలాగో ఒప్పించినా భార్గవిని కాకుండా మాధవిని పెళ్ళాడటానికి మూర్తి ఒప్పుకోవద్దూ.

మూర్తి మెడలు వంచి ఒప్పిస్తే, చిన్ననాటినించి ఆశలు పెంచుకున్న తమ చిన్నకూతురు మనస్సు ఎంత గాయపడుతుందో! ఇన్ని సమస్యలతో తల్లిదండ్రులిద్దరూ ఉక్కిరి బిక్కిరయ్యారు.

'చేసుకునేవాడు మూర్తి. ముందర వాడిని అడుగుతాం. వాడొప్పుకుంటే సరి. లేకపోతే నువ్వు మేం చెప్పినట్లు వినాలి' అన్నమాటకు కొంత శాంతించింది మాధవి.

భార్గవి గుండెలు గుబగుబ లాడుతూనే ఉన్నాయి. రాత్రి పది దాటిన తర్వాత నాన్న మూర్తిని పిలిచాడు. అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి గోడవారను చేరింది భార్గవి గుండెలన్నీ చెవులో కూర్చుకుని తహతహలాడే మనస్సుతో వింటూంది.

'నాయనా మూర్తీ నా కడుపున పుట్టకపోయినా వచ్చిందిరా! ఇన్నాళ్లుగా భార్గవిని నీకిద్దాం అనుకున్నాము! ఇప్పుడు మాధవిది ఒక పెద్ద ప్రశ్న అయిందోయ్. దానికి వచ్చ చెప్పలేకుండా ఉన్నాం. నేనూ బావకంటె చిన్నదాన్నే కాదా అంటుంది. ఏన్ని సంబంధాలైనా తిరగొట్టేస్తుం దనుకో, ఏం చెయ్యాలో తోచటంలేదు. ఏమయినా ఒక్క మాట నా యిద్దరి పిల్లల్లో ఎవర్నెంచుకున్నా నాకు సంతోషమే. ఇక నీ యిష్టం'

ఒక్కక్షణం నిశ్శబ్దం. మేనమామ మాటలకు మెత్తగా నవ్వాడు మూర్తి. 'అదేమిటి మామయ్యా! మీ పెద్దలంతా ఏమి నిర్ణయిస్తే అదే. నా కెవరైనా ఒకటే' అనేశాడు.

చివ్వున మంచంమీద వాలిపోయింది భార్గవి. మెల్లగా వచ్చి మంచం మీద పడుకున్నంటున్న మాధవి మాత్రం భార్గవి సంగతి గుర్తించలేదు. ఒకేమాట 'ఎవరైనా ఒకటే' అన్న ఒకేమాట భార్గవి హృదయంలో అగ్ని పర్వతాన్ని రగిలించింది. మాధవి మనస్సులో మల్లెలను విరియించింది.

మూర్తి నిర్ణయం విని భార్గవి వైపుచూసి మనస్సులోనే వ్యధపడింది తల్లి. ఒక నిట్టూర్పు విడిచాడు తండ్రి.

'ఇప్పుడు నా పెళ్ళికేం తొందరనాన్నా! నాకు బాగా చదువుకోవాలని ఉంది,' అని తలవంచుకొని చెబుతున్న భార్గవి మాటలను కాదనేశక్తి ఆయనకు లేకపోయింది.

మాధవి మూర్తితో వెళ్ళిపోయింది. భార్గవి ఆరేళ్లచదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరింది.

మగువ మనసు

'అమ్మా అమ్మా నాన్నొచ్చాడు' నీరసంగా సోఫాలో వాలిపోయిన భార్గవి ఉలిక్కిపడి లేచింది ఆ మాటలకు.

'వెళ్లి వారం కాలేదు' మనసులోనే అనుకుని 'ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చారు. కూర్చోండి' అంది.

'అనుకోకుండా ఆఫీసు పనిమీద ఇటొచ్చాను. అందుకే ఉత్తరం వ్రాయలేదు' అంటూ కూర్చున్నాడతను.

'నాన్నా! అన్న పెన్సిల్ పారేసుకొని నన్నియ్యమంటున్నాడు' చందూ అప్పుడే నేరాలు చెప్పటం ప్రారంభించాడు.

భార్గవి కాఫీ తీసుకొచ్చింది. పిల్లలిద్దరు తండ్రిమీద పడిపోతున్నారు. 'కాఫీ తీసుకోండి' అంది భార్గవి.

'పిల్లల్ని వదలి ఉండటం కష్టంగానే ఉంది.'

భార్గవి తలవంచుకొని గడప కానుకొని నిలబడి ఉంది. ఆ మాటలకు ఆమె సమాధానం చెప్పలేదు. కొంచెంసేపు భార్గవి సమాధానంకోసం ఎదురుచూసి 'నాతో వచ్చేస్తార్రా' అన్నాడు పిల్లల్ని. 'అమ్మవస్తే మేం వస్తాం' పిల్లలిద్దరూ ముక్తకంఠంతో జవాబు చెప్పేశారు. అమ్మవిషయంలో ఆ అన్నదమ్ములిద్దరికి ఎలాటి అభిప్రాయభేదాలూ లేవు 'సరేనా గంటలో వెళ్ళిపోవాలి. హోటల్ భోజనం చాలా ఇబ్బందిగా ఉంది. ఒంటరిగా ఉండలేక పోతున్నాను. నువ్వొచ్చేస్తే బాగుంటుంది' ప్రార్థనా పూర్వకంగా ఉన్నా ఆ మాటలు భార్గవి నిశ్చయాన్ని మాత్రం కదల్చలేక పోయాయి—

'పెన్నినాళ్ళు చెప్పమంటారు బావా అక్కపోయిన ఈ మూడేళ్లలో మీరెన్నో సార్లు ప్రశ్న వేశారు' భార్గవికి చెప్పటం కొంచెం కష్టంగానే ఉంది.

మూర్తి ఈ సారి తేల్చుకోవాలనే వచ్చాడు. అందుకే భార్గవి సమాధానంతో అతను ఊరుకుండలేదు.

'అసలు నీ మనస్సులో ఉన్నదేమిటి భార్గవీ! చిన్ననాడు అనుకున్నట్లే జరిగి ఉంటే నువ్వే నా భార్యవి అయ్యేదానివి. పోనీ నా పిల్లలు అడ్డమా అంటే వాళ్లని ఎలాగూ నీవే పెంచుతుంటివా ఇక ఏ కారణంవల్ల ఇలా ప్రవర్తిస్తున్నావో నాకర్థం కావటంలేదు. నేను పరాయివాడిని కాదే.'


తలవంచుకొని బొటనవేలుతో నేల రాస్తూ మౌనంగానే ఉండిపోయింది భార్గవి.

'అయితే నాపిల్లల్ని నేను తీసుకు పోతాను' విసురుగా లేచాడు మూర్తి. భార్గవి పిల్లల్ని వదలి ఉండలేదని అతనికి తెలుసు. మూడేళ్లగా సాధించలేనిదాన్ని సాధించటంలో తన మాట బ్రహ్మాస్త్రంగా పని చేస్తుందని అతను భావించాడు.

అమ్మ రానంటున్నదని తమల్ని తీసుకు వెడతానని నాన్న అంటున్నాడని పిల్లలకి అర్థమైపోయింది. 'అమ్మ రాకపోతే మేం రాం' అంటూ పరుగెత్తుకు వెళ్లి భార్గవిని చుట్టుకుపోయారు.

'భార్గవి! నేనెన్నాళ్ళిలా ఉండపోలేది. నీ మూర్ఖత నా కర్థంగావటం లేదు. నాపిల్లల్ని వశపరచుకొని' మూర్తి మాటల్లోనే 'బావా!' అంటూ గర్జించింది భార్గవి.

'నిన్నిలా ఉండిపొమ్మని నేనవలేదు. హాయిగా పెళ్ళిచేసుకో. మళ్లీ నీకు ఏ ఆడదైనా ఒకటే కాని నాకు అలా కాదు. 'నేనే సర్వస్వం' అనుకునేవాడే కావాలి. ఎవరైనా ఒకటే అనుకునే నీలాంటివాడు నాకోసం ఇన్నేళ్లు ఆగని లేదు. పిల్లలు నా అక్కపిల్లలు. వాళ్ళ బాధ్యతకూడా నాకవసరం లేదు.' భార్గవి ఆవేశంతో ఆ మాటలనేసి పిల్లలిద్దర్ని చెరో రెక్క పట్టుకుని లోపలికి లాక్కెళ్ళిపోయింది. నిశ్చేష్టుడై భార్గవి వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడు మూర్తి. ●



వారఫలం

25-9-1970 శుక్రవారం మొదలు
1-10-1970 గురువారం వరకు

మేషం: ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాలలో మీ కృషి రాణిస్తుంది. రాజకీయ వ్యవహారాలలో చికాకులు ఏర్పడతాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలలో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలలో మొగమాటాలు తగవు. నూతన విషయాలను తెల్సుకొంటారు. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు:— సంతోషకరమైన వార్తలను వింటారు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మిథునం: భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. వ్యాపారంలో సాటివారి పోటీ తగ్గుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాలలో పాల్గొంటారు.

కర్కాటకం: అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. విద్యావైజ్ఞానికరంగాలలో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

సింహం: కొన్ని వ్యవహారాల్లో అనవసరమైన శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందగలదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కన్య: వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ప్రయాణాలలో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో తిరిగి అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలలో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాలలో పాల్గొంటారు.

తుల: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో మీకు ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు:— దైవకార్యాలు నెరవేరతాయి. సంతానం వలన సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు:— బంధుమిత్రులను కల్సుకొంటారు. ప్రయాణాలలో శ్రమ చేస్తారు.

ధనుస్సు: నమ్మిన వారివల్ల ఇబ్బందులకు గురి కాగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలలో నష్టం వస్తుంది. వారం మధ్యలో వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. సంతోషకరమైన వార్తలను వింటారు.

మకరం: ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరగలదు. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. వ్యాపారంలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో వృత్తిలో అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కుంభం: వృత్తిలో సాటివారి పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులు కలుగుతాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

మీనం: వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సాటివారితో పోటాపోటీంపులు తగవు.

—మహేష్



కొత్త సినిమాలు
ప్రధానాయకురాలు
పచ్చని సంసారం
అదే. విటూనండీ. ఇంటిల్లి
పాదికీ ఒక్కమారే కామెర్ల వ్యాధి
తగులుకుంది డాక్టరూ!
ఇక అత్తయ్యగారికీ నాతో మధ్య
ఏ గొడవా వుండదు!
కోడలు దిద్దిన కాపురం
"మాయని మమత"
నీకొంచెం సిగ్గయినా లేదరా?
నిన్ననేగా నిన్ను వదిలిపెట్టాం!
బాలరాజు కథ
పూజకొద్దీ పురుషుడు
(లేక) "ఇద్దరమ్మాయిలు"



ఆచరణలో అభ్యుదయం

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

కల్యాణి ఆఫీసులో కొత్తగా చేరింది. అక్కడ పని చేస్తున్న వారందరిలోనూ మురళిపై ఆమెకి సదభిప్రాయం ఏర్పడింది. ఆ సదభిప్రాయమే ఆమెని అతనికి సన్నిహితురాలిగా చేసింది. క్రమంగా తోటివారి విసుర్లు ఆరంభమయ్యాయి. ఒకరోజు కల్యాణి తన పుట్టు పూర్వోత్తరాలని మురళికి చెప్పుకున్నది. మురళి పూర్తిగా వినకుండానే ఆమెనుంచి సెలవు తీసుకున్నాడు. కల్యాణి మనసు పరిపరివిధాల పోయింది. ఆమె వేశ్యజాతిలో పుట్టడమే అందుకు కారణం. తను ఎంత నీతిగా బతుకుతున్నా ఈ సమస్య వెన్నాడుతూనే వుంది. మురళి కల్యాణిని పెళ్ళి చేసుకోడానికి సిద్ధమయ్యాడు. చివరికి కల్యాణి, మురళి ఒక్కటి అవడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. కల్యాణి ఉద్యోగం మానేసింది. మురళికి చెల్లెలు వైదేహి రాసిన వుత్తరంలో వెనకటి జ్ఞాపకాలు కలవరపెడుతూంటాయి.

10

మురళీ బి. ఎల్. చదువుతూండగా ఓ సారి శెలవులకి వచ్చినప్పుడు ఓ మధ్యాహ్నం అతనూ తల్లీ భోజనం చేస్తున్నారు. శివరామయ్యగారు అంతకు ముందే భోజనంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయారు.

కబుర్లు చెప్తూ ఆ కబురు ఈ కబురూ చెప్పుకుంటూండగా రమణమ్మగారు హఠాత్తుగా గుర్తు వచ్చినట్లు అంది 'శర్మగారి అబ్బాయి సంగతి చెప్పానురా నీకు?'

'ఊహూ — లేదే! ఏమయిందసలు ?' అన్నాడు మురళీ.

'ఇంకా ఏం కావాలి? అబ్బాయి తనతో చదువుకుంటున్న ఓ క్రిష్టియన్ల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడట.'

'నిజమా ?'

'అబద్ధం అయితే బాగనే వుండిపోను — ఆ తల్లిదండ్రుల ప్రాణాలు ఎలా కొట్టుకుపోతాయో, వాళ్ళేమయిపోతారో అన్న జ్ఞానం ఆ పిల్లాడికి కాస్తయినా వుందం లేదా — పాతికేళ్ళు పెంచి పెద్ద వాణ్ణిచేసి ఉన్నదంతా ఊడ్చిపెట్టి వాణ్ణి డాక్టరీ చదివించారే, ఇంటికి పెద్దకొడుకు కష్టానికీ, సుఖానికీ ఆదుకుంటాడు, మిగతా పిల్లల బాధ్యత అంతా మోసుకుంటాడు అని వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు కదా, ఆ అబ్బాయి చెయ్యాల్సిన పనేనా ఇది — ఏం చదువులో ఏం గోలో. పిల్లలు కళ్ళముందునుంచి దూరం అయారంటేనే భయం పట్టుకునేలా తయారయింది లోకం...ప్చ్...ఆ అవమానాన్ని దుఃఖాన్ని దిగమింగలేక, ఊళ్ళో ఎవ్వరికీ మొహం చూపించలేక ఆ శర్మగారూ భార్యా మంచంపట్టారు.' అంది రమణమ్మగారు ఆ కష్టమేదో తమకే వచ్చినంత దిగులుగా.

'ఆ పెళ్ళేదో జరిగిపోయాక వీళ్ళెంత బాధపడినా లాభంలేదు కదమ్మా — అయినా ఇప్పుడు మాత్రం ఆ అబ్బాయి డబ్బు అదీ ఏమీ ఇవ్వడని ఎందుకనుకోవాలి వీళ్ళు — భార్యా భర్త ఇద్దరూ డాక్టర్లు. హాయిగా సంపాదిస్తారు. హాయిగా తమ్ముళ్ళని చదివిస్తారు, చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చేస్తారు...'

'చాల్లే నిర్వాకం.' అంటూ కొడుకు మాటలని మధ్యలోనే తుంచేసిందావిడ. 'వెధవ డబ్బుకోసమా ఇప్పుడు వీళ్ళ ఏడుపంతాను? కుటుంబం పరువూ ప్రతిష్ఠ గంగలో కలిశాక ఇంక వాళ్ళు ఎంత డబ్బు ఇస్తే మాత్రం అవి తిరిగి వస్తాయా? పెళ్ళికెదిగిన ఆడపిల్లలు ముగ్గురున్నారు. అన్నగారు ఇలాంటి పనిచేశాడని తెలిశాక అయిన కుటుంబాల వాళ్ళెవరైనా ఆ పిల్లల్ని చేసుకుంటారా — డబ్బు లేక

పోయినా — ఒకప్పుడు ఎంతో పరువుగా, గర్వంగా తల ఎత్తుకుని తిరిగిన కుటుంబం ఇప్పుడు వెలి వేయబడినట్లు అయిపోయింది— తల్లి తండ్రులని సుఖ పెట్టాల్సిందిపోయి వాళ్ల కిలాంటి రంపపు కోత కలిగించే పిల్లలు పుట్టి ఏం లాభం?'

'ఆ— ఏదో నాలుగురోజులు నలుగురూ కాస్త కొత్తగా చెప్పుకుంటారు. ఆ తరువాత వాళ్లే మరిచి పోతారు— ఇంకా ఈ కాలంలో కూడ వెలిగిలీ ఏమిటి.' అంటూ తల్లిమాటల నన్నింటినీ తేలిగ్గా ఎగర గొట్టేశాడు మురళీ మజ్జిగా అన్నం తింటూ.


రమణమ్మగారు అయోమయంగాకొడుకు ముఖంలోకి చూస్తూంటే పక పకా నవ్వేస్తూ కంచంలో చెయ్యి కడుక్కొని లేచి వెళ్లిపోయాడు మురళీ...

ఆదంతా ఒక్కసారి కళ్లకి కట్టి నట్లుగా అయింది మురళీకి. తల్లి అంతర్యం అభిమానం గుర్తువచ్చి అతని కళ్లు చెమర్చాయి. మునివేళ్లతో కను కొసలని అద్దేసుకుని మళ్ళీ వుత్తరంలోకి దృష్టి మళ్లించాడు.

'అన్నయ్యా. అమ్మ అదంతా చెప్పి వాడికి అప్పటినుంచీ ఇలాంటి ఆలోచనలు వున్నాయేమో, నా బుర్ర అంతదూరం ఆలోచించలేదు— అయినా ఆ మాయదారి ప్లీడరీ చదువుకి ఆడపిల్లలు ఎవ్వరు ఎగబడ లేదేమో మరి— సరే, నాగుండెల మీద కుంపటిలా కూర్చోటానికి వాడితో కలిసి చదువుకున్నపిల్లే కావాలన్న మాటే ముంది. వాడితో కలిసి వుద్యోగం చేస్తున్నది దొరికింది — అసలు నా ప్రారబ్ధం కాకపోతే, నేనే వాడ్ని అంత దూరం వుద్యోగానికి పంపించాను. నాన్న గారు చెప్పిన చదువు చదివించినా, నాన్నగారు చెయ్యమన్న వుద్యోగం చేసినా వాడుకళ్ల ముందే వుండేవాడు, ఈ ఘోరం జరగకపోను అని బాధపడుతో వుంటుంది...'

మరొక్కసారి వుత్తరంలోంచి దృష్టి మళ్లించి దూరంగా ఎటో చూస్తూ గతం నెమరువేసుకో సాగాడు.

మురళీది చిన్నప్పటినుంచీ, చాలా చురుకైన స్వభావం, చదువులో మంచి



తెలివి తేటలూ—వాటికి తోడు ఒక్క క్షణం అయినా వృధాగా కాలక్షేపం చెయ్యకుండా శ్రద్ధగా చదివేవాడు. అన్ని క్లాసుల్లో ఫస్టుగా ప్యాసయ్యాడు, బియ్యేలో కూడ క్లాసు వస్తుందనీ ఎమ్మే చదవాలనీ అనుకున్నాడు. కాని బియ్యే ఆఖరి సంవత్సరం చదువుతూండగా అతనికి చాలా జబ్బు చేసింది. రెండు నెలలపాటు అసలు కాలేజీకే వెళ్ళలేకపోయాడు—ఆ తరువాత కొద్దిరోజులకే పబ్లిక్ పరీక్షలు కావటం చదువుకోటానికి వ్యవధి లేకపోవటం ఒక్కటే కాకుండా కాస్త శ్రమపడి చదవటానికి ఒంట్లో శక్తి లేకపోవటం వల్ల ఏదో బొటాబొటీ మార్కులతో ప్యాసయ్యాడు. ఫస్టుక్లాసు వస్తే ఆసంగతి వేరు కానీ ఈ మాత్రంగా ప్యాసయిందానికి ఇంకా ఇది చదువుతాను అక్కడికి వెళ్తాను అని తండ్రిని ఇబ్బంది పెట్టటం అతనికి ఇష్టం లేకపోయింది, అందుకే, ఇంక చదువు మానేస్తాను, ఉద్యోగం చూసుకుంటాను అన్నాడు మురళీ.

'అనుకోగానే వుద్యోగాలు మాత్రం దొరికిపోతాయా? అయినా ఈ ఒక్క డిగ్రీయే కాకుండా ఏ ట్రైనింగో అయితే నాకు తెలుసున్నవాళ్ళతో చెప్పి మేష్టరు వుద్యోగం అయినా వేయిస్తాను—ఉద్యోగ ప్రయత్నంలో కాలయాపన చేస్తూ వూరికే ఇంట్లోవుండే బదులు ఈ లోగా ఆ చదువయినా పూర్తి చేస్తే బాగుం


ఆచరణలో ...

టుంది.' అన్నారు శివరామయ్యగారు.

ఆయన సలహా వింటూనే గయ్యిమని లేచింది రమణమ్మగారు 'బ్రతకలేక బడి పంతులు అన్నట్లు ఇంత లోకంలో ఇన్ని వుద్యోగాలుండగా వాడు చెయ్యటానికి ఆ మేష్టరు గిరీ తప్పితే మరేమీ కనిపించలేదా ఏమిటీ మీకు? — అయినా వాడికీ మన ఆనవాయితీయే రావాలా ఏమిటి? ఇప్పటికి పాతికేళ్ళనుంచి చేస్తున్నారు మీరీ మేష్టరు వుద్యోగం — మీ సంపాదనలో ఒక్కదమ్మిడీ ఆదా చేసుకోగలిగామా? మామగారి పుణ్యమా అని ఈ మాత్రం ఆస్తి ఇచ్చి పోబట్టి ఈ మాత్రంగానయినా బ్రతకగలుగుతున్నాం కాని, లేకపోతే మనస్థితి ఎంత అధ్వాన్నంగా వుండేదో చెప్పక్కర్లేదు—మన ఖర్చులూ పిల్లల కార్యాలూ కధలూ అన్నీ అయేసరికి ఈ కాస్త ఆస్తీ ఇంకా మిగిలివుంటుందని నాకేం నమ్మకంలేదు—మరి కాస్త మంచివుద్యోగం వచ్చే చదువయినా చెప్పించకపోతే ఎలా?' అంది ఆవిడ భర్త ఆలోచనని ఎంతమాత్రమూ ఆమోదించకుండా.

'అయితే మరి ఏం చెయ్యమని నీ వుద్దేశ్యం' అన్నారాయన.

'హాయిగా ప్లీడరీ చదివించండి.' అంది ఆ హాయిగా అన్నమాటని ఎంతో అప్యాయంగా ఒత్తి పలుకుతూ.



ఆవిడ అంత పట్టుదలగా ఆ చదువే ఎందుకు కోరుకుందో శివరామయ్యగారికి మురళీకి కూడ అర్థం అయిపోయింది. రమణమ్మగారి పెద్దతల్లి కూతురు కమలాక్షి, మేనమామ కూతురు వర్ధని కూడ ఇంచుమించు ఆమె ఈడువాళ్ళే—వాళ్ళ ముగ్గురి పెళ్ళిళ్ళు కూడ కొద్ది నెలల తేడాతో ఒక్క సంవత్సరంలోనే జరిగాయి—ఎవరి కాపురాలు వాళ్ళు చేసుకుంటూ ఆ తాపత్రయంలో పడిపోవటంతో ఇంక తరుచు కలుసుకోవటంకాని వుత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోటం కాని జరగలేదు.

ఆ మధ్య ఒక బంధువుల ఇంట పెళ్ళిలో వాళ్ళు ముగ్గురూ మళ్ళీ చాలా కాలం తరువాత కలుసుకున్నారు.

కమలాక్షి భర్త పెళ్ళినాటికే 'లా' ప్యాసయ్యాడు. వెనక చిల్లి కానీ ఆస్తి లేదని గునుస్తూనే అప్పుడు ఆ సంబంధం చేశారు. కాని ఇప్పుడు వాళ్ళ పరిస్థితి వోహో లక్షలమీద వుంది. ప్లీడరుగా రెండు చేతులా ఆర్జిస్తూ మేడలూ, పొలాలూ అన్నీ కొన్నాడతను—

ఇక వర్ధనమ్మ భర్త కూడ ప్లీడరీయే చదివాడు. అయినా అతనికి ప్రాక్టీసు చెయ్యటం ఇష్టంలేక వో కంపెనీలో చేరాడు. ఇప్పుడు దానికి వో బ్రాంచి మేనేజరుట. నెలకి మూడువేలు జీతం, వుండటానికి పెద్ద బంగళా—తిరగటానికి విమానంలాంటి కారు అన్నీ వున్నాయి—


కమలాక్షి, వర్ధనమ్మల వంటి మీద వున్న నగలూ, ఆ పెళ్ళిలో వాళ్ళు కట్టిన పట్టుచీరలూ అన్నీ చూస్తూంటే రమణమ్మగారి కళ్ళు చెదిరిపోయాయి. అక్కడినుంచి వచ్చీరాగానే ఆవిడ ఎంతో వుత్సాహంగా వాళ్ళఖబుర్లన్నీ చెప్తూంటే 'ఇంతకీ మీ అమ్మకి నా చదువు, ఉద్యోగం నచ్చినట్లు లేవు.' అన్నాడు శివరామయ్యగారు వేళాకోళంగా, కొడుకుతో.'

'నేనేం అలా అనలేదు' అని మొహం ముడుచుకుంది రమణమ్మగారప్పుడు — ఇప్పుడు అవకాశం వచ్చింది కాబట్టి ఆవిడ తన అయిష్టాన్ని నిస్సంకోచంగ బయట పెట్టటానికి ఆవిడ జంకలేదు — వాళ్ళు ఇద్దరూ చదివిన చదువు చదివి తన కొడుకుకూడ వాళ్ళలా ఆర్జించుకోవాలని



ప్రజల అభిమాన పాత్రము

లిప్టన్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్



ఎందుచేతననగా, లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ సామాన్యమైన టీ కాదు. ప్రపంచ ప్రజలందరినీ మురిపించే సలక్షణాలు యిందులో పుష్కలంగా వున్నాయి.

సరియైన చిక్కదనం. బ్రహ్మాండమైన రుచితో కూడిన మేలైన పానీయం. అంతేకాదు. ప్రతి పొట్లమునుంచి ఎన్నో కప్పుల టీ లభిస్తుంది. సేవించుటకు, యిచ్చుటకు కూడా చాలా సంతోషదాయకము.

అందుకే ప్రజల అభిమానము పొందినది. లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ.

లిప్టన్స్ అంటే మంచి టీ

(HGC-9-TEA)

ఆవిడ కోరిక?

'సరే నువ్వేమంటావు?' అన్నట్లు చూశారు శివరామయ్యగారు కొడుకువంక.

నిజం చెప్పాలంటే మురళీకి కూడ టీచర్‌గ వెళ్లటం ఇష్టంలేదు. 'స్కూల్లో వున్నంతసేపూ గొంతుచించుకుని పాఠాలు చెప్పాలి. ఇంట్లో వున్నంతసేపూ కళ్లు పీక్కుపోయేలా కాంపోజిషన్ పుస్తకాలు దిద్దాలి.' అనుకుంటూండేవాడు అతనెపుడూ.

అయినా ఏదో తన మట్టుక్కు తను చదివి మంచి మార్కులతో ప్యాసవగలడే కాని తనకి తెలిసింది ఇంకొకరికి అర్థం అయ్యేలా చెప్పటం అతనికి చేతకాదు. ఎప్పుడైనా చిన్నచెల్లి కుసుమా, తమ్ముడు శేషూ ఏవైనా చెప్పమని అడిగితే మొదటిసారి శాంతంగానే గబగబ చెప్పేసేవాడు. అది అర్థంకాక వాళ్లు బిక్కమొహం వేస్తే రెండోసారి కాస్త చిరాగ్గ మళ్లీ అదేవిధంగా చెప్పేసేవాడు. అతని ధోరణి వాళ్లకి అర్థం అయేది కాదు. ఇంక దాంతో వళ్లుతెలియని కోపం, చిరాకు వచ్చి, 'ఛ, మడ్డిమొహాలు, మీ బుర్రకేదీ ఓ అంతట ఎక్కదు—మీకు చెప్పటం నా తరంకాదు— నాన్నగారి దగ్గరికి పొండి,' అంటూ వాళ్లమీదపడి చావగొట్టేటంత హంగామా చేసేవాడు.

అలాంటిది తను మేష్టరయి నలభైమంది పిల్లలున్న క్లాసులో నిలబడి

ఆచరణలో ...

అందరికీ అర్థం అయేలా చదువు చెప్పటమే! 'అమ్మ బాబోయ్ నా వల్ల కాదు' అనుకుని,

'బి. ఎల్.' కే వెళ్తాను అన్నాడు తండ్రితో, ఎమ్మెల్లో సీటు ఎలగూ దొరకదనిపించి.


'సరే' అన్నారాయన.

ఆ చదువూ పూర్తయింది — ఓ దిట్టమైన ప్లీడర్ని చూసుకుని అతనిదగ్గర జూనియరుగా చేరదామని అతను అనుకుంటూండగానే పేపరులో ఓ కంపెనీ తాలూకు ప్రకటన పడింది— మురళీ ఆ వుద్యోగానికి అప్లయి చేశాడు. రెండు వారాలు గడిచేసరికి ఇంటర్వ్యూకి కార్డు వచ్చింది. మురళీ హైదరాబాదు వెళ్లి వచ్చాడు. అంతే, మళ్లీ రెండువారాలు తిరిగేసరికి అప్పాయింట్‌మెంటు ఆర్డరు చేతికి వచ్చింది. అతని వుద్యోగం హైదరాబాదు బ్రాంచిలోనే... అదీ అతని తల్లి అస్తమానూ తలుచుకునే సందర్భం. అదంతా ఓసారి గుర్తుచేసుకుని మళ్లీ వుత్తరంలోకి చూపులు మళ్లించాడు కణతలు ఒత్తుకుంటూ...

'కాని, అన్నయ్యా — ఉద్యోగాలకోసం ఏంతమంది ఎంతెంత దూరాలకి వెళ్లిపోవటం లేదు? అందరూ ఇలాగే చేస్తున్నారా? అయినా తన కళ్లముందు వుంటే తన కొడుకు తనకి కాకుండా పోయేవాడు కాదని అమ్మ బాధపడుతుంది...నిన్ను కని పాతికేళ్లు పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకన్న నిన్నమొన్న పరిచయం అయిన ఆ కళ్యాణి ఎక్కువయిపోయిందా? వాడికి తనముందు మేమెవరం కనిపించకుండానే పోయామా అనుకుంటూ అమ్మ ఒక్కటే ఇదయిపోతోంది — సరే నాన్నగారి సంగతి నీకు తెలిసిందే కదా. అవసరం మేరకు ఒకటి రెండు మాటలు మాట్లాడటమేకాని తీరుబడిగా ఇంట్లో వాళ్లతో ఖబుర్లేసుకు కూర్చోటం ఆయన కెప్పుడూ అలవాటు లేదు. అసలే మితభాషి అయిన ఆయన ఇప్పుడు పూర్తిగా మాటా పలుకూ త్యజించినవారిలా మౌనంగా కాలం గడిపేస్తూంటే అసలు ఆయన్ని పలకరించటానికి కూడ మాకెవరికీ ధైర్యం చాలటం లేదు—

అన్నట్లు అన్నయ్యా, నీకు తెలియదు కదూ? నీకు మేనల్లుడు పుట్టాడు. మూడేళ్ళకిందట పాప పుట్టినప్పుడు నువ్వు ఎన్ని బహుమతులు పంపించావో ఎంతహడావిడి చేశావో నాకిప్పటికీ గుర్తు వుంది. కాని ఇప్పుడు బాబు పుట్టేవేళ్టికి మనం ఎవరికి ఎవరు అన్నట్లు అయిపోయాం...నాకు మొగపిల్లవాడు పుడితే ఎంతగానో వేడుకలు చెయ్యాలని ఇటు అమ్మా వాళ్లూ అటు మా అత్తగారూ వాళ్లూ తెగ మురిసిపోయారు — కాని తీరా వాడు పుట్టేవేళ్టికి మాత్రం మనస్సులో వుత్సాహం సరదా అనేది లేకుండా పోయింది. సరే, విధిలేక అన్నట్లు మొన్ననే మూడోనెల రాగానే బాలసారె జరిపించారు. అప్పుడు వచ్చిన మీ బావా మా అత్తగారు మామగారు అమ్మా వాళ్లని ఎన్నెన్ని సూటిపోటీ మాటలన్నారో వాళ్లకి నీమీదెంత దురభిప్రాయం వుందో నువ్వు వూహించలేవు—అదంతా ఇప్పుడెందుకులే—వారం రోజుల్లో నేనూ పిల్లలూ మా వూరు వెళ్లిపోతున్నాం.

'నువ్వు వుంటే కాస్త సందడిగా వుంది. ఇంక ఇల్లు మరీ బావురుమంటూ వుంటుంది.' అని కుసుమా శేషూ ఒకటే దిగులుపడి పోతున్నారు. అయితే మాత్రం నేను ఎన్నాళ్ళు వుండగలను. ఉండి చేయగలిగేది మాత్రం ఏముంది? ఎప్పటి



కైగానో అమ్మా నాన్నగారూ మళ్ళీ మామూలు మనుష్యులవుతారా ఈ ఇల్లు మునుపటిలా కళకళలాడుతూ వుంటుందా అనిపిస్తుంది నాకు... ఈ వయస్సులో అమ్మావాళ్ళు మనశ్శాంతికి దూరం అయి, నలుగురి నోళ్ళల్లోనూ పడేలా నువ్వెందుకు చేశావు అని తలుచుకుంటున్నప్పుడల్లా మా మనస్సులు ఏమిటో గిలగిల్లాడి పోతాయి... నువ్వు మా అందరిలోకి పెద్దవాడివి. నువ్వు చేసిన పనిలోని తప్పొఒప్పుని గురించి ఇంతకన్న విమర్శించేటంత శక్తి నాకు లేదు ... ఏమిటో, మనస్సు వుండబట్టక ఈ వుత్తరం వ్రాశాను—

వైదేహి.'

కాఫీ కలిపి పట్టుకు వచ్చిన కళ్యాణి, చేతిలో కాగితాలు పట్టుకుని ఎటో చూస్తూ కూర్చున్న మురళిని చూసి తెల్లబోయింది.

అడగకూడదనుకుంటూనే, 'ఎక్కడ్నించి వుత్తరం?' అంది.

మాట్లాడకుండా కాగితాలు ఆమె చేతిలో పెట్టాడు. అదంతా గబగబ చదువుకుని, 'నిజమే మరి—వాళ్ళు బాధ పడటంలోనూ; కోపగించుకోటంలోనూ వింత ఏమీ లేదు ... నాకు ఒకటి అనిపిస్తోంది,' అంటూ ఆగిపోయింది చెప్పనా మాననా అని సంశయిస్తున్నట్లు.

'ఏమిటది?'

'వాళ్ళు పెద్దవాళ్ళు—కోపంలో రెండు మాటలన్నా మనం ఏమీ బాధపడకూడదు—ఒక్కసారి వెళ్ళి వాళ్ళ కంటికి కనిపించి వస్తే బాగుంటుంది — ఇద్దరం కాకపోతే మీరు ఒక్కరైనా వెళ్ళి రండి...' అంది నచ్చ చెప్తున్న ధోరణిలో.

'లాభం లేదు కళ్యాణి— మా నాన్న గారి సంగతి నీకు తెలియదు — ఆయనకి సాధారణంగా కోపం రానే రాదు, ఆ వచ్చినప్పుడు మాత్రం వజ్రం కంటె కఠినంగా మారిపోతుంది ఆయన మనస్సు— ఆయన కోపం చల్లారేదాకా నేను వెళ్ళినా ఏమీ ప్రయోజనం వుండదు. అసలు ఆ కోపం తగ్గటం వాళ్ళు నన్ను మళ్ళీ ఆదరించటం అనేది ఈ జన్మలో జరుగుతుందో లేదో నాకు అనుమానమే,' కళ్ళ మీద చెయ్యి ఆనించుకుని కూర్చుని తనలో తను అనుకుంటున్నట్లుగానూ కళ్యాణికి

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాత ప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగు మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు 100 ఆరశావు పేజీల పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయమై ఎటువంటి బాధ్యతని స్వీకరించలేము ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు

సంపాదకుడు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చెప్తున్నట్లుగానూ అతను అంటూ వుంటే అపరాధిలా తలవాల్చుకుని ఒక్క క్షణం నిలబడి ఆ తరువాత లోపలికి వెళ్ళిపోయింది.

రాత్రి భోజనం వేళకూడ ఎలాగో తన భర్తతో మరోసారి ఏదో చెప్పబోయింది కాని ఆమె చెప్పబోయేది వూహించిన మురళీయే ముందుగా అన్నాడు.

'నేను చేసిన పనిలో తప్పు ఏమీ లేదు అని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నప్పుడు ఇంకొకరి ముందు, వాళ్ళు ఎంత దగ్గరవారయినా సరే, తల వంచాల్సిన అవసరం బ్రతిమాలుకోవలసిన అక్కర నాకేం లేదు... పెద్దవాళ్ళు వాళ్ళకే అంత పట్టుదల వున్నప్పుడు నాకు మాత్రం పౌరుషం వుండదా?'

కళ్యాణి మరి మాట్లాడలేక పోయింది.

ఆ రాత్రి ఎలాగో గడిచి తెల్లవారింది.

మురళీ బింకం, నిశ్చయం సడలి పోయింది. ఈ ఒక్క అవకాశం చూస్తాను అనుకుని కార్డు కలం తీసుకున్నాడు. వైదేహి సత్రం అందినట్లు వ్రాస్తే అది మళ్ళీ అక్కడ ఏ రాద్ధాంతాలకి దారి ఇస్తుందో అని తనంత తనే వ్రాస్తున్నట్లు నాలుగు వాక్యాలు వ్రాసి పోస్టు చేశాడు.

*   *

కాస్త తీరిక దొరికి, సందర్భం వచ్చినప్పుడల్లా తన చిన్ననాటి కబుర్లు చెప్పటం మురళీకి ఒక సరదా. అందు లోనే అతనికి ఏదో తృప్తి ఆనందం లభిస్తుండేది — ఎంతో ఆసక్తిగా వింటుంది కళ్యాణి ఆ కబుర్లన్నింటినీ— మురళీ చెప్తూంటే విని, ఊహించుకుని, ఆ కుటుంబంలోని వ్యక్తులు ఒకరి పట్ల ఒకరు చూపించుకునే ఆదరణా ఆత్మీయతా తలచుకుంటూంటే కళ్యాణి కళ్ళు ఆనందాతిరేకంతో చెమ్మగిల్లుతాయి మొన్న మొన్నటిదాకా మురళీ వాళ్ళందరి అభిమానాన్ని పంచుకుని వాళ్ళల్లో ఒకడుగా బ్రతికాడు. కాని ఇవాళ వాళ్ళంతా అతన్ని ఎవరో పరాయివాడుగా తనతో ఏమీ సంబంధంలేనివాడుగా చూస్తున్నారు.

అయినా మురళీ అదేం లెక్క చెయ్యటం లేదు — తన ఒక్కదానికోసం వాళ్ళందరినీ వదులుకున్నాడు. అదే భావంతో ఆమె మనసూ ఎలాగో అయిపోయేది. మళ్ళీ అంతలోనే అనిపించేది 'వాళ్ళు అందరూ పంచి ఇవ్వగలిగే ప్రేమని వారు నా ఒక్క దానివల్ల పొంది ఆ లోటుని మరిచిపోవాలి. అందుకే నేను ప్రయత్నిస్తాను — కాని నా ధ్యేయం కోరిక ఒక్కటే — వాళ్ళు మమ్మల్ని ఆదరించి దగ్గర జేర్చుకోవాలి. నన్ను ఆ యింటి కోడలిగా అభిమానించాలి — ఎంతకాలం గడిచినా సరే నేను నిరాశచెందకుండా ఆరోజుకోసం నిరీక్షిస్తుంటాను.' అనుకునేది.

ఓ రాత్రి భోజనాల సమయంలో మురళీకి తన చిన్ననాటి స్నేహితుడు మోహన్ జ్ఞాపకం వచ్చాడు. 'మా మోహన్' అంటూ ఏదో చెప్పబోయి మళ్ళీ గొంతు ఎవరో నొక్కేసినట్లే ఆగిపోయాడు—

సాంబారులో నల్లపాయలు గరిటతో వెతికితీసి భర్తకి వడ్డించే పనిలో మునిగి పోయివున్న కళ్యాణి అది గమనించలేదు కాని కాస్సేపటి తరువాత అతని మొహం వంక చూస్తూ 'అలావున్నారేం' అని అడిగింది.

'మంచి ప్రశ్నే వేశావు?' అని నవ్వేసి భోజనం ముగించి చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడే కాని అతని ఆలోచనల చుట్టూ మోహన్ తిరుగుతూనే వున్నాడు.

మోహన్ తండ్రి లక్ష్మీపతి నిజంగా కూడా లక్ష్మీపతే. తాత తండ్రులనాటి ఆస్తికి ఏకైక వారసుడతను. కొంత మంది డబ్బుగలవాళ్ళ పిల్లల్లాగే అతని క్కూడా అంతగా చదువు అంటలేదు— భుక్తికోసం రెక్కలు అమ్ముకోవలసిన వాళ్ళకయితే చదువులు, డిగ్రీలు, అర్హతలూ ఎలా వున్నా ఏదో ఓ వుద్యోగం కోసం తాపత్రయ పడేవారు కాని లక్ష్మీపతికి ఆ అవసరం కూడ లేదు — స్నేహితులూ, సినిమాలూ, షికార్లూ, సిగరెట్లూ ఈ కాలక్షేపంతోనే అతని చిన్నతనం అంతా గడిచిపోయింది— పెళ్ళయి భార్య కాపురానికి వచ్చాక కూడా అతని అలవాట్లలోనూ సరదాలలోనూ ఏమీ మార్పు రాలేదు.

'నాకు తెలుసమ్మా— అబ్బాయి ప్రవ

ర్తన నీకు బాధగానే వుంటుంది. అయినా కొన్నాళ్ళపాటు ఇదంతా సహించాలి నువ్వు. నీ మంచితనంతోనూ, ఓర్పుతోనూ క్రమంగా వాడిలో మార్పును నువ్వే తీసుకురావాలి' అంటూ అత్తగారు తాయారుదగ్గర కళ్ళంట నీళ్ళు పెట్టుకుంటూంటే,

'వారు నన్ను ఎంతో అభిమానంగా చూసుకుంటున్నారత్తయ్యా — ఇంక యే సరదాలూ స్నేహితులూ లేకుండా ఇరవై నాలుగ్గంటలూ నాతోడిదే లోకంగా గడపాలని నేను మాత్రం ఎలా అనుకుంటాను? ఈ ఇంట్లో నాకే కొరతా లేదు. నన్ను గురించి మీరు దిగులు పడకండి' అంటూ అత్తగారికే ధైర్యం చెప్పేది కోడలు.

ఆ మాటల్లో నిజం లేకపోలేదు— పెళ్ళి అయిన కొత్తలో బయట యెలా వున్నా ఇంట్లో వున్న కాస్సేపూ భార్యతో సరదాగా సంతోషంగా కాలం గడిపేవాడు లక్ష్మీపతి— కాలం గడుస్తున్నకొద్దీ స్నేహాలూ కాలక్షేపాలు మితి మీరటం, ఇంట్లో భార్య అంటే నిర్లక్ష్యం అధికం కావటం ప్రారంభమయింది — అనురాగాలూ, అభిమానాలూ కొరవడినా పదేళ్ళు గడిచేసరికి ఆరుగురు బిడ్డల తల్లి మాత్రం అయింది తాయారు — ఆ సంవత్సరమే లక్ష్మీపతి తల్లీ తండ్రీ చనిపోయారు. ఆస్తి అంతా పూర్తిగా అతని స్వాధీనంలోకి వచ్చేసింది — ఇంక అతనికి అడ్డేముంది? నెలలు నిండి వున్న భార్యని, అయిదుగురు పిల్లల్ని వదిలేసి ఏ రెండు మూడు వేలో పట్టుకుని ఏ మద్రాసో, బెంగుళూరో వెళ్ళాడంటే పది రోజులు తిరిగేసరికి వట్టి చేతులతో తిరిగి వచ్చేవాడు.

'ఈ సమయంలో ఇలా రోజుల తరబడి వూళ్ళోకూడా లేకుండా వెళ్ళిపోతే ఎలా... పసిపిల్లలతో ఆడదాన్ని ఒక్కర్తినే వుండాలి...ఏ సమయంలో ఎలాంటి అవసరం వస్తుందో...' అని చెప్తున్న భార్య మాటలని పూర్తిగా వినకుండానే,

'పురిటిరోజులు దగ్గరకు వస్తున్నాయని విస్తే—మీ అమ్మని పిలుచుకో సాయంగా వుంటుంది—ఇంక మంత్రసాని. నర్సులూ, డాక్టరూ, ఆసుపత్రి వుండనే వున్నాయి. నేను లేకపోతేమాత్రం భయం ఏమిటి' అని సమాధానం చెప్పాడు.

అన్నంతపనీ చేశాడుకూడ. ఆరో బిడ్డ పుట్టేనాటికి అతను వూళ్ళోనే లేడు. ఇంటిలో విషయాలన్నీ తాయారు తల్లి చూసుకుంటే, మంత్రసానికి కబురు పంపటానికి దానికి ఇరుగుపొరుగూ ఆదుకున్నారు.

పురుడు వచ్చిన నాలుగోనాడు మధ్యాహ్నం వూడిపడ్డాడు లక్ష్మీపతి — అల్లుడ్ని చూస్తూంటే అరికాలిమంట నెత్తికెక్కుతున్నా, కూతురు అదివరకే పదేపదే చెప్పి బ్రతిమాలుకోటంవల్ల అల్లుడి ప్రవర్తనని పట్టించుకోనట్లే వుండిపోయింది తాయారు తల్లి— ఈ ఖబురూ ఆ ఖబురూ చెప్తూ సాయంకాలం దాకా ఇంట్లోనే వున్నాడు లక్ష్మీపతి—సాయంకాలం స్నానంచేసి, తెల్లటి గ్లాస్కో పంచా, లాల్చీ వేసుకుని, జేబునిండా ఇన్ని రూపాయల నోట్లు కుక్కుకుని, చేతితో సిగరెట్టు టిన్ను విలాసంగా పట్టుకుని చెప్పులేసుకుని వీధిలోకి వెళ్ళినతను భోజనాలవేళ దాటిపోయినా తిరిగి రాలేదు.

'ఏమిటమ్మా ఈ వరస' అంటున్న తల్లితో,


'ఏ క్లబ్బులోనో, ఏ స్నేహితుడి ఇంటిలోనో పేకాట పెట్టుకూర్చున్నారేమో. ఇంక ఆ ఆటలోపడితే [illegible] వుండదు. ఆయనకిది అలవాటేగా — పిల్లలకి పెట్టేసి, నువ్వూ అన్నం తినేసి పడుకోండి—ఆయన వచ్చినప్పుడు తలుపు తియ్యొచ్చు' అంది తాయారు లోపల బాధ పడుతూనే.

అతను రాలేదు. రాత్రి గడిచిపోయింది 'ఇంకనైనా ఇతనికి ఇల్లు జ్ఞాపకం వస్తే బాగుండును' అనుకుంటున్న ముసలావిడికి ఇరుగు పొరుగూ వార్త పట్టుకొచ్చారు.

నిన్న పూరినుంచి వస్తూ వస్తూ వో భోగం దాన్ని వెంట పెట్టుకు వచ్చాడట. అసలు ఇదంతా ముందే ప్లాను చేసుకుని వున్నాడేమో—ఊరికి వెళ్ళేముందే ఆ సూరయ్య కొత్త డాబా అద్దెకు తీసుకున్నాడట—రాగానే దాన్ని అందులో దింపాడట—నిన్ననే చూచాయగా ఒకరిద్దరికి తెలిసినా అందులో నిజం ఎంతో అబద్ధం ఎంతో అన్నట్లు వూరుకున్నారు. తెల్లవారింది — ఊళ్ళో ఎవరి నోట విన్నా ఇదే మాట—'ఇంట్లో మహాలక్ష్మి లాంటి పెళ్ళాన్ని పెట్టుకుని...అయ్యో, ఇదేం విడ్డూరం,' అంటూ ముక్కుమీద వేలు వేసుకున్నారు.

కొయ్యబారి పోయినట్లే కాస్సేపు నిలబడి పోయిన ఆవిడ తరువాత ఎలాగో వాళ్ళని సాగనంపి, కూతురు గదిలోకి వచ్చి భోరుమంది—సంగతంతా చెప్పి,

'ఎవరికి ఎంతకి తెగించాడో చూశావా ... అసలా మహమ్మారి ఎన్నాళ్ళయి ఇతన్ని పట్టుకుందో చివరికి ఇవాళ వచ్చి ఇంటిమీదే తిష్ట వేసింది— నువ్వు ఎలా భరిస్తావే ఈ గుండెల మీద కుంపటిని... డబ్బు వుంది, ఆస్తి వుంది, ఎంతో సుఖపడతావు అంటూ మురిసిపోతూ ఈ సంబంధం చేశాను— చివరికి నిన్ని గతికి తీసుకొచ్చాడా—' అంటూ



ఆచరణలో...

ఆవిడ పైకి రాగాలు తీస్తూంటే, కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని లోలోపల కుమిలి పోయింది తాయారు. పిల్లలు బిక్క మొగాలు వేసుకుని నిలబడ్డారు— సరిగ్గా అలాంటి సమయంలోనే లక్ష్మీపతి లోపలికి వచ్చాడు ఆ గదిలో దృశ్యం చూస్తూండగానే అతనికి అంతా అర్థం అయిపోయింది.

అల్లుణ్ణి చూడగానే ఆవిడ పసివాళ్ళని తీసుకుని బయటికి వచ్చేసింది కళ్ళూ ముక్కూ తుడుచుకుంటూ.

'ఏమండీ మేము విన్నది నిజమేనా,' అంది తాయారు. లక్ష్మీపతి సంగతి తెలిసి వున్న వూరి వాళ్ళు చిలవలూ పలవలూ కల్పించి అలా చెప్పి వుంటా రని. అది ఉత్త గాలికబురని ఏదో ఆశలాంటిది ఆమె గుండెల్లో మెసులు లాడుతోంది.

'అసలు మీరేం విన్నారు?' అని అడగ లేదు లక్ష్మీపతి. అక్కడవున్న కుర్చీలో తాపీగా కూర్చుంటూ,

'ఔను, నిజమే,' అన్నాడు;

'ఈ మనిషికి కట్టుకున్న పెళ్ళాం, కన్నబిడ్డలూ అనే అభిమానం, మమకారం లేనే లేవా—పదిమందీ నవ్విపోతారనే సిగ్గూ బిడియాలయినా లేవా.' అనుకుంది తాయారు.

'మీరు ఇన్నాళ్ళా నాలుగు రోజుల కోసారి పట్నం వెళుతున్నాను, అంటూ ప్రయాణం అయినా, అక్కడ కాలం ఎలా గడిపినా, కొన్నాళ్ళకి కాకపోతే కొన్నాళ్ళకయినా మారి తీరతారు అనే ఆశ వుండేది నాకు...ఇంక ఇప్పుడు నేనూ పిల్లలూ...'

'లక్షణంగా వుంటారు.' మధ్యలోనే అందుకుని సమాధానం చెప్పాడు

'మరో మనిషిని తీసుకొచ్చి నా కళ్ళ ఎదుటే పెట్టటం మీకేమయినా ధర్మం అనిపిస్తోందా,' ఎంత అణుచుకున్నా అణగనికోపం అసహ్యం తాయారు మాటల్లో వ్యక్తం అయాయి

'రత్నాన్ని మనయింటికే తీసుకొచ్చి, నిన్ను తనకి వండిపెట్టమని, మర్యాదలు చెయ్యమని నేనేం అనలేదుగా — తను ఈ వూళ్ళోనే వుండటానికి వీలులేదు అనటానికి నీకేదో అధికారం వుందను కోకు—నీ హద్దులలో నువ్వుంటే నీకూ పిల్లలకీ ఏ లోటూ రానివ్వను,' అనేసి తనగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ అవకాశంకోసమే ఎదురు చూస్తున్న దానిలా ముసలావిడ మళ్ళీ లోపలికివచ్చి,

'ఏమన్నాడే తల్లీ పోనీ ఇంత డబ్బు ఇచ్చి దాన్ని ఎక్కడికయినా పంపించేయ మనక పోయావా.' అంది—తాయారు అలా అడ్డంగా వూపేస్తూ తనకీ భర్తకీ మధ్య జరిగిన సంభాషణంతా పూసగుచ్చినట్లు చెప్పింది—అమ్మమ్మ వెంటే గదిలోకివచ్చిన పెద్ద మనవడు పదేళ్ళ మోహన్‌కి పరిస్థితి సరిగ్గా అర్థం కాకపోయినా, నాన్న ఎవరినో తీసుకొచ్చారని అమ్మ అందు కోసమే ఇంతగా ఏడుస్తోందని అనిపించింది;

'ఆ రాక్షసిని, నేను కత్తిపెట్టి చంపి పారేస్తాను?' అన్నాడు కసిగా పిడికిళ్ళు బిగించి.

'దాన్ని చంపటం మాట దేవుడెరుగు... మీరయినా మీ అమ్మని కాస్త అభిమానంగా చూసుకోండి—అది ఇంక మీ కోసమే ప్రాణాలతో బ్రతికి వుంటుంది' అంది ముసలావిడ మోహన్‌ని దగ్గరకు తీసుకుని, కళ్ళు ఒత్తుకుంటూ.

తరువాత రెండునెలలు వుండి ఆవిడ వూరికి వెళ్ళిపోయింది—

ఇంట్లో తాయారూ, పిల్లలూ మిగిలారు—లక్ష్మీపతి ఇష్టం అయినప్పుడు ఇంటికి వస్తాడు లేనినాడు ఆ రత్నం అదే రాజరత్నం ఇంట్లోనే వుండి పోతాడు—బుద్ధి కుదిరితే భార్యచేతి వంట తిని వెళ్తాడు లేకపోతే స్నానం భోజనం అన్నీ దాని యింట్లోనే—


అదివరకులా తరుచు వూరి ప్రయాణాలు పెట్టుకోటంలేదు, కాగా బొత్తిగా తీరిక అన్నది లేనట్లు, ఏదో భారమైన పని నెత్తిమీద పెట్టుకున్నట్లు హడావిడి పడిపోతున్నాడు. అతని ఈ హడావిడి అంతా ఏమిటో, డబ్బు మంచినీళ్ళ ప్రాయంగ ఎలా ఖర్చయిపోతోందో తాయారుకి తెలియలేదు మొదట—

ఓ రోజు, 'నాన్నగారు ఇంకో కొత్త మేడ కట్టిస్తున్నారుటమ్మా—మా స్కూల్లో పిల్లలు చెప్పారు.' అని మోహన్ అనేసరికి తాయారుకి అంతా అర్థం అయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'అలాగా బాబూ, సరే నువ్వెళ్ళి ఆడుకో' అంటూ వాడ్ని పంపించేసింది.

చూస్తూండగానే రెండంతస్థులమేడ తయారయి పోయింది.—ఆ సెలవులలోనే లక్ష్మీపతి రాజరత్నాన్ని తీసుకుని ఊటీ వెళ్ళివచ్చాడు.

ఇంత బాహాటంగా, విచ్చలవిడిగా జరుగుతున్న అతని చర్యలన్నీ ఎవరో ఒకరి ద్వారా తాయారుకి పిల్లలకి అందుతూంటేవి. వాళ్ళు అమాయకంగా తల్లితో మళ్ళీ అదేవిషయం మాట్లాడబోయేసరికి తాయారు ఏదో మిషమీద వాళ్ళని అవతలకి పంపేసి తను గుండెలు పగిలేలా ఏడ్చేది చాటుగా.

(ఇంకా వుంది)



సింగపూర్‌లో హిప్పీలపై నిషేధం!

సింగపూర్‌లో హిప్పీలకు మనుగడ కష్టతరమైపోతున్నది. అక్కడ వారికి అవాంఛనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ హిప్పీలంటే ఎవరో, ఏమిటో అధికార పూర్వకంగా వ్యక్తపరచలేక పోతున్నారు. కాని, ఎయిర్‌పోర్టు దగ్గరా, సీ పోర్టు దగ్గరా, జోహార్‌కాజువే(సింగపూర్., మలేసియాలను కలిపే ద్వీపం) వద్దా; పొడుగాటి జుట్టు, గెడ్డాలు, టైట్‌పాంటు, లాల్చీలు వేసుకున్నవాళ్లని నగరంలోకి ప్రవేశించనివ్వవద్దని పోలీసులు, కస్టవ్స్ అధికారులు హెచ్చరించబడ్డారు.

కొద్దికాలం కిందట 60 మంది యూరోపియన్స్, అమెరికన్స్ హిప్పీలుగా పోలీసులచేత ముద్ర వేయబడ్డారు. నిజానికి వారు దౌర్బల్యంచేత చవుకబారు నివాసగృహాల్లో వుంటున్నారనీ, అక్కడ వడుపువృత్తి సర్వసాధారణం అనీ విశ్వసించబడుతున్నది.

సింగపూర్‌లో సాంప్రదాయసిద్ధం కాని నీతిని యీ హిప్పీలు ప్రవేశపెడుతున్నారని అధికారవర్గం భయపడుతున్నది. మందులు తీసుకోవటంలాంటి చర్యలవల్లనూ, సమాజం అనుమతించని వారి ప్రవర్తన, దుస్తులవల్లనూ గట్టిగా అనుమానించబడుతున్నారు. వీళ్లవల్ల యూరప్ అమెరికాలనుంచి అనునిత్యం వచ్చే యాత్రికులకు సింగపూర్ పట్లగల చక్కని అభిప్రాయం తొలగిపోతున్నది; వెలివేయబడినవాళ్లకు సింగపూర్ ఆటపట్టుగా వుంటున్నదనే భావం వారిలో పొడుకొంటున్నది.

ఇటీవల జుట్టు బాగా పెంచుకున్న ఇద్దరు అమెరికన్ విద్యార్థులకి జోహార్ కాజువే దగ్గర — సింగపూర్‌లో ప్రవేశించటానికి అనుమతి నిరాకరించబడింది. వాళ్ళు గెడ్డాలు, క్రాపులు చక్కగా చేయించుకున్న తర్వాతగానీ లోపలకు ప్రవేశించే అనుమతి లభించలేదు. అదేవిధంగా గెడ్డాలున్న కెనడాకి చెందిన ఒక పోస్టు గ్రాడ్యుయేట్ ఏకనమిస్టూ, మరొక బ్రిటిష్ ఎలక్ట్రానిక్ ఇంజనీరూ సింగపూర్‌లోకి వెళ్లడం ఎంతో కష్టమైపోయింది.

పేద ప్రజానీకం ఉండే చవుకబారు స్థలాల్లో ఉంటూ; చవుకగా లభించే తిండిని తింటూ ప్రయాణాల్లో ఖర్చుల కోసం డబ్బు మిగుల్చుకుంటూ వుంటారు, యీ హిప్పీలు. సమాజం అంగీకరించే ప్రవర్తన అలవరచుకోవటం, చక్కని దుస్తులు ధరించటం, క్రాపులు, గెడ్డాలు చేయించుకోవటం జరిగితేనే కాని సింగపూర్‌లో ప్రవేశార్హత లభించదని యిపుడు వాళ్ళు గుర్తిస్తారు.


సాంఘిక నీతిని అతిక్రమించి నడిచే వాళ్ళను అమెరికాలో 'హిప్పీలు'గా పిలుస్తారని చెప్పబడుతున్నది.

సమాజ ధిక్కార ప్రవర్తన వల్లనే వాళ్లను సింగపూర్ వ్యతిరేకిస్తున్నది. చట్టానికి లోబడని ఆ ప్రవర్తన ద్వారా వారు పెక్కు అభ్యంతరాలను కలిగి వున్నారని కూడా నొక్కి చెబుతున్నారు. కొందరు ఆడ హిప్పీలు— (వారికీ, వారి కూడా ఉండేవారికీ భోజన తదితర సదుపాయాలను సమకూర్చుకోవటం కోసం డబ్బు కావాలి గనుక) వడుపువృత్తిలో మునిగి తేలుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

హిప్పీల అనుచిత ప్రవర్తనను గురించిన ఫిర్యాదులు అతిశయోక్తిగా ఉండవచ్చును. కాని, యీ హిప్పీలలో కొందరికి — శిఖ్ఖుల దేవాలయంలో భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటుచేస్తే; వాళ్లు ఆ ఆదరణను, ఆ ఆవరణను తాగటానికీ, గంజాయిదమ్ము కొటడానికీ, శారీరక సంబంధాలను కలిగివుండటానికీ ఉపయోగించుకోనారంభించారు. ధర్మచింతన కలిగిన శిఖ్ఖులు యీ విషయాలను తెలుసుకుని కోపోద్రిక్తులై — వాళ్ల దేవాలయాల నుంచి హిప్పీలను వెళగొట్టారు.

సింగపూర్‌లో నిషేధం వున్న కారణంగా 500 మంది హిప్పీలు మలేసియాలో ఆగిపోవలసి వచ్చింది. తమమీద మోపబడిన అభియోగాలను చాలామంది హిప్పీలు నిరాకరించారు. వారి తరపున వాదించేందుకు కొందరు తలలు దూర్చారు కూడా. నిషేధం మీద ఒక హిప్పీ వ్యాఖ్యానిస్తూ 'కస్టవ్స్ అధికారుల్ని సంతృప్తిపరచటం కోసం జుట్టు తగ్గించుకోకపోతే నేనూ అధోగతిపాలు కావలసి ఉంటుంది' అన్నాడు.

(పో. వ. పీ) ●





యంగ్ బ్లడ్

కొల్లూరి సూర్యకుమారి

'విమ్మీ...విమ్మీ... ఇంకా లేవలేదూ? అప్పుడే ఏడవుతోంది' అంటూ వచ్చింది వదిన సరోజ.

'అబ్బ ఏమిటి నీ గొడవ కాస్సేపు పడుకోనీ' అంటూ గోడవైపు తిరిగి పడుకుంది విమల.

'విమ్మీ అప్పుడే కలలు కంటున్నావా?' అంది సరోజ ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతూ.

'ఊఁ' అని విదిలించుకుంది వదిన చేతిని.

'విమ్మీ! ఇంకా ఏమిటి పడక' అంటూ నారాయణ వచ్చాడు హడావిడిగా. 'సరూ, వెళ్ళి మా అమ్మక్కాస్త హెల్పు చెయ్యి. అదే లేస్తుందిలే' అన్నాడు కొంచెం చిరాగ్గా.

'అత్తయ్య లేపి రమ్మన్నారు' అని చెప్పుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

వాళ్ళ సంభాషణ వింటూనే ఉన్న విమల గబగబా లేచింది నిద్ర బద్ధకం వదిలించుకుని. చెల్లెల్నేమీ అనలేక భార్య మీదే చిరాకు ప్రదర్శిస్తాడు, నారాయణ. విమలకూ తెలుసు అన్నయ్య సంగతి. సరోజమీద అనవసరంగ చిరాకు పడితే విమలకి జాలేస్తుంది. సరోజకూడా చదువుకున్నదైనా ఎదురు మాట్లాడదు.

నారాయణ తన గదిలో డ్రెస్ చేసుకుంటున్నాడు. సరోజ భర్తక్కావలసిన వస్తువు లందిస్తూ అక్కడే ఉంది. బాత్‌రూంలో ఉన్న విమలకు అన్నా వదినల సంభాషణ విన్పిస్తోంది.

'అమ్మాయిని చూడకుండా కట్నం గురించే ముందు మాట్లాడ్డమేమిటండీ. అంటే వాళ్ళకి కట్నమే ముఖ్యమన్న మాట.'

'అదే మంచిదిలే. అమ్మాయిని చూసుకుని వెళ్ళి, తర్వాత అమ్మాయి నచ్చినా కట్నం నచ్చక వదిలెయ్యడంకంటె'

'కట్నం కోసం చూసే వాళ్ళదగ్గర అమ్మాయేం సుఖపడుతుంది?'

'వాళ్ళడిగింది ఇవ్వగలం మనం. అమ్మాయిని చూపిస్తే వాళ్ళు నచ్చలేదంటే ఇంకో సంబంధం వెతకడం... అలాకంటే ఇదే బాగుంది.' అన్నాడు నారాయణ అద్దం బల్ల ముందు కూర్చుంటూ. 'మనం వాళ్ళడిగినంత ఇవ్వగలంకదా! అతను మెరైన్ ఇంజనీరు. మన విమల నచ్చితే అది చాలా అదృష్టవంతురాలు.'

'డబ్బు నచ్చిందిగా మొదట, విమలకేం లోటు నచ్చక పోవడానికి. అందం వుంది. చదువుంది. విమలకే అతడు నచ్చాలి.' అంది గర్వంగా.

'వదినా నీదే కరెక్ట్.' అంది వాళ్ళకి వినిపించేలా, తన గదిలోనుండే.

ఇద్దరూ తడబడ్డారు. విమల వచ్చింది నారాయణ గదిలోకి.

'సారీ, మీ మాటలు నేను వినలేదు. విన్పించాయి విన్నాను.' అంది సంజాయిషీగా నవ్వుతూ.

'భలేదానివే విమ్మీ. రహస్యమేం కాదులే.' అన్నాడు నారాయణ.

'పెద్ద ఆఫీసర్ట. నిన్ను చూసుకోడానికి...'

'విన్నాలే. అంతటి ఆఫీసరు రావడం అదృష్టం కదూ.' అంది విమల, సంగనాచిలా.

'నిజంగా ఇదేకాని కుదిరితే అది మన అదృష్టం...'

'ఏమిటన్నయ్యా అదృష్టం డబ్బు ఇచ్చుకుని కొనుక్కునేటప్పుడు అదృష్టమేమిటి? మనకు స్తోమతుంది. అంతే గాని...'

'అదికాదు విమ్మీ...'

'ఏదికాదు. నాన్న రెక్కల కష్టంవల్ల నిన్నూ నన్నూ చదివించేరు. కొంత వెనకేసేరు. ఆయన కష్టార్జితమే కదా! సరే ఎవరి వాళ్ళకు వారు పెడతారు. పోషిస్తారు. వదినకు రవ్వల దుద్దులు చేయించావంటే అది అదృష్టమా! డబ్బిచ్చావు. చేయించావు. గాడ్రేజ బీరువా కొన్నావు. అది అదృష్టమా! ఈ ఇల్లు కొన్నారు నాన్న. దీన్ని అదృష్టమనరు. కృషికి ఫలితం దక్కిందనాలి. అదృష్టమంటే లాటరీలో గెలుపు రావడం. ఐశ్వర్యవంతుడు ఒక బీదపిల్లను ఆదర్శంగా పెళ్ళి చేసుకుంటే అది ఆమె అదృష్టం. అంతేకాని డబ్బిచ్చి కొనుక్కుంటూన్నప్పుడు ఇంక అదృష్టమేమిటి? ఎవరిస్తోమతనుబట్టి వాళ్ళు కొనుక్కుంటారు.'

'మరీ అంత కఠినంగా అవకూడదు విమ్మీ: కట్నం అనేది వరదక్షిణ.'

'నీ కోసం ఇస్తున్నామే తప్ప ఎవరికో ఇవ్వడం లేదుగా. నాన్న నీ కోసమనే ఇన్సూరు చేసేరు. నీ డబ్బు నీ కివ్వడంలో ...' భార్యను సమర్థించేడు నారాయణ.

'నాకు ఇస్తున్నారా? ఐతే నాపేర బేంకులో వేస్తున్నారా? నాకు తెలుసు. వాళ్ళ చేతికివ్వాలి. ఇవ్వకపోతే పీటలమీద పెళ్ళి ఆగిపోతుంది.'

'అంతవరకూ వస్తుందా ఏమిటి? ఇచ్చేవాళ్ళం పుచ్చుకునే వాళ్ళం చూసుకుంటాం. నీకెందుకు మధ్య. అయినా ఇంకా అబ్బాయిని చూడలేదు. ఎందుకీ వాదన' అంటూ బయటికి వెళ్ళిపోయాడు నారాయణ.

'అవును మరి. తనూ మగవాడేగా. తన మామగారు అప్పుచేసి తెచ్చిన కట్నమైనా పుచ్చుకున్నాడు హాయిగా. డబ్బు కిబ్బందిపడినా కట్నం వసూలు చేసుకుని మరీ పెళ్ళి చేసుకున్నాడు.'

అంది నారాయణ వెళ్ళినవైపే చూస్తూ. విమల కళ్ళలో నీళ్ళు తిరిగాయి అప్పుడే. ముఖం ఎర్రబడింది.

పీడించి పిండి మరీ వసూలు చేస్తారు. మగవారిదెంత కర్కశమైన మనస్సు! ఆడపిల్లని ఎంతో అపురూపంగా, ముద్దుగా చూసుకుంటారు తల్లిదండ్రులు. కాని ఆ పిల్లవల్ల ఏం సుఖపడుతున్నారు? అబ్బాయితో సమంగా చదువు చెప్పించి దానికి నాలుగింతలు కట్నాలు పొయ్యలేక మానలేక ఆడపిల్లవల్ల మానసికంగా వ్యథ చెంది అప్పుల పాలవుతున్నారు.

'విమ్మీ! నువ్వనుకున్నట్టు మీ అన్నయ్య కట్నం తీసుకోవడం నిజమే. అదేనా మీ అమ్మగారి తృప్తికోసం కాని ఆ సొమ్ము మీ అన్నయ్య వుంచుకోలేదు. మా చెల్లి పెళ్లికోసం వద్దంటున్నా మా నాన్నగారి కిచ్చేశారు. ఆడపిల్ల సొమ్ము అందులో వాళ్ళిచ్చినదే తిరిగి తీసుకోనంటే అది మా గిరిజకు బహుమతిగా ఇస్తున్నానని చెప్పి ఇచ్చేసారు మీ అన్నయ్య.'

'నిజమా వదినా: నిజంగానా? తెలియక అన్నయ్యను అపార్థం చేసుకున్నాను. అన్నయ్యలాంటి వాళ్ళు మాటకొకరున్నా

తాడపిల్ల శేరంతో సంతోషించాలి.'

సరోజ కూడా మౌనంగా కూర్చుండి పోయింది కొద్దిసేపు.

'సరళా...విమ్మీ... ఏం చేస్తున్నార్రా' అంటూ వంట గదిలోంచి వచ్చారు మహాలక్ష్మమ్మగారు.

'ఈ చదువుకున్న పిల్లల్తో వచ్చిన గొడవే ఇది. ఒక్కర్తీ పనంతా...' అని ఆవిడలో ఆవిడే గొణుక్కుంటూ వచ్చారు.

'వస్తున్నానత్తయ్యా' అంటూ ఖంగారుగా లేచింది. మంచంమీద కూర్చున్న దల్లా పడుక్కుంది, విమల.

'విమలకి తలనొప్పిగా వుందంటేనూ...' అని అబద్ధం ఆడేసింది సరళ.

'తలనొప్పా' అంటూ దగ్గర కొచ్చారు. కళ్లెర్రగా వున్నాయి. 'ఏం పిల్లల్రా' అంటూ మెడమీదా మదురుమీదా చెయ్యి పెట్టి చూసారు జ్వరం తగిలిందేమోనని ఆత్రుతగా.

'సావిడిమట్టుకు కాస్త దులిపించమ్మా సరోజా. నాకింకా వంటింట్లో చాలా పనుంది. వాళ్లివాళే వస్తామని రాసారు. ఏ రెండ్రోజులు ముందు తెలిసినా సావకాశంగా అన్నీ చూసుకోవచ్చు.' అంటూ ఆవిడ వెళ్లారు.

'నేను చేయిస్తాలెండత్తయ్యా' అంటూ సరోజకూడా వెళ్లింది.

హాలులో షైనింగు పోయిన బ్రాస్ యాష్ట్రేలూ, బల్లలమీదున్న వెండిబ్రిగ పోలూ మొదలైనవన్నీ శుభ్రం చేస్తోంది తను హాలు దులపమని పురమాయించి.

గడియారం ఠంగు ఠంగుమంటూ రెండు గంటలు కొట్టింది. మంచం మీద దొర్లుతున్న విమల లేచి ముఖం కడుక్కొచ్చి కూర్చుంది ఆలోచిస్తూ.

'విమ్మీ. లేచి తెములు. జడ వెయ్యమంటావా?' అంటూ వచ్చారు మహాలక్ష్మమ్మగారు.

'ఎందుకమ్మా? ఎక్కడికెళ్లాలిప్పుడు?' అంది—కారణం తెలిసినా, తల్లి నోటి ద్వారానే వినాలని.

'ఎందుకేమిటే పిచ్చి తల్లీ. నిన్ను చూడ్డానికి వాళ్లొస్తున్నారు నిన్ను ఒకింటిదాన్ని చేసేస్తే ఇంక మా బాధ్యత తీరుతుంది. నేనూ మీ నాన్నగారూ నిశ్చింతగా వుంటాం కృష్ణా రామా అనుకుంటూ.' అన్నారు కూతురి బుగ్గలు నిమిరి గోముగా.

'ఏమిటో నీ పిచ్చి.' అంది తల్లివేపు జాలిగా చూస్తూ.

'నీకేం తెలుస్తుందే తల్లీ నా బాధ. నువ్వూ హాయిగా కాపురం చేసుకుంటుంటే నీ మానాన్న నువ్వు......' ఇంక మాట పెగిలి రాలేదు. ఆ తల్లి కళ్లు చెమ్మగిల్లాయి.

'ఏమిటమ్మా! నేను పెళ్లి చేసుకుని వెళ్లకుండానే ఇంత బాధ పడుతున్నావు. నిజంగా వెళ్తే...'

'ఇది బాధ కాదమ్మా. ఆనందం... ఆనందం అంటే ఇదేనమ్మా.' అంటూ కొంగుతో కళ్లొత్తుకున్నారు. 'ఈ పట్టు చీర కట్టుకో. నీక్కావలసిన నగలు తీసి పెట్టుకో. ఇవిగో తాళాలు. లే.' అని తాళాలు చేతికిచ్చారామె.

మూడు గంటలవుతోంది మధ్యాహ్నం. సావిట్లో హడావిడిగా వుంది. పెళ్లివారి కోసం పరంధామయ్యగారూ మహాలక్ష్మమ్మగారూ అన్ని ఏర్పాట్లూ చేసి వారి కోసం వేచి వున్నారు. సరోజ తన పని పూర్తి చేసుకుని విమల గదిలోకి వచ్చింది.

గులాబిరంగు రుబీ వాయిల్ చీర కట్టుకుని హకోబా జాకెట్ వేసుకుంది. అతి సాధారణంగా వుంది. తన అందమే తనకు పెట్టని ఆభరణాలు.

'అన్నేర్పాట్లూ అయ్యాయి. ఇంక అబ్బాయీ అమ్మాయీ చూసుకోవడమే తరువాయి.' అంటూ విమల దగ్గరగా వచ్చింది.

'తీరుబడైందా? వదిన గార్కి.' అంది వేళాకోళంగా చిరుకోపంతో.

'ఊఁ. తమరి ముస్తాబింతేనా?' అంది ఎగాదిగా చూస్తూ.

'లేకపోతే గంగిరెద్దులా తయారవ్వాలా? ఆ వచ్చిన వాడు ముందరే పరిగెడ్తాడు.'

'అయితే ముందు జాగ్రత్త పడ్డావన్న మాట.' ఇద్దరూ నవ్వుకున్నారు.

'ఇదేమిటే ఈ చీర? నిక్షేపంలా పట్టు చీర్లుండగా.' అటుగా వచ్చిన తల్లి కూతుర్ని చూస్తూ విస్తుబోయారు.

'పెద్ద ఆఫీసర్ కదమ్మా ఆ వచ్చే అతను. పట్టుచీరలూ నగలూ అవి వోల్డ్ ఫేషను. బాగుండదులే. విమ్మికి తెలుసమ్మా. అందుకే...' అప్పుడే అక్కడికి వచ్చిన నారాయణ సమాధానమిచ్చాడు.

మోహనరావుతో కూడా ఇంకొక పెద్ద మనిషి వచ్చాడు. హడావిడి పడినంతసేపు పట్టలేదు వాళ్లు వచ్చి వెళ్లేసరికి.

విమల మనస్సులో ఆలోచనలు చెలరేగేయి. మల్లెపందిరి క్రింద పచార్లు చెయ్యసాగింది. నారాయణ చెల్లెల్ని వెతుక్కుంటూ వచ్చాడక్కడకు.

'విమ్మీ!'

'ఊఁ' అంది వెనక్కి తిరిగి. సాయంత్రం అలా పచార్లు చెయ్యడం తనకు అలవాటు.

'మోహనరావెలా వున్నాడు? నీకు నచ్చాడా విమ్మీ?' అన్నాడు.

'అందానికేం లోటు లేనట్టుందిలే' అంది కాస్సేపాగి వెటకారంగా.

'సీరియస్‌గా అడుగుతున్నాను చెప్పు విమ్మీ.'

'అన్నయ్యా! పేపర్లో హెడ్ లైన్సు చూసినంత మాత్రాన అసలు న్యూసు తెలుస్తుందా? అలాగే మనిషి పేరూ—ఉద్యోగం తెలిసినంత మాత్రాన అతని మనస్తత్వం తెలియకుండా ఎలా చెప్తాను? అందమైన వస్తువును కాని మనిషిని కాని చూస్తే మర్చంట్ ఆఫ్ వెనిస్‌లోని బెస్సేనియో, గోల్డ్ కేస్కెట్ గుర్తొస్తాయి' అంటూ నవ్వింది.

'అవన్నీ తెలుసుకోకుండానే మాట్లాడతామా మేం?'

'అది కాదన్నయ్యా. స్వయంగా మాట్లాడనిదే ఏం చెప్పను? అయినా అతనికి నచ్చాలిగా.' అని తన అభిప్రాయం తెలియజేసింది.

'నిజమే. ఇది మాడర్న్ ఫేషన్. నేనింకా పాతకాలంలోనే...'

'అది కాదన్నయ్యా.'

'తెలిసిందమ్మా నీ ఉద్దేశం. ఆ ఏర్పాటు నేను చేస్తాలే.' అని అక్కణ్ణుండి నిష్క్రమించాడు నారాయణ.

* * *

సాయంత్రం నాలుగయింది. పార్కంతా నిశ్శబ్దంగానే వుందింకా. ఎవరో ఇద్దరు ముగ్గురు తప్ప ఆ పార్కులో

వివ్వరూ లేరు. విమలా మోహన్‌రావు ఒకప్రక్క పచ్చని గడ్డిలో కూర్చున్నారు.

ఒంటరిగా కూర్చుని మగవానితో మాట్లాడ్డం వింతకాదు విమలకి. ఏ పార్కులో చూసినా స్నేహితులిలా జంటలు జంటలుగా కూర్చుంటారు పెద్ద పట్నాల్లో. వ్యక్తిగతంగా ఒకరి అభిప్రాయాలింకొకరు తెలుసుకోవడం మంచిదే. అదేం తప్పుకాదు. స్నేహితులవడానికూడా ఒకరి మనస్తత్వం ఇంకొకరు తెలుసుకుంటే ఆ స్నేహం దృఢం కాగలదు.

'వ్యక్తిగతంగా మాట్లాడాలని ...' విమల తన మాటలింకా పూర్తి చెయ్యలేదు. మోహన్ అందుకున్నాడు.

'ఐ ఎగ్రీ విత్‌యూ. మనిషి ముఖంలో మనస్తత్వం గ్రహించడం కంటే మనస్సు విప్పి మాట్లాడుకుంటే ఒకర్నొకరికి బాగా తెలుస్తుంది.' ఆ మాటతీరు ఎంతో ఇంపుగానూ ఆకర్షణీయంగానూ వుంది. ఇంగ్లీషులో మాట్లాడే విధానం అతి సహజంగా వుంది. విమలతో ప్రత్యేకంగా ఏమీ మాట్లాడలేదతను.

'అయితే నా గురించి మీరేం తెలుసుకోనక్కర్లేదా!' అంది అతడి మౌనాన్ని చూసి.

'మనిషిని చూసి మనస్తత్వాన్ని గ్రహించగలను కొంతవరకు.' అని చెప్పసాగాడు. 'ఎవరైనా సరే ఏ విషయమైనా సరే విస్సంకోచంగా అడిగేస్తారనుకుంటా మీరు. ఎదుటివారి మనస్సు నొప్పించాలని కాకపోయినా మీ ఉద్దేశం మీరు బయటపెట్టగల ధైర్యంవుంది. అవునా! మీ పద్ధతి బాగుంది ఇట్స్ రియల్లీ వెరీ గుడ్.' అన్నాడు ఆమెవైపు చూస్తూ చిరునవ్వుతో.

'ఏదైనా డెసిషన్ చెయ్యాలంటే క్రిందామీదా పడి పదిసార్లాలోచించరు. వెంటనే ఏదో ఒక నిర్ణయానికి రాగలరు.' అన్నాడు తనే మళ్ళీ. విమల ఆశ్చర్యం రెండింతలైంది.

'ఈ కాలంలో ఐర్నింగ్ ప్రోబ్లమ్ మీద మీ ఒపీనియనేమిటి?' అని అడిగింది. అలమైన కారణాన్ని మనస్సులో అణచిపెట్టి.

'బర్నింగ్ ప్రోబ్లమ్ అంటూనే ఏం చెప్పమంటారు? ఆ ప్రోబ్లమ్‌ని నిర్మూలించటానికి ప్రయత్నించాలి. కాని ఎక్కడ చూసినా స్వార్థం పెరిగిపోతూంది.' అన్నాడు అతి సామాన్యంగా.

'ఎవరికిమాత్రం లేదండీ. ప్రతీ వాళ్ళకీ స్వార్థమే. ఎక్కడ చూసినా...' 'మీకు' అని చెప్పకపోయినా ఆ అర్థం గోచరిస్తోంది తన చూపులో.

'అంటే?' ఆశ్చర్యపోయాడు. 'నేనేం వ్యాపారస్థుణ్ని కాదు ఉద్యోగరీత్యా లంచాలు లభించే అవకాశం లేదు. అన్యాయం సొమ్ముతో ఎంతకాలం బాగుపడతారు? చిన్నతనం నుండీకూడా నేను ఒకరికి సహాయ పడాలనే ప్రయత్నించే వాణ్ని. ఎన్నడూ ప్రతిఫలంకూడా ఆశించలేదు.' ఈ సారి అతడి ముఖంలో చిరునవ్వు కాదుకదా! ముఖం పాలిపోయింది. ఎవరైనా సరే 'నువ్వు చెడ్డవాడివి' అంటే ఎవరొప్పుకుంటారు? నిజంగా తప్పుచేసిన వాళ్లే ఒప్పుకోరు. అటువంటప్పుడు తప్పుచెయ్యని వాళ్ళూరుకుంటారా! అనవసరంగా నింద వేస్తే.


'సారీ. మీ గురించి నాకేం తెలియదు, మిమ్మల్ని అనాలన్న ఉద్దేశం కాదు. మీరు బాధపడుతున్నట్టున్నారు.' అని నొచ్చుకుంది.

'అదేం కాదు.' అన్నాడు తెచ్చుకున్న చిరునవ్వు తాండవం చెయ్యలేక చేస్తోంది అతడి ముఖంలో.

'ఈ ప్రపంచాన్ని చూస్తుంటే ఏమిటో చెప్పలేనిరోత. అందులో మన ఆచారాలూ సాంప్రదాయాలూ చూస్తుంటే మరింత చిరాకు వేస్తుంది. మీరే ఆలోచించండి విషయం...వధూవరులిద్దరూ ఉంటేనే కదా పెళ్లి జరుగుతుంది. అయితే వధువు తల్లిదండ్రులెందుకు కొన్నివేలు గుమ్మరించాలి కట్నంగా? శక్తికొద్దీ ఇస్తే ఫర్వాలేదు. కాని ఇంతకట్నం ఇస్తేకాని చేసుకోము అంటారే. ఇప్పుడంతా ఆ కట్నండబ్బు ముందు తీసుకుని మరీ పెళ్లి చేస్తున్నారు. అంటే వాళ్ళకు అమ్మాయి ముఖ్యం కాదన్నమాట. డబ్బే ప్రధానం. ఎన్నో చూస్తున్నాం. ఈ కట్నాలవల్ల ఎందరి భవిష్యత్తో పాడవుతోంది. తల్లితండ్రులంతా వారి పిల్లలు సుఖంగా వుండాలనే కోరుకుంటారు. శక్తికొద్దీ ఇవ్వాలనే చూస్తారు వారి పిల్లలకు, వాళ్ల సుఖ సంతోషాలకోసమే తాపత్రయ పడతారు. శక్త్యనుసారం పెట్టాలనే చూస్తారు. అలాంటప్పుడు ఎందుకీ నిర్బంధం? కట్నం ఇమ్మని.

పెద్దచదువులు చదివించాం. ఆ మాత్రం కట్నం తీసుకోకపోతే ఎలా అంటారు. అంటే కట్నం వస్తుందని చదివించారన్నమాట. అంతేకాని కొడుకు మీద ప్రేమ కాదన్నమాట అది.' ఆవేశంగా చెప్పింది విమల.

'ఇదంతా నాకు చెప్తున్నారు. అంటే నేనుకూడా ఆ కేటగిరీకి చెందుతాననే మీ ఉద్దేశ్యం కాబోలు. మాకు ఈ కట్నకానుకలతో సంబంధంలేదు. ఇష్టమైతే పెళ్లి చేసుకోవడం, లేకపోతే లేదు. అంతేకాని



ను...' అంటున్నారు శ్రీమోగా మోహన్ రావు.

'అయితే ... మీకు...తెలియదన్నమాట' ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ 'మన పెద్దవాళ్ళిదివరకే కట్నకానుకలు మాట్లాడుకున్నారు. మీ వాళ్ళడిగినంత ఇవ్వగలేస్థితిలో ఉండబట్టే...మీరూ... నేనూ ఇలా కలుసుకోగలిగాం. లేకపోతే మీరెవరో నేనెవరో. మీకు తెలుసనుకునే ఈ విషయం అడగాలనే నేను అనుకున్నాను. ఈ పద్ధతే మంచిది లెండి అమ్మాయి నచ్చినా కట్నం నచ్చక మానుకునే కంటే...' అంది హేళన ధ్వనించేటట్లు.

'ఆయామ్ వెరీసారీ, ఇలా నాకు తెలియదు. చెప్పినందుకు మీకు చాలా థాంక్స్'' అన్నాడు చిన్నబోయిన ముఖంతో కోపంగా.

'అనవసరంగా మీ మనసు గాయపరిచాను, అసలు విషయం తెలిసేసరికుంటుందని. క్షమించండి ఈ కట్నాల వల్ల ఎంతోమంది వ్యధ చెందుతుంటే చూస్తూ చేసేదేమీలేక మానలేక బాధపడుతున్నాను ఎన్ని పుస్తకాలు చదివినా ఎన్ని సినిమాలు చూసినా మనుష్యులు మాత్రం మారటంలేదు. మంచిని గ్రహించటం లేదు. ఎవరెవరికైనా ఆదర్శంగా నిలవాలని దృఢ నిశ్చయం చేసుకున్నాను. కట్నం తీసుకోని వ్యక్తినే నేను వివాహం చేసుకో

యంగ్ బ్లడ్

దల్చాను. నేనొక్కర్తినే ఆచరిస్తే ఏమిటి ప్రయోజనం? అందరూ పూనుకోవాలి. అప్పుడే ఈ సమస్యా పరిష్కారం అవుతుంది. కాని ఎవ్వరూ పూనుకోరు. అందరూ మనస్సులో అనుకునేవారే కాని ధైర్యంగా ముందుకెవ్వరూ రారు.' అంది ప్రపంచంపోకడ అవగాహన చేసుకొని.

'ఎందుకు పూనుకోరు. ఇవి పెద్దవాళ్ళేర్పరచే ఆంక్షలు అడ్డు. ఇలాంటి వాటిని మనం లెక్కచెయ్యకూడదు. ప్రజల సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. పెద్దలైనా పిన్నలైనా మంచిత్రోవలో నడవడమే శ్రేయస్కరం. ఈ విషయంలో నేను మీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. మనలాంటి వాళ్ళింకా లేకపోరు.' అన్నాడు కోపం చల్లార్చుకుని.

'మాటి కొక్కరుంటే ఏమిటి లాభం? మనుష్యులంతా మారాలి. అందరికీ ఈ చైతన్యం కల్గాలి. గురజాడవారి ధర్మమా అని కొంతవరకైనా సంఘం మారింది. మొదట్లో తిట్టుకున్నా కన్యాశుల్కంలాగే మరొక రచన వెలువడాలి. ఈ కట్నకానుకలబాధ తగ్గాలి. కూతురికి కట్నం ఇవ్వాలి అనుకుంటూనే కొడుక్కి కట్నం రాబట్టాలి అని తాపత్రయ పడతారు. ఏమిటో ఈ మనుష్యులు.' అంది విసుగుచెందిన విమల.

'పూర్తిగా వీళ్ళదే తప్పంటే అన్యాయమండి. ఇస్తున్నారు కనుక పుచ్చుకుంటున్నారు. ఇవ్వకపోతే ఏం చేస్తారు? ఇచ్చేవాళ్ళున్నంటే తీసుకునేవాళ్ళు తీసుకుంటున్నారు. ప్రతివాళ్ళు కట్నం ఇవ్వం అని పట్టుపట్టాలి. కాళ్ళ ముందు కొస్తున్న ధనాన్నెవరు కాలదన్నుకుంటారు చెప్పండి. ఈ సమస్యకు ముఖ్యకారణం ఆడపిల్లల తల్లిదండ్రులే.' అని వాదించాడు మోహన్.

నిజమే ఇస్తాం అంటే ఎవరు వద్దంటారు? ఎవరు పుచ్చుకోరు?

సాయంత్రం అవుతున్నకొద్దీ జనం అధికం కాసాగారు పార్కులో. పార్కంతా నిండుగా వుంది అక్కడక్కడ జంటలతో ఏకాంతంగానూ, పిల్లల సందడితోనూ.

'జస్ట్ వైటెమినిట్' అని విమల హడావిడిగా లేచి వెళ్ళింది నాలుగంగల్లో ఉన్న రోడ్డుదగ్గరకు. కొద్ది సెకెండ్లలో ఇంకొక అమ్మాయితో తిరిగి వచ్చింది.

'ఈమె నా ఫ్రెండ్ శ్రీలక్ష్మి ఎమ్మే' 'ఇతను మిస్టర్ మోహన్‌రావు బొంబేలో మరైన్ ఇంజనీరు' అని పరిచయం చేసింది. విమలా శ్రీలక్ష్మి న్యావిషయాలు మాట్లాడుకున్నారు దూరంగా నిల్చుని రెండు నిముషాలు. ఇద్దరూ అందంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నట్లుంది చూపరులకు

'నేను వెళ్తాను విమలా ఇప్పటికే లేటయింది. అమ్మ చూస్తూ వుంటుంది నా కోసం' అని చెప్పి ఇద్దరిదగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. ఆమె కట్టూ బొట్టే ఆమెకు ఆభరణాలూ — అలంకరణాలూ సున్నితమైన మాటతీరూ నడకతీరూ ఆమె అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి.


స్నేహితురాల్ని సాగనంపి యథాస్థానంలోకి వచ్చింది విమల. 'రఘురాం అని మద్రాసులో ఇంజనీరుగా వుంటున్నారు'

'ఆ' అన్నాడు తెలిసినట్లు.

'మీకు తెలుసా?' అంది కుతూహలంగా

'అహ ఏం చెప్తారోనని వింటున్నా..' అన్నాడు ఉత్సాహంగా.

'ఏండి మంచి స్టోరీయే' అంటూ మొదలుపెట్టింది. 'శ్రీలక్ష్మిని చూశారుగా! తనకేమిటి లోటుంది? కాని తన్ను లోటుంది లెండి. తనంత తాను



తలపోదించు కుంటోంది. అతి కాదు! కొన్నివేలు గుమ్మరించే శక్తిలేదు. రఘురాం అని చెప్పాను...అతను శ్రీలక్ష్మిని చూసుకున్నాడు తను ఎమ్మే ఫైనల్‌లో వున్నప్పుడు చదువుకున్నవాడు సంస్కారవంతుడేమో అనుకున్నాను. వెళ్లాక ఉత్తరం రాస్తాం అని వెళ్లిపోయారు వచ్చిన పెద్దమనుషులు. ఏభై వేలిస్తే పిల్లని స్తామంటున్నారు.. లోంభై వేలతో చేసుకోమంటున్నారుట' అంటూ చెప్పించారు మధ్యవర్తుల ద్వారా నిజంగా అంత డిమాండు వుంటే ఇంకా ఎందు కాలస్యం ? అంటే మీరు అంత ఇస్తారా అని ఇన్‌డైరెక్టుగా అడగటం అవి. వాళ్ళు వెళ్లిన తర్వాత ఉత్తరం లేదు. ఇంకా అతడికి పెళ్లయినట్టు లేదు. అసలు కారణం కట్నం కావాలి ఆ మాత్రం గ్రహించలేపోరు. పైగా కట్నం అక్కర్లేదు. దానిమీద ఆశ లేదు అని చెప్తుంటారు. ఏ పిల్లలు తల్లిదండ్రులు బాధపడుతుంటే సహించగలరు అందుకే శ్రీలక్ష్మి ఈ వివాహ ప్రసక్తే తలపెట్టనివ్వలేదు పోయిగా ఉద్యోగం చేస్తోంది. అసలు ఆడపిల్లలంతా కట్టు కట్టి స్ట్రైకు చెయ్యాలి' అంది కసిగా రోషంగా.

'రఘురాం మద్రాసు' అని మెదులోంది మోహన్ మదిలో. ఆలోచిస్తున్నాడు ఆ వ్యక్తిగురించి.

పార్కులో దీపాలప్పుడే వెలిగాయి నారాయణా సరోజ వస్తున్నారు

'లేస్తామా ఇంక? అన్నయ్యా వాళ్లు వస్తున్నారు.' అంటూ లేచింది. మోహన్ కూడా లేచాడు. వస్తున్న యిద్దర్నీ చూసి 'ఈడూ జోడూ బాగుంది' అనుకున్నాడు మనస్సులోనే.

'ట్రెయిన్ టైమవుతున్నట్టుంది' అన్నాడు మోహన్ తొందర చేస్తూ.

'ఆ. మీ సామానింకా తేవాలి కదూ? ఫర్వాలేదులెండి. ఇంకా టైముంది.' అంటూ టాక్సీని పిల్చాడు నారాయణ నలుగురూ ఎక్కారు. శాంతిభవన్ వద్ద ఆగి సామాను తీసుకుని స్టేషన్కు బయల్దేరారు. ట్రెయిన్ బయల్దేరడానికింకా అరగంట టైముంది. నారాయణ మోహన్‌ను ప్రక్కకు పిల్చి ఏదో చెప్తున్నాడు.

[illegible] వింటున్నాడు. మధ్యలో చిరునవ్వు వింది [illegible]న్నాడు.

సరోజ మాట్లాడుతుంటే యాంత్రికంగా వింటోంది విమల. రైలు కదిలేటప్పుడు నలుగురూ రైలు దగ్గర కొచ్చారు. ఉత్తరం వ్రాయమని పదేపదే చెప్పాడు నారాయణ. అందరికీ నమస్కారం చేసి ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులోకి వెళ్ళిపోయాడు. కను పించినంత వరకూ చెయ్యూపాడు.

* * *

మద్రాసు విమానాశ్రయానికి రఘురాం వచ్చాడు మోహనరావుని కలుసుకోడానికి. చాలారోజులకు కలుసుకున్నారేమో ఇద్దరూ సంతోషంతో ఉప్పొంగి పోయారు.

'ఏమిటింత హఠాత్తుగా వచ్చావ్. ఇంతకాలానికి జ్ఞాపకం వచ్చాననన్నమాట.' అంటూ వాపోయాడు మిత్రుడు.

'నీకు మాత్రం...' అంటూ ఇద్దరూ బయటికి నడిచారు. ప్లిమత్ కారు ఆహ్వానిస్తోంది మూగగా. ఆనందంతో అదీ పరుగు తీసింది మిత్రుల్ని ఎక్కించుకుని.

చిన్న బంగళా ముందాగింది కారు. మోడర్న్ ఫేషన్‌గావుంది ఆ కట్టడం. ఇంటిచుట్టూ తోటకూడా ఆధునికంగా పెంచబడుతోంది. ముందరి భాగంలో లాన్ అందంగా కత్తిరించబడి ఆకర్షణీయంగా వుంది. ఇంటిలోకూడా అందంగా వస్తువులన్నీ అమర్చబడి వున్నాయి.

యంగ్ బ్లడ్

ఆ అలంకరణలలో ఎంత ధనవంతులో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు పల్లెలో భూములు ఎకరాల్లా వున్నాయి రఘురాంకి. ఉద్యోగం చేస్తున్నాడని మద్రాసులో బంగళా కొన్నారు అంత అవసరం లేకపోయినా.

వంటవాడు కాఫీ ఫలహారాలు తెచ్చి పెట్టి వెళ్ళిపోయాడు.

'రఘూ ఇంకా ఎన్నాళ్ళోయ్. వంటవాడి తిండి! నాకు చెల్లెళ్ళులేని లోటు ఎంత తొందరగా తీరుస్తావా అని చూస్తుంటే...'

'ఏమిటో, వన్నంటున్నావ్ నువ్వు మహా పెద్దవాడివయి పోయినట్టు. తమరికింకా హోటలుతిండి వదలాలని లేదు కాబోలు.' అనటంతో తికమక పడ్డాడు మోహన్.

'నాకు సెటిల్ అయ్యిందిలే. అందుకే నీకు చెప్తున్నా'

'అలాగా ఇంకా చెప్పవేం. ఈ గుడ్ న్యూసు! హార్టీ కంగ్రాట్స్ మా చెల్లెలి గారిదేవూరూ ఏమిటీ అన్నీ చెప్పు.' అంటూ సోఫాలో సర్దుకుని కూర్చున్నాడు.

'ప్రస్తుతం ఢిల్లీలో వుందిలే. పి.హెచ్.డి. చేస్తూ.'

'అమ్మో! కాని మోహన్ అంత చదువుకున్నమ్మాయి...' పూర్తి చెయ్యలేకపోయి మధ్యస్తంగా వూరుకున్నాడు.

[illegible] ఉంటే ఏం. ఎవ్వరైనాసరే భార్యాభర్తలిద్దరూ ఒకరి సుఖంకోసం మరొకరు చూస్తారు. చదువుకున్నంత మాత్రాన వారికి అభిరుచులూ అభిప్రాయాలూ వుండవా ఏమిటి రఘూ...సరే నీ సంగతి చెప్పు మరి.' అంటూ సోఫాలో వెనక్కు వ్రాలాడు.

'ఏం చెయ్యను మోహన్ నాకు మాత్రం ఇలాగే వుండిపోవాలనుందా! నాకు నచ్చితే అమ్మకు నచ్చదు. అమ్మకు ఇష్టమైతే నా కిష్టంలేకుండా వుంది, ఇలావుంది వ్యవహారం.' అన్నాడు దీనంగా.

'విజయవాడలో సుబ్బారావుగారని ఒకళ్ళున్నారు నీకు తెలుసా రఘూ?'

'ఆ ఒకసారి చూసాను ఏం?'

'వాళ్ళమ్మాయిని చూసావా?'

'ఏం? నాకు పెళ్ళి సంబంధం మోసుకొచ్చావా నాయనా. చూడ్డం, వదిలెయ్యడంకూడా అయ్యాయి.' అన్నాడు నిస్పృహగా.

'ఊఁ. ఎందుకు వదిలేసారు?'

'ఏమిటో పెద్ద చదువు చదువుకున్న పిల్లట. అమ్మకు నచ్చలేదు చదువుకున్న పిల్ల అత్తగార్ని బాగా చూస్తుందో లేదోనని ఆవిడ అనుమానం. అమ్మను కష్టపెట్టలేక ఎటూ చెప్పలేక వూరుకున్నాను. ...నువ్వదృష్టవంతుడివి మోహన్ మీ యింట్లో నీ మాటను కాదనరు.'

'నాకుండవలసిన సమస్యలు నాకున్నాయి ...అయినా...'


ఇంతలో సంధ్య వచ్చింది మోహన్ మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. రఘు అక్కయ్య సంధ్య. ఆ వూళ్ళోనే వుంటున్నారు ఆమె భర్తా.

'ఎవరో అనుకున్నా. నువ్వా మోహన్! ఎప్పుడొచ్చావు?' అంది కుర్చీలో కూర్చుంటూ.

'అక్కయ్యా! మోహన్ పెళ్ళి కొడుకయ్యేడు.' అన్నాడు రఘు ఆనందావ్వాలికలోనూ. మోహన్ గుటకలు మింగడం తప్ప ఏం చెయ్యలేక పోయాడు.

'కంగ్రాట్యులేషన్స్' అంది సంతోషిస్తూ.

[illegible]



చూశావా గున్నథం! పిచ్చోడు గారికి జాలివచ్చి పదిరూపాయలిచ్చినందుకు ఎంతపనయిందో! మన దొంగ కాళ్లు గుట్టంతా బయటపడిపోయిందిగదా! ప్చ్!

టుందని అంటే రఘు నమ్మేడు. పైగా తన అక్కయ్యకు కూడా చెప్పేశాడు మోహన్ పెళ్ళని.

'రఘూ! మీ అక్కయ్యగారు గ్రాడ్యుయేట్. మీ చెల్లెలు ఎమ్. బి. చదువుతున్నారు. మన సాంప్రదాయాల ప్రకారం లేరూ వాళ్ళు? నీ భార్యమాత్రం చదువుకున్నదైతేయేం. ఏమండీ మీరు చెప్పండి' అన్నాడు అమాయకంగా మోహన్.

'ఏమిటింతకీ విషయం?' అంది ఇద్దరివైపూ చూస్తూ.

'చదువుకున్నమ్మాయిని కోడలు చేసుకోడం అమ్మకిష్టంలేనిదే ఏంచెయ్యాలి! చెప్పక్కయ్యా' అంటూ అడిగాడు.

'చదువుకున్నదైనా ఫర్వాలేదు రఘూ అమ్మకి. కాని కూతుళ్ళకి కట్నాలు ఇచ్చుకుంటున్నాం కదా కొడుక్కి రాబట్టుకోవాలని ఆవిడ ఇది. చదువు, కట్నంతో వచ్చేకోడలు కోసం చూస్తోంది అమ్మ.'

నిర్ఘాంతపోయాడు రఘు. 'అమ్మ నాతో మాటవరుసకయినా అనలేదే అలా' అన్నాడు. అమాయకం కొట్టొచ్చినట్టుంది అతడిలో. తల్లి స్వభావానికి సిగ్గుపడ్డాడు. అందులో మోహన్ముందు మరింత అవమానంగా అనిపించిందతడికి చదువుకునే రోజుల్లోకూడా ఎప్పుడూ ఆదర్శ వివాహాలే చేసుకోవాలనేవాడు. కట్నం డబ్బులంటేనే వళ్ళు మండేదతడికి. డిబేట్స్లోకూడా వాదించేవాడు దీనిగురించి. అటువంటి వాడిముందే ఇలా సంధ్య చెప్పడంతో కుంచించుకు పోయాడు.

'ఇలాంటివి మనతో చెప్పరు రఘూ అడ్డు చెప్తామని. ఆ విషయాలు పెద్దవాళ్ళే మాట్లాడేసుకుంటారు.' అనటంతో తేలికపడ్డాడు రఘు.

అరగంట కూర్చుని భర్త రావటంతో సంధ్య వెళ్ళిపోయింది. రఘు మోహన్ ఆరోజంతా అదే విషయం మాట్లాడుకున్నారు.

అసలు పెళ్ళి చేసుకునేవారికే కట్నకానుక లక్కర్లేదు. పెద్దవాళ్ళ ప్రోద్బలం, వాళ్ళ ఆశలే దీనికి మూలకారణం. లక్షలు మూల్గుతున్నా ఇంకా కావాలనే ఆశ. కొందరు యువకులు కట్నాల విషయాల్లో మాత్రం తల్లిదండ్రులమాట జవదాటరు. చదువులో టుంతలయి తల్లిదండ్రుల్ని లెక్కచెయ్యక పోయినా ఈ విషయంలో పెద్దవారితో ఏకీభవిస్తారు నిజంగా తెలివైన చదువూ సంస్కారం కల ఏ వ్యక్తీ ఈ కట్నాలకోసం ఆశించడు. ఇలాంటివి తీసుకోడానికి సిగ్గుపడ్తాడు. ఇలా తీసుకోవడం అవమానంగా భావించాలి.

'ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వకపోయినా ఫర్వాలేదు. నా సంపాదన నాకు చాలు. కట్నంకోసం నా ఆశయాన్నెంతమాత్రం చంపుకోను...నాకు నచ్చిన అమ్మాయిన్నేను కట్నంలేకుండా వివాహం చేసుకుంటాను.' అని దృఢనిశ్చయానికి వచ్చాడు రఘు. అదే అన్నాడు మోహన్తో.

ఈ కట్నాల్నీ, లంచాల్నీ పారద్రోలాలంటే యువతీ యువకులే పరిష్కారానికి పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో పెద్దలైనా (హోదాలో) తల్లిదండ్రులైనా లెక్కచెయ్యకూడదు. ఎన్ని విషయాల్లో తల్లిదండ్రుల్నెదిరించి వారికిష్టంలేని పని చెయ్యటం లేదు? వారి అనుమతి లేనిదే ఉద్యమాల్లో పాల్గొనడం లేదా? ఈ నిర్మూలనకు యువతీ యువకులే సహకరించాలి.


మనస్ఫూర్తిగా తల్చుకుంటే మానవుడు చెయ్యలేనిదేముంది. ధరలు ఆకాశాన్నంటుతుంటే కడుపునిండా ఆహారం తీసుకోటానికే అష్ట కష్టాలు పడుతున్నారు. వేసవికాలంలా వున్నాయి ధరలు. కట్నాల సమస్య రోహిణికార్తెలా మాడుతోంటే వయస్సులోవున్న మగవాళ్ళు ఈ బాధలకు తట్టుకోలేక పరిష్కార మార్గం కనిపెట్టలేక తల వంచుకుంటున్నారు.

కూతురికి కట్నం ఇచ్చి కొడుక్కి కట్నం తీసుకుని పెళ్ళిళ్ళు జరిపించేస్తున్నారు. ఒకరి దగ్గర్నుండి పుచ్చుకోవడ మెందుకు? ఇంకొకరి కివ్వడం యెందుకు? ఇచ్చుకోకుండా పుచ్చుకోకుండా వుంటే ఈ సమస్యే వుండదుగా!

ఈ సమస్యా పరిష్కారానికి ముఖ్య పాత్రెవరు వహించాలి? యంగ్ బ్లడ్ తల్చుకోవాలే కాని చెయ్యలేని దేముంది? ఎందుకు చెయ్యలేరు!

రఘుకి శ్రీలక్ష్మితో వివాహం జరిపించాలని పట్టుపట్టాడు మోహన్. తనకు విమల సహకారం లభించింది. సఫలీకృతులయ్యారిద్దరూ. మోహన రావు ఆదర్శాభిప్రాయాల్ని అవగాహన చేసుకున్న విమల అతణ్ణి వివాహ మాడటాని కంగీకరించింది.

వేసవిలో పరంధామయ్య గారింట పెళ్ళి పందిరి వెలసింది. దేదీప్యమానంగా లైట్సతో అలంకరించారు. విమలకూ, శ్రీలక్ష్మికీ ఒకే పందిట్లో ఆదర్శవివాహాలు జరిగాయి. ●



ప్రశ్నావణం

...కె. రామలక్ష్మి...

బి. ఏ. ఆర్, కొత్తగూడెం

నాకు పెండ్లయి రెండు సంవత్సరము లైంది. మా ఇద్దరికీ చదువుకీ సంస్కారానికీ లోటు లేదు. మా వారు నన్ను అర్థం చేసుకోరు. ఎంతసేపూ ఆయన షికార్లు స్నేహితులు తప్ప మరోటి తలచరు. ఎప్పుడూ తెలుగు ఇంగ్లీషు పుస్తకాలు చదువుతాను. ఆయన నన్ను విసిరేస్తూ నన్ను ఏడిపిస్తూంటారు...

ఆయినా పెళ్లయి రెండేళ్లు కాలేదు. ఒకరికి స్నేహితులు ఒకరికి చదువు ధ్యాసేమిటంట?!.. ఒకరి మీద ఒకరికి ధ్యాసుండాలి గాని!

టి ఆర్. ఎస్. ఆర్, ఒంగోలు

మీరు ఏం చదువుకున్నారు? మీ శ్రీవారి పేరేమిటి?

ఏం చదువుకోలేదండీ,.. ఇక వారి పేరా? ఎలా చెప్పను బాబూ, సిగ్గుగా ఉంది!

కె. బి. ఎస్, ఆముదాలవలస

దేవుడు సృష్టించిన మనిషిని, మనిషి తాను సృష్టించిన డబ్బుతో ప్రాణాలు తీస్తున్నాడు. ఇలాంటప్పుడు దేవుడు మానవునికన్నా గొప్పవాడా? మానవుడు దేవుడికన్నా గొప్పవాడా?

చిన్న కరక్షన్. మానవుడే మానవుణ్ని సృష్టిస్తున్నాడు డబ్బునీ మానవుడే సృష్టిస్తున్నాడు. అందుకే, అవలీలగా రెండిటినీ కీలుబొమ్మలు చేసి ఆడించ కల్గుతున్నాడు. అనవసరంగా యీ బురదలోకి దేవుణ్నెందుకు లాగుతారు?

కె. ఎస్. ఎస్, మొగలపల్లి

స్త్రీలకు శత్రువు ఏది?

సాటి స్త్రీ!

కె. ఎస్. ఎస్, మద్రాసు

చేతలలో చూపలేని నైపుణ్యం మాటలలో చూపుతున్నంతవరకు మనకు సుస్థితి లేదనుకొంటాను.

అంతే మరి. చేతలవాళ్ళు వర్కర్స్ అవుతారు. మాటల వాళ్ళు ఎక్స్‌పర్టులు అవుతారు!

సత్యం, శివం, సుందరం, విజయవాడ

మేం ముగ్గురన్నదమ్ములం. మాకు మూడు లక్షల విలువ చేసే ఆస్తి ఉంది. ముగ్గురం మూడు కాలేజీలలో ముచ్చటగా మూడు డిగ్రీలు తీసుకున్నాం...ఉద్యోగాలు వెలగబెడుతున్నాం. మాకు మీ......

అయ్యొ రాతా అంత సిగ్గెందుకు—పైన అంత స్వంత బాగా ఉందుకుని..మీరు మరి ఒద్దిక లేని అన్నదమ్ముల్లాగా ఉన్నారు. నా కిష్టంలేదు బాబూ, మీ సంబంధం!

రతన్ బాబు, కోలంక

అందం ఆకర్షణ నలుపులోనా? తెలుపులోనా?

మాట పొందికలో.

మనిషికి దేవుడు ఈర్ష్యా ద్వేషాలు ఎందుకు పెట్టాడు?

మంచి ఓర్పును పరీక్షించడానికి.

కళ్యాణశ్రీ, కోవెలకుంట్ల

ఐదవ తరగతి చదివినవారుకూడా కథలు వ్రాయకలుగుతారా?

ఎందుకు రాయలేరు? అయినా రచించడం జన్మహక్కు. సార్ ఒద్దనడానికి ఎవరికుంది హక్కు. అందుకే రాజకీయవాదికీ, రచయితకీ విద్యార్హతలు నిషేధించాలని అలజడి లేవతీస్తే?!

నేను సంవత్సరంనుంచి కష్టపడి 'చీకటి దారి' అను నవలను రాశాను.

నేను గత సంవత్సరమే 'చీకటిదారి' అను నవల ప్రచురించాను!!

కె. జి. కె. శివరామపురం (చిత్తూరు)

పదవి, ధనమూ అందమూ లేకపోతే మనిషికి మనుగడే ఉండదా?

ఎందుకుండదు. నూటికి 80% ఉన్నవాళ్ళు వాళ్లేకదా!

మల్లెలలాంటి మనసున్న మిమ్మల్ని చూడాలని ఉంది.

చంపేశావు! నాకు మల్లెపువ్వు అంటే ఇష్టమే గాని నా మనస్సు మల్లెపువ్వా? కాదా! అన్నది డౌటే!

ఎస్. వి. ఆర్. ఆర్. కొల్లాపూరు

ఇన్ని సమస్యలతో మనిషి బ్రతుకులో ఏదో ఉందంటూ బాధ పడుతూ ఎలా బ్రతకకలుగుతున్నాడు?

అదే వింత. అదే ఆశ.

ఎమ్ కె మద్రాసు

మహాకవి శ్రీశ్రీ ఆరుద్ర ప్రవచనాలు 'విరోచనాలని' ఒక పత్రిక సంపాదకునికి లేఖలో వ్రాశారు. మీరు చూశారా?

చూశాను. అవి మహాకవి 'నోటినుండి' రావడం అత్యంత ఆనందదాయకం కదా మనకి!!

బి. జి ఆర్, తిరుపతి

రామలక్ష్మిగారూ, సినిమాలవలన లాభములు అధికమా? నష్టములు అధికమా?

ఎవరికి తమ్ముడూ? తీసిన వారికా? చూసిన వారికా?

బి వి ఎమ్, గుంటూరు

... కాని నా ఊహాగానంలో నేటి తెలివిగల వాళ్ళకి దిగంతాల కవులలాంటి వారి కేదైనా తెగులు పట్టిందా అని పిస్తుంది. మీ అభిప్రాయం తప్పక తెలియ చేయండి వదినమ్మా

మరిదీ! లక్ష్మణా! ఈ రోజుల్లో ఏ రోగానికైనా కాలమే వేస్తుంది మందు. బెంగపడకు.

కె ఎస్, భిలాయి

నాకు ఎవరో మీది కాకినాడ అని మీరు కుళాయి చెరువు దగ్గర ఉండేవారనీ చెప్పారు. కాని మీది బరంపురం అని తెలుసుకుని చాలా విచారించాను

మీకు విచారం అనవసరం బ్రదర్, నాది అక్షరాలా కాకినాడే. ఇప్పటికీ నాకు సైన్సు చెప్ప ప్రయత్నించిన జగన్నాథం మాష్టారు అక్కడే ఉన్నారు—అడగండి. నేనూ మా 'కప్పా' ఒకటే కంచం ఒకటే మంచంగా ఉన్న స్నేహితులం నాకు సహాం అల్లరి ఆమె దగ్గర నుంచే వచ్చింది. ఇక 'కమ్యూనిస్టులము' చెప్పుకొనే వారంతా సినిమాల్లో చేరి ధనవంతులయి కమ్యూనిజానికి అన్యాయం చేశారు' అని మీరు మీ లేఖలో రాశారు. విజ్ఞానవంతులు అంతో ఇంతో అభ్యుదయం కాంక్షించిన వాళ్ళు, మేధావంతులు— అందరూ కమ్యూనిజం పట్ల ఆకర్షింపబడే వాళ్లే కాని విఘ్నేశ్వరుని బొడ్డులో వేలెట్టిన కథ లాగా నిజంగా కమ్యూనిజం చివరికేం సాధించుతుందో తెలియక, తెలిపే అవకాశం లేక— ఎవరికి వారే ఊరుకుంటున్నారు ఇక ధనవంతులవడం— లాటరీ కొట్టి లూటీ చేసి ధనవంతులు కాగా లేంది సనిచేసి ధనవంతులైతే మీకేం అభ్యంతరం? లేక మేధావివర్గం ఎప్పుడూ కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర ఉండకూడని వర్గం అని నిర్ణయించారా? ఈ మధ్యనే ఒక మహాకవి రచనా సర్వస్వం చదువుతుంటే అందులో రాశారు, ఇలా కారూ కొన్నారు—దనా పేక్షతో కాదు ఉట్టినే సరదాకి అని అలాగ్గా పైవాడు అర్జిస్తే బూర్జువా, కమ్యూనిస్టు అర్జిస్తే సరదా అంటారా మీరు కూడా? ఏ వృత్తి చేపట్టక, సంఘం మీద బ్రతికేయ మంటారా? ఏం చేస్తే మీరు మీవంటి యువకులకు యుగకర్తలవుతారు? చెప్పండి.

●


కుటుంబము అంతటికి ఫోస్‌ఫోమిన్® వల్ల ఆరోగ్యము కలుగును
ఫోస్‌ఫోమిన్
• శక్తిని పెంపొందించును
• ఆకలిని అధికము చేయును
• పచన శక్తిని హెచ్చించును
• శరీరము యొక్క రోగనిరోధక శక్తిని ఎక్కువచేయును.
SQUIBB
Phosfomin
VITAMINS ELIXIR
There's health in Phosfomin for all the family
SQUIBB
SARABHAI CHEMICALS
ఫోస్‌ఫోమిన్...
ఆకుపచ్చని పండ్ల రుచిగల
విటమిన్ టానిక్
Shilpi HRMA-35A/70 Tel



'సుగుణ సుందరి కథ'లో కాంతారావు, దేవిక

సుగుణ సుందరి కథ

చిత్రసమీక్ష:

పురాణ కథలకి కాపీరైటు లేదు. ఎవరు ఎన్ని రూపాల్లో మార్చుకున్నా అడిగేవారుండరు. కల్పతరువులుగా వున్న ఈ కథలు సాంఘికాలకీ, జానపదాలకీ కావలసిన కథాసామగ్రిని అక్షయపాత్రల్లా అందిస్తూ వుంటాయి. ఈ పురాణకథల్ని మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేస్తున్న నిర్మాతల జన్మలు ధన్యమవుతున్నాయి!

పి యస్ ఆర్ పిక్చర్స్ 'సుగుణ సుందరి కథ'లో కొట్టొచ్చినట్టు కనిపించేది కథ. కథ అల్లికలో బిగి లేకపోతే అంత సర్వాంగ సుందరంగా తయారైవుండేది కాదు సన్నివేశానికి ప్రాణం పోస్తూ ఆ సన్నివేశాన్ని మరో సన్నివేశంలో ముడిపెట్టి వాటిని ప్రయోజనాత్మకంగా మలచడంలో రచయిత చిల్లర భావనారాయణ ప్రతిభ వెల్లడయింది.

'భూలోకంలో పతివ్రతలు వుంటున్నారు' అని నిరూపించే ఈ చిత్రానికి పాచ్. యుమ్. లేణు దర్శకత్వం వహించారు

నాయకీ నాయకులుగా దేవిక, కాంతారావు చూడ ముచ్చటగా నటించారు. రామకృష్ణ ఒక ముఖ్యమైన పాత్రకి ప్రాణం పోస్తూ బాగా రాణించాడు ధనశ్రీ తెరకు కొత్త కాకపోయినప్పటికీ ఒక సరికొత్త పాత్రలో మంచి నటి కాగల సామర్థ్యాన్ని చూపించింది మాంత్రికుడుగా త్యాగరాజు నటన మంచి ఆకర్షణగా వుండగల ఈ చిత్రంలో ఇంకా విజయలలిత, జ్యోతిలక్ష్మి, త్యాగరాజు, మిక్కిలినేని, మణిమాల, రామచంద్రరావు మొదలైనవారు ఇతర ముఖ్యపాత్రలని పోషించారు

చిల్లర భావనారాయణ సంభాషణలు ఉత్సాహజనకంగా వున్నాయి. యస్ పి కోదండపాణి సంగీతంలో "నా మంగళ గౌరి' పాట మళ్ళీ వినాలనిపిస్తుంది.

పూర్తి వినోదాన్ని చేకూర్చగల 'సుగుణ సుందరి కథ' సకుటుంబంగా చూసి ఆనందించతగ్గ రీతిలో నిర్మించిన పింజల సుబ్బారావు అభినందనీయులు.

సినిమా

విదేశీయులను ఆకర్షించిన తెలుగు చిత్రం

శ్రీ వి బి. రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో సర్వాంగసుందరంగా నిర్మింపబడుతున్న 'దసరాబుల్లోడు' కలర్ చిత్రం యొక్క కొంత భాగాన్ని జపాన్ రాయబారి, కాన్సలేట్ జనరల్‌గార్లు చూచారట, 'మేము యీ చిత్రాన్ని పూర్తిగా చూస్తాము మీ చిత్రంలోని పాటలన్నింటినీ మా టేప్‌లో రికార్డు చేసుకుంటాము' అని తమ ఆసక్తిని వెల్లడించారట.

గ్రామీణ జీవితాన్ని, మన పల్లెసీమల సంస్కృతిని ప్రతిబింబింపచేస్తే చక్కటి చిక్కటి కథాంశంగొన్న 'దసరాబుల్లోడు' చిత్రం విదేశీ మార్కెట్టును ఆకర్షించ వచ్చునని వూహించబడుతోంది తిరుగులేని ఫ్యామిలీ సెంటిమెంట్ + రొమాంటిక్ ఎలిమెంట్ వున్న 'దసరాబుల్లోడు' చిత్రం భారీఎత్తున నిర్మింపబడుతున్న కలర్ చిత్రం

విదేశీ మార్కెట్టు?

మన తెలుగు చిత్రాలకు ఫారిన్ ఎక్స్చేంజి దొరకడం దుర్లభంగా వుంది మన ప్రభుత్వం తగు శ్రద్ధవహించి, తెలుగు చిత్రాలకు అలాంటి అవకాశాన్ని కల్పించెయ్యడానికి గట్టిగా ప్రయత్నించాలి. విదేశీయులకు 'భాష' అడ్డు రాదు ఈ సత్యాన్ని ప్రభుత్వం గుర్తించి, మన తెలుగు చిత్రాలకు విదేశాల్లో తగు గుర్తింపు వచ్చేట్టు చూడాలి. 'దసరాబుల్లోడు' చిత్రం విదేశీయులను ఆకర్షించే అవకాశం వుందని తెలుస్తోంది,

దర్శకత్వ ప్రతిభ

'దసరాబుల్లోడు' చిత్రంలోని అన్ని పాటలు హిట్ అవుతాయని విన్నవారంటుంటే, దర్శకత్వం సూపర్బ్ అని చిత్రం [illegible]



'మారిన మనిషి'లో
ఎన్. టి. రామారావు.

అంటున్నారు. నిర్మాతగా ప్రతిభావంతులనిపించుకున్న శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్, 'దసరాబుల్లోడు' విడుదలానంతరం దర్శకునిగా ప్రతిభాశాలి అనిపించుకోగలరని అంటున్నారు

జగపతి ఆర్టుపిక్చర్సు నిర్మిస్తున్న 'దసరాబుల్లోడు' జనవరిలో విడుదలవుతుంది ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచన, మహదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయాగ్రహణాన్ని, సంజీవి కూర్పును, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని, హీరాలాల్ నృత్యాన్ని నిర్వహిస్తున్నారు సారథి స్టుడియోలో నిర్మింపబడుతున్న ఈ కలర్ చిత్రంలోని ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, రంగారావు, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, రావికొండలరావు, వాణిశ్రీ, చంద్రకళ, సూర్యకాంతం, ఛాయాదేవి, రాధాకుమారి, బేబి రాణి ధరిస్తున్నారు

నిర్మాత అయిన రచయిత

జానపద కథా[illegible] రాష్ట్రం యావత్ పేరుంది, జానపద కథకునిగా వీటూరికి అంత పేరుంది. వీటూరి విజయలలితా పిక్చర్స్‌ను స్థాపించి, 'అదృష్టదేవత' అనే సాంఘిక కథాంశంగల్ల జానపద చిత్రాన్ని నిర్మిస్తున్నారు స్త్రీ యొక్క శక్తిని, భక్తిని, యుక్తిని, త్యాగనిరతిని చాటిచెప్పే వినూత్నమయిన కథా గమనంగల యీ చిత్రానికి కె. ఎస్. ఆర్. దాసు దర్శకుడు


ఈ చిత్రానికి వీటూరి రచయిత, కోదండపాణి సంగీత సారథి ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు ఈ చిత్రం దాదాపు పూర్తయింది బహుశా అక్టోబరు ఆఖరివారంలో విడుదల కాగలదని తెలుస్తోంది ఈ చిత్రం ఆంధ్రలో జ్యోతి పిక్చర్స్, నైజాంలో ఉషా ఫిలింస్, సీడెడ్‌లో నవభారత్ మైసూర్‌లో సుధా చిత్రద్వారా రిలీజు అవుతుంది చిత్రంలోని ప్రధాన పాత్రలను కాంతారావు, రామకృష్ణ, రేలంగి, సత్యనారాయణ, త్యాగరాజు, రాజబాబు, రాజశ్రీ, విజయలలిత, గీతాంజలి, సురేఖ, శ్యామల, పుష్పకుమారి పోషిస్తున్నారు.

• • •

[illegible] రెడ్డిని అడిగాను సెప్టెంబరు 28 నుండి అన్నారు మా రెండవ చిత్రానికి 'విచిత్ర దాంపత్యం' అని పేరుపెట్టాము అని చెప్పారు ఈ చిత్రానికి ముద్దిపట్ల సూరి, మోదుకూరి జాన్సన్ సంభాషణలను సమకూరుస్తున్నారు. పి. వి. రెడ్డి డైరెక్టు చేస్తున్న ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను సావిత్రి, చంద్రకళ, విజయలలిత, పద్మిని, రోజారమణి, శోభన్‌బాబు, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రాజబాబు, కె. వి. చలం, సాక్షి రంగారావు గార్లు పోషిస్తారు చిన్నపరెడ్డి ఎం. ఎస్. పి. నిర్మించే యీ సాంఘిక చిత్రానికి అవిత్ ప్రభాత్ ఎంటర్‌ప్రయిజస్ పంపిణీదారులు.

దంపతులుగా సావిత్రి, గుమ్మడి

ఇంతవరకు సావిత్రికి తండ్రిగానో, మామయ్యగానో గుమ్మడి చాలా చిత్రాల్లో నటించియున్నారని మీకు తెలుసు. ఇప్పుడు సావిత్రి, గుమ్మడి, భార్యాభర్తలుగా ఉషశ్రీవారి 'విచిత్ర దాంపత్యం'



'ఇద్దరమ్మాయిలు'లో వాణిశ్రీ, నాగేశ్వరరావు.

సినిమా

[illegible] ప్రత్యేకంగా నటిస్తున్నారు

*   *   *

జెమినీ స్టుడియోనుండి హోటల్ సవేరాకు వెళ్లాను రూమ్‌నెం 31 లోనికి వెళ్లాను. హీరో నాగేశ్వరరావు ఊదా రంగు సూట్ ధరించి, క్రౌన్‌బూట్ వేసుకుని అద్దం ముందు నిలబడి హెర్‌డ్రస్ చేసుకుంటూ నన్ను కూర్చోమని సంజ్ఞ చేసారు. 'ఏమిటి, షూటింగు వుందామీకు'? అని ప్రశ్నించారు అవును అవుట్‌డోర్‌లో రెండుషాట్లు 'ఇద్దరమ్మాయిలు' చిత్రానికి కావాలన్నారు హీరో గారితో బాటు నేను కూడా అవుట్‌డోర్ లొకేషన్‌కు వెళ్లాను హోటల్ సవేరాకు తన్ను చూడవచ్చిన వాళ్ళందరితో మాట్లాడి, హాబిబుల్లా రోడ్డులో వున్న కళ్యాణ మండపానికి వచ్చేసరికి, దాదాపు వందమంది ఆటోగ్రాఫులతో రెడీగా వున్నారు వాళ్లకోరికను తీర్చి రెండు షాట్లను ముగించి, నాతో కాస్సేపు ముచ్చటించారు.

నూతన గృహ ప్రవేశం

'మీరు హైదరాబాదు బంజారా హిల్స్‌లో కొత్తభవంతి కట్టారట? గృహ ప్రవేశం యెప్పుడు?' అని అడిగాను 'అయిందండీ ఆగస్టు 14 న హాయిగా కొత్తయింట్లోకి ప్రవేశించాము అన్నారు ఆగస్టు 14 న అన్నపూర్ణమ్మగారి బర్త్‌డే ఆట అందుకని ఆగస్టు 14 న నూతన గృహప్రవేశం చేసాము అన్నారు భార్యపట్ల నాగేశ్వరరావుగారికి గల అనురాగం అతిశయం మీరు విపరీతంగా రేటు పెంచేసారని అంటున్నారు నిజమే? అని అడిగాను యస్ మన హీరోలందరికన్నా నేను ఎక్కువగానే తీసుకుంటున్నాను, అన్నారు థ్యాంక్యూసార్ విశాలాచార్యను కలవాలి వస్తాను సార్ అని చెప్పి నా డైరెక్షన్ను పరుశువాకానికి మళ్లించాను

*   *   *

పరుశువాకం గంగాధరీశ్వరకోవెల వీధిలోని విశాలాచార్య ఇంటివద్ద దిగి జెమినీ వాళ్ళ కారును పంపించాను. నేను వెళ్ళిన సమయంలో 'జగజ్జెట్టీలు' లో నటించిన స్నేహప్రభ, వాళ్ళఅమ్మ విశాలాచార్యతో మాట్లాడుతూ వున్నారు నన్నుచూచిన విశాలాచార్య 'పర్వాలేదు మీరు రండి' అంటూ లోపలికి ఆహ్వానించారు నన్ను స్నేహప్రభకు పరిచయం చేశారు ఆమె అంతక్రముందు నన్నెరగట్లు నటించింది 'ఏమమ్మా, అప్పుడే నన్ను మర్చిపోయారా? మీ యింటర్‌వ్యూ వ్రాసి, మీ బొమ్మ కవరుపేజీ కూడా వచ్చిందే జ్ఞాపకం లేదా? అని ముఖం మీద అడిగేసరికి 'క్షమించండి' అంది. మీ అమ్మాయికి మంచి భవిష్యత్తు వుంటుందిలే అని వాళ్ళను పంపించేసారు, విశాలాచార్య



"రౌడీ రాణి"లో విజయలలిత

విశాలాచార్య చిత్రంలో అక్కినేని!

'మీకొక స్వీట్ న్యూస్, మీకే చెప్తు యున్నాను' అని ప్రారంభించారు. 'నేను నాగేశ్వరరావుగారిని సెప్టెంబరు 1 న సవేరాలో కలిసాను' అన్నారు. ఏమయినా విశేషమా? అని ప్రశ్నించాను నేను నాగేశ్వరరావుగారిని కలిసి 'ఓటిల పాట్లు చిత్రంలోని హీరో పాత్రకు మీరే యాప్ట్‌గా వుంటారనుకున్నాము,

సినిమా డైరీ

● మాధవీ కంబైన్స్‌వారి సాంఘిక చిత్రానికి 'సుపుత్రుడు' అని పేరు పెట్టారు ఈ చిత్రానికి తాతినేని రామారావు దర్శకుడు

● ఎస్ వి ఎస్ పిక్చర్స్‌వారి 'పండుదంపతులు' షూటింగు సెప్టెంబరు 5 నుండి 8 వరకు ఎ వి ఎం లో జరిగింది కె విశ్వనాథ్ దర్శకత్వంలో ఎన్టీరామారావు, గుమ్మడి, సావిత్రి నటించారు

● హీరో నాగేశ్వరరావు, అన్నపూర్ణా నాగేశ్వరరావు సెప్టెంబరు 14 న తాష్కెంటుకు బయల్దేరి వెళ్ళారు ఒక నెల రోజుల పాటు యీ దంపతులు టూర్ చెయ్యగలరని తెలుస్తోంది

● సెప్టెంబరు 9 న విజయా గార్డెన్స్‌లో 'అదృష్టదేవత' చిత్రానికిగాను 'పూవువలె— నవ్వవలె జీవితం ఆదికావాలి దేవునికే అంకితం'' అనెడి పీటూరి వ్రాసిన పాటను, కోదండపాణి సంగీత సారధ్యంలో సుశీల, ఈశ్వరి పాడారు

● శ్రీ స్వరాజ్యలక్ష్మి ప్రొడక్షన్స్‌వారి 'రైతేరాజు' అవుట్‌డోర్ షూటింగు సెప్టెంబరు 8, 9 తేదుల్లో గిండీ ఫారెస్టులో బి వి శ్రీనివాస్ దర్శకత్వంలో జరిగింది కాంతారావు, రాజనాల అండ్ స్టంట్‌పార్టీ పాల్గొన్నారు

● పి ఎస్ ఆర్ పిక్చర్స్ వారి మొదటి పాట రికార్డింగు సెప్టెంబరు 11 న విజయ గార్డెన్స్‌లో జరిగింది ఎ పి రాజా సంగీత సారధ్యంలో సుశీల, జానకి పాడారు

అందువల్ల మీరు నాకు ఒక పిక్చరు డైరెక్టు చేసిపెట్టాలి' అని అడిగాను ఆయన వెంటనే అంగీకరించారు,' అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా మీరు ఆయన్ను అడగనే లేదా? 'నేను మద్రాసు రాగానే 'వద్దంటే పెళ్లి' చిత్రాన్ని ఆయనతో నిర్మించాలనుకున్నాము కానీ ఇప్పుడు చేసినట్టు నేనే డైరెక్టుగా కలిపివుంటే, ఆ చిత్రంలో ఆయనే నటించేవారేమో' 'అంటే హైద్రాబాదులో షూటింగన్నమాట ఎప్పుడ్నుంచి వుంటుంది' అని అడిగాను బహుశా 1971 రెండవ సగంలో వుండొచ్చు అన్నారు

చిన్న పిక్చరు

1971 వరకు చిత్రనిర్మాణం వుండదా? అని ప్రశ్నించాను. ఎందుకు వుండదు. త్వరలోనే చిన్న తారలతో 'ఒకటి, రెండు' చిత్రాలను నిర్మించా లనుకుంటున్నాను, అన్నారు. మీరు బయటి చిత్రాలను డైరెక్టు చెయ్యరని



'నా తమ్ముడు'లో భారతి.

విన్నాము నిజమేనా? 'నిజమే బయటి చిత్రాలను ఒక్కుమ్మడిగా ఒప్పుకుంటే, స్వంత చిత్రంమీద సరయిన కేర్ వుండదనే వద్దని చెప్తున్నాను' అన్నారు.

విక్టర్ హ్యూగో వ్రాసిన 'లెమిజరబుల్స్' ఆధారంగా విఠలాచార్య నిర్మించనున్న 'బీదలపాట్లు' చిత్రంయొక్క రచనా విభాగాన్ని శ్రీ డి వి నరస రాజుకు అప్పగించారు హైద్రాబాదు సారథి స్టుడియోలో నిర్మింపబడే ఈ చిత్రంలోని హీరోపాత్రను శ్రీ అక్కినేని పోషించడానికి అంగీకరించారు నాగేశ్వర రావు—విఠలాచార్య కాంబినేషన్‌లో తయారయ్యే మొదటిచిత్రం యిదే ఈ చిత్రం భారీయెత్తున నిర్మింప బడగలదని విఠలాచార్య చెప్పారు

* * *

పరుశువాకంనుండి మాంబలానికి శ్రీ విఠలాచార్య కారులోనేవచ్చి నేను హబిబుల్లా రోడ్డులోని గుమ్మడిగారింటి వద్ద దిగాను అప్పుడే బజారుకు బయల్దేర బోతున్న గుమ్మడి నన్నుచూసి 'రండి. చాలా రోజులయింది మనంకలిసి' అంటూ సాదరంగా ఆహ్వానించారు 'నేను రెండు రోజులక్రితం మీకు ఫోనుచేశాను మీరు బొంబాయి వెళ్లినట్టు చెప్పారింట్లో'

చేశారు, అన్నారు 'ఏదయినా హిందీ పిక్చరులో నటించవచ్చా?' 'ఒక చిన్న గెస్టురోల్. మనతిలక్ డైరక్టు చేస్తున్న 'కంగన్' హిందీ చిత్రంలో అశోక్‌కుమార్ గురువుగా నటించవచ్చాను మీకు తెలుసా, నేను, సావిత్రి కలిసి తమిళంలో దంపతులుగా నటిస్తున్నామని' ప్రశ్నించారు. తల వూపాను 'భానుమతిగారు నిర్మిస్తున్న చిత్రంలో ఆమె ప్రక్కన నటిస్తున్నాను. 'అనురాగం' తర్వాత' అన్నారు

రామారావు, గుమ్మడి కాంబినేషన్

ప్రముఖనటులు శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావులు 1963 వరకు అనేక చిత్రాల్లో కలిసి నటించారు. ఆతర్వాత రామారావు, గుమ్మడిగార్ల కాంబినేషన్‌లో పిక్చర్లు అరుదుగావచ్చాయి. శ్రీరామారావు హీరోగా నటించే చిత్రాల్లో గుమ్మడి వుండరు అనేడి అభిప్రాయం ప్రేక్షకుల హృదయాల్లో బాగా నాటుకుపోయింది కానీ అలాంటి అభిప్రాయాన్ని పెట్టుకోవద్దు అని చెప్పినట్టుగా యిటీవలే 'చిట్టి చెల్లెలు' చిత్రం విడుదలయింది. ఆ

సినిమా

చిత్రంలో ఎన్. టి. రామారావుకు తండ్రిగా గుమ్మడి నటించారు. ఇప్పుడు ఎన్. ఎ. జగన్నాథరావు నిర్మిస్తున్న 'వింత దంపతులు' చిత్రంలో రామారావుగారి మామయ్య (సావిత్రికి తండ్రిగా) గుమ్మడి నటిస్తున్నారు. ఈ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు.

చంద్రకళ-ఎం. జీ. ఆర్. కాంబినేషన్

ఇప్పుడిప్పుడే హీరోయిన్ ఫైల్‌లోకి వస్తున్న వర్ధమాన నటి చంద్రకళకు శ్రీమతి సావిత్రి తమిళంలో నిర్మిస్తున్న 'ప్రాప్తం' (మూగమనసులు)లో తెలుగులో శ్రీమతి జమున ధరించిన 'గౌరి' పాత్రనిచ్చింది. అందులో చంద్రకళ బాగా నటిస్తున్నట్టు భువనేశ్వరి పిక్చర్స్‌వారికి తెలిసింది. వాళ్ళు చంద్రకళను తమ తమిళ చిత్రంలో హీరోయిన్‌గా పెట్టుకున్నారు ఇప్పుడు చంద్రకళ జాతకం మారింది. ప్రముఖ తమిళ బాక్సాఫీస్ హీరో ఎం. జి. ఆర్. చంద్రకళను తన స్వంతచిత్రంలో నాయికగా పెట్టారు అక్టోబరు 4న చంద్రకళ,



'అదృష్ట దేవత'లో కాంతారావు, రాజశ్రీ.

మీకు తెలుసా?

ప్రముఖ హాలీవుడ్ నటి జోరిస్‌డే ఒక చిత్రంలో నటించడానికి కొన్ని లక్షలు డాలర్లు తీసుకుంటుందిట అయినా, ఆమె అప్పుడప్పుడు సైకిల్‌పై బజారుకెళ్ళి, తనకు కావలసిన వస్తువులను కొనడం అలవాటు చేసుకుందట

రష్యాలో 'అమ్హాకోరినా' అనేడి నవలను పదహారుసార్లు చిత్రంగా నిర్మించారట

తమిళ హాస్యనటుడు కరుణానిధి 'మామియా' అనే హోటల్ ప్రారంభించి, అందులో పనిచేసే వాళ్ళందర్నీ ఆడవాళ్ళనే పెట్టారట

ప్రముఖ హాలీవుడ్ నటుడు యుల్ బ్రిన్నర్ చిన్నప్పుడు సర్కస్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు, దురదృష్టవశాత్తు ఒకసారి క్రిందపడ్డారట. అప్పుడు ఆయన శరీరంలో 47చోట్ల ఎముకలు విరిగాయట

ఎం. జి. ఆర్.తో విదేశాలకు 'ఉలగం చుట్రియు వాలిబన్' షూటింగు నిమిత్తం వెళతాంది. ఒకనెల రోజులపాటు జపాన్, హాంకాంగ్, థాయిలాండ్, సిలోన్ దేశాల్లో యీ చిత్రం యొక్క షూటింగు వుండగలదని తెలుస్తూంది. తెలుగు నిర్మాతలకు మరొక మంచి హీరోయిన్ పోయినట్టేగా.

తెలుగు తెరకు కొత్త బాల నటుడు

శ్రీ స్వరాజ్యలక్ష్మి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'శ్రీ తే రాజా' చిత్రంలో ఒక కొత్త బాలనటుడు పరిచయమవుతున్నాడు. ఆ బాలుడి పేరు మాస్టర్ వరవయ్య. వయస్సు నాలుగేండ్లు మాత్రమే చిత్రంలో చిన్న కాంతారావు పాత్రను పోషిస్తున్నాడు శ్రీ కుదరవల్లి సీతారామస్వామి సమర్పిస్తున్న యీ చిత్రానికి బి. వి. శ్రీనివాస్ దర్శకుడు. ఈ చిత్రంలో కాంతారావు తండ్రి కొడుకుగా రెండు పాత్రలను ఒకడే నిర్వహిస్తున్నారు

—శ్రీనివాస్

డా. సదాశివన్ కాలధర్మం

మద్రాసు వైద్యకళాశాల థోరాసిస్‌సర్జరీ ప్రొఫెసర్ డా. కె. ఎస్. సదాశివన్ 'లుకేమియా' వ్యాధితో ఆగస్టు 30వ తేదీన మరణించారు.

డా. సదాశివన్ భారతదేశంలో 'కార్డియో థోరాసిస్'లో ప్రముఖులైన వారిలో ఒకరు. ఆయన సేవలకు ప్రభుత్వం ఈ సంవత్సరం 'పద్మశ్రీ' బిరుదుకూడా ఇచ్చింది.

కీ. శే. అన్నాదురైకు ఆయన అంతరంగిక వైద్యులుగా వుండేవారు. అన్నాదురై కాన్సర్‌వ్యాధి చికిత్సకోసం అమెరికా వెళ్ళినప్పుడు డా. సదాశివన్ కూడా వెళ్లారు.

డా. సదాశివన్‌కు తండ్రి, భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు

'లక్ష్యసాధన' నాటకానికి జాతీయ అవార్డు

కేంద్ర ప్రభుత్వం వివిధ భారతీయ భాషల్లో నిర్వహించిన సాహిత్య పోటీల్లో తెలుగులో శ్రీ భీసెట్టి లక్ష్మణరావ్ రాసిన 'లక్ష్యసాధన' నాటకం జాతీయ అవార్డుగా [ప్రథమ బహుమతి] వెయ్యి రూపాయలు గెలుచుకుంది.

గతంలో యీ రచయితకు అఖిల భారత మద్యనిషేధ పరిషత్తు పోటీల్లో 'మారాలి మనం' నాటకానికి వెయ్యి రూపాయలు, విజయ అండ్ సురేష్ కంబైన్స్‌వారి 'పాపకోసం' చిత్ర సమీక్షల పోటీల్లో వెయ్యి న్నూట పదహార్లు బహుమతులుగా లభించాయి.

వీరి 'సాధన', 'ఛాయ', 'మారీ మారని మనుషులు', 'ధర్మపథం' నాటిక—నాటకాలు వందలాది ప్రదర్శనలతో [వివిధ పరిషత్తులలో] మరెన్నో వందల బహుమతులు గెలుచుకున్నాయి. [ఒ. వి.]

* * *

పాలిసీలని హామీగా ఇచ్చి లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్‌ఆఫ్ ఇండియావద్ద అప్పులు పుచ్చుకునే వారు ఇకమీదట 6 శాతం బదులు 7 5 శాతం వడ్డీ యివ్వవలసి వుంటుందని లై. ఇ. కా. వారు ప్రకటిస్తున్నారు.



ప్రతిభగల నటుడు

'అతన్ని నేను స్టేజి ఆర్టిస్టుగా ఎరుగుదును. అతని నాటకాలెన్నో చూశాను. అతన్ని మా చిత్రంలో ఒక ముఖ్యభూమికకు బుక్‌చేశాను' అన్నారు — ప్రసిద్ధ నిర్మాత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు ఈ మధ్య అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ కార్యాలయంలో పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ.

అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ అనే సంస్థను శ్రీ మధుసూదనరావు తమ అల్లుళ్ళు టి. ప్రసాద్, పి. గంగాధరరావుగార్ల పేరిట నెలకొల్పారు. ఈ సంస్థకు వీరిద్దరూ సహనిర్మాతలుగా వ్యవహరిస్తారు. ఇంతకీ మధుసూదనరావుగారు అన్నమాటలు — నటుడు రమణమూర్తి గురించి.

'రమణమూర్తికిచ్చింది చాలా మంచి వేషం. ఆ వేషానికి అతన్ని వినియోగించుకున్నందువల్ల నా చిత్రానికేమీ నష్టం వాటిల్లదు. అలాంటి భయమూ లేదు నాకు. నా సబ్జెక్టులో దమ్మున్నదనే నమ్మకం నాకున్నది. అందుకే ఆ పాత్రను అతనికిచ్చాను' అన్నారాయన మళ్ళీ.

* * *

ప్రతిభగల నటుడు రమణమూర్తి. పెళ్ళిమీద పెళ్ళి, పెళ్ళితాంబూలం శభాష్‌రాముడు చిత్రాలు చూసిన వారికి నటుడిగా అతని ప్రజ్ఞా విశేషాలు అవగతం అవుతాయి... ఏడెనిమిదేళ్ళుగా అతను మళ్ళీ ఏ చిత్రంలోనూ కనిపించలేదు. పరిశ్రమ అతనిమీద శీతకన్ను వేయడమే అందుకు కారణమై ఉండవచ్చు. అతనిలోని శక్తిసామర్థ్యాలను గుర్తించి శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు లాంటి నిర్మాత అతన్ని పైకి తీసుకు రావటానికి ప్రయత్నించటం ఎంతో హర్షించదగిన సంగతి. కథానాయికల వలెనే కథానాయకుల కొరత కూడా ఎక్కువగా ఉన్న యీ తరుణంలో రమణమూర్తివంటి సామర్థ్యంగల యువకుణ్ణి ప్రోత్సహించడం పరిశ్రమ కెంతో అవసరం!

'రమణమూర్తినే ఆ పాత్రకు తీసుకోవటానికి కారణం?' అంటూ ఒక పాత్రికేయమిత్రుడు ప్రశ్నించాడు. అందుకు ఆ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ప్రఖ్యాత దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు సమాధానం యిస్తూ 'వి హువాంట్ ఏన్ ఆర్టిస్ట్ నాట్ ఎ స్టార్' అన్నారు.

—అంటే దీన్నిబట్టి రమణమూర్తి నటనలో ఎంతటి ప్రజ్ఞావంతుడో మనకి అర్థం అవుతుంది. అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ చిత్రం ద్వారా మళ్లీ రమణమూర్తి తారాపథంలో జాజ్వల్యమానంగా వెలుగొందగలడని ఆశిద్దాం!

* * *

మినిస్కర్ట్ వేసుకున్న ఒక తార కాళ్లవంక చూస్తూ ఆమె భర్త 'అద్భుతం! నీ కాళ్లు ఎంత అందంగా ఉన్నాయి!' అన్నాడు. అందుకాతార నవ్వి—

'ఆ సంగతి పెళ్లయిన పదేళ్లకయినా గుర్తించారు. సంతోషం' అన్నది.

మొహం చిన్నబుచ్చుకొని ఆయన 'ఆ అవకాశం నాకిప్పుడేగా గుర్తించడానికి!' అన్నాడు.

—మోహన్‌కుమార్

పుస్తకాలు

సంస్కృత పాఠమాల

నవమ, దశమ భాగములు. గ్రంథకర్త: శ్రీ శ్రీపాద దామోదర సాత్వలేకర్, అనువాదకులు శ్రీ గడ్డమణుగు మోహనరావు, శ్రీ కె. వై. యల్. నరసింహారావు, పరిష్కర్త: శ్రీ పళ్లపూర్ల శఠకోపాచార్యులు. క్రామ్ సైజు 9వ భాగం 52 పుటలు. వెల రు. 1—25. 10వ భాగము 4 పుటలు. వెల రు. 1. ప్రతులకు— సంస్కృత భాషా సేవామండలి, మహబూబాబాదు, వరంగల్లు జిల్లా.

సంస్కృతభాషను సులభంగా నేర్చుకోవడానికి అనుకూలంగా సుప్రసిద్ధ విద్వాంసులు సాత్వలేకర్ గారు 24 భాగాలలో చిన్న చిన్న పుస్తకాలను క్రమ పద్ధతిలో రచించి ఉన్నారు— వాటిని తెలుగు వారికి ఉపయోగకరంగా శ్రీ మోహనరావుగారు, శ్రీ నరసింహారావుగారూ అనువదించి సంస్కృత భాషాసేవా మండలి మూలముగా వెలువరిస్తున్నారు— ఇదివరకే ఎనిమిది భాగాలను ప్రకటించారు. అవి చాలా ప్రచారాన్ని పొంది ఉన్నాయి. తర్వాతి రెండు భాగాలు ఇవి.

ఇందలి 9వ భాగంలో హలంత పుంలింగ శబ్దాల రూపాలు వివరించబడినవి. ఇందు పధ్నాలుగు పాఠాలున్నవి. మొదటి పన్నెండు పాఠాల్లోనూ వేర్వేరు శబ్దాలూ, తర్వాత వాని సజాతీయ శబ్దాల వివరణా, అర్థాలతో ఉన్నది. తర్వాత ఆ శబ్దాలను ఉపయోగిస్తూ కూర్చిన చిన్న చిన్న వాక్యాలూ, వాటి అర్థమూ ఉన్నది. చివరి రెండు పాఠాలలోనూ వాక్య సమన్వయ పద్ధతి అర్థాలతో వివరించబడింది. 14వ పాఠంలో రామాయణకథ సులభ పద్ధతిలో ఉండడం విశేషం. చివర సమాసాలను గురించి కూడా తెలుపబడినది.

10వ భాగంలో స్త్రీలింగ శబ్దాల వివరణం కలదు. దానితోపాటు ఆ శబ్దాలుపయోగించిన వాక్యాలు అభ్యాసంకోసం ఇవ్వబడినవి. పన్నెండవ పాఠం మహాభారతంలోని వాక్యాలూ, అన్వయపద్ధతీ ఉన్నది. 13—వ పాఠంలో రామాయణ కథ వచనంలో ఇవ్వబడినది. చివరి పాఠంలో శ్లోక పాదాల రూపంలో ఉన్న సూక్తులూ, వాటి వివరణ ఉన్నది. సంస్కృతంలో కొంత ప్రవేశం సంపాదించిన వారికి ఇవి చాలా ఉపయోగిస్తాయి.

సంస్కృత భాషావ్యాప్తికోసం సంస్కృత భాషా సేవాసమితి వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఈ పాఠమాలల అనువాదం కూడా చాలావరకూ సరిగానే ఉన్నది. అచ్చుతప్పులు కానవస్తున్నవి. స్త్రీలింగం అనడానికి పుంలింగము అని వున్నది, ఒకటి రెండు చోట్ల. ఇది చదువుకునే వారికి తప్పుదారిని చూపిస్తుంది. పునర్ముద్రణంలో అచ్చుతప్పులు లేకుండా చూడడం ఎంతో అవశ్యకం! —అంగిరస

లెనిన్ శతజయంతి ప్రత్యేక సంచిక

ప్రచురణ: ఇండో — సోవియట్ కల్చరల్ సొసయిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాప్తిస్థానం: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ—2., వెల రు 1.

[illegible] ప్రత్యేక సంచిక ఇదని పేరును పట్టి తెలుస్తున్నది. అందంగా ఆకర్షణీయంగా ముద్రింపబడినసంచిక ఇది. ఇంగ్లీషులో లెనిన్‌కు శ్రీశ్రీ సమర్పించిన సెల్యూట్‌తో కలిసి మొత్తం 13 ఇంగ్లీష్ రచనలూ, శ్రీశ్రీ, మాతంపాటి హనుమంతరావు తదితరులు వ్రాసిన మూడు తెలుగుగేయాలూ తొమ్మిది తెలుగు వ్యాసాలూ ఉన్న సంచిక ఇది.

ఇంగ్లీష్‌లో లెనిన్ అండ్ యూనివర్సల్ బ్రదర్‌హుడ్" అనే శీర్షికన డాక్టరు పి. చిరంజీవిని కుమారి వ్రాసిన వ్యాసం పరిశీలించదగినదిగా ఉన్నది. ఆ వ్యాసం 17వ పుటలో దిబేసిస్ ఆఫ్ దిస్ అనాలిసిస్ ఈజ్ ది ప్రపోజిషన్ దట్ ది ఇకనామిక్ స్ట్రక్చర్ ఆఫ్ ది మాన్ డిటర్‌మిన్ ది సోషల్ రిలేషన్‌షిప్స్ ఆఫ్‌ది మెంబర్స్ ఆఫ్ దట్ సొసయిటీ" అనే వాక్యం నుంచి, ది మార్క్సియన్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఈక్వల్‌అపర్‌ట్యూనిటీస్. . సెక్స్ అండ్ కలర్" అనే వాక్యం వరకూ ఉన్న భావాలను ఇంకా కొంత వివరించడమవసరం— చారిత్రకంగా, శాస్త్రీయంగా పరిశీలించడమంటే యేమిటీ? ఎటువంటి పరిశీలన శాస్త్రీయపద్ధతిలో జరిగిన పద్ధతవుతుందీ? కార్య కారణ పద్ధతితో కూడిన హేతువాద దృష్టి పైన పేర్కొన్న వాక్యాలలో ఉన్నదా?

వ్యాసాలన్నీ అభిమానులు వ్రాసినవే కనుక, వాటిలోని లోపాలను గానీ, ఆవ్యాసాలలోని అభిప్రాయాలతో మనం ఏకీభవించుతామా? లేదా?అవే మీమాంసగానీ అనవసర మనుకుంటాను.

కానీ యీ అభిమానానికి ప్రత్యామ్నాయంగా పోలిన వ్యతిరేకంగా మరొక వాదన కలదని సూచించడం అప్రస్తుతం కాదనుకుంటాను. మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టే రాజకీయ విధానం కమ్యూనిజమ్. ఈ రాజకీయ పార్టీకి పునాదులు వేసి నిర్మించిన వ్యక్తి లెనిన్.

లెనిన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు వర్తమాన దేశాలకు ముఖ్యంగా భారత దేశానికి ఎంతవరకూ ఉపయోగ పడుతవి? ఈ దృష్టితో లెనినిజం గురించిన పరిశీలన జరిపితే ప్రయోజనకరంగా ఉంటుంది దేశానికి. మరి లెనిన్ ప్రతిపాదించిన సామ్రాజ్యవాద సిద్ధాంతం యీనాడు కూడా చెల్లుతుందా? పూర్వం వలసలుగా ఉండిన చాలా దేశాలు ఈనాడు స్వతంత్ర రాజ్యాలయినయ్. పశ్చిమ దేశాల పెట్టుబడిదారీ విధానంలో అధికలాభాల పద్ధతి కనిపించదు ఈనాడు. లెనిన్ ఊహించినట్లు అంతరగత వైరుధ్యాల ఫలితంగా పెట్టుబడిదారీ విధానం వాడిపోయిందా? ఇవన్నీ తీరికగా, వివరంగా పరిశీలించదగిన అంశాలు.

ఆర్థికాభ్యున్నతి కృషి సందర్భంలో ఆధునిక ప్రపంచం, విశేషించి, వర్ధమాన దేశాలు పెద్ద సవాలును ఎదుర్కొంటున్న సమయంలోనే యీనాడు లెనినిజమ్ ప్రాముఖ్యం ఉన్నది. నియంతృత్వ పద్ధతుల ననుసరించకుండా, ప్రజాస్వామిక పద్ధతులలో ఆర్థికాభ్యున్నతిని సాధించడం సాధ్యం కాదా? ఈ కృషితో లెనినిజమ్ ఇండియాకు ఎంత ఉపయోగపడుతుంది!

—వి. ఎస్. అవధాని.

Printed and Published by S Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

ప్రత్యేక సదుపాయం!

సరకు ఉన్నంత వరకే



ప్రతి డబ్బాలో ఇదివరకు ఉన్నంత బోర్న్‌విటా (450 గ్రా. నికరం) ఉంటుంది.

శక్తి, ఉత్సాహం మరియు రుచికోసం – క్యాడ్‌బరీస్ బోర్న్‌విటా!

Bensons/5322 TEL


ప్రతివారికీ
రక్షణ
కావాలి
CINTHOL
TOILET POWDER
ఈ రక్షణ బాక్టీరియానుండి, చెమట
వాసననుండి—మీరు, ఇతరులు
సంకోచపడే అవస్థనుండి—
జి–11 (హెక్సాక్లోరోఫిన్)తో
కూడిన
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకీ రక్షణలన్నీ ఇస్తుంది
ఇవేకాదు—సువాసన
సుమసుగంధము
సింథాల్—
దుర్గంధములనుండి
సంపూర్ణ రక్షణనిచ్చు
టాయిలెట్ పౌడరు
Interpub/CIP/5 Tel